ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శుక్రవారం 12.12.2025 | సంపుటి :12 సంచిక : 143 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



# శభాష్ రేవంత్

## తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ విజయవంతంపై సీఎం రేవంత్‌ను అభినందించిన ఖర్గే, ప్రియాంక

- సదస్సు వివరాలను అగ్రనేతలకు వివరించిన ముఖ్యమంత్రి
- మెస్సీ కార్యక్రమానికి రావాల్సిందిగా ఆహ్వానం

ఢిల్లీ(జనంసాక్షి): తెలంగాణ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అభినందనలు తెలిపారు. తెలంగాణ భవిష్యత్ ముఖచిత్రాన్ని డాక్యుమెంట్ ఆవిష్కరించిందని వారు పేర్కొన్నారు. ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీలను వారి నివాసాల్లో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైన తీరు, తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణపై వారి మధ్య చర్చ కొనసాగింది. సమ్మిట్‌లో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రాబట్టేందుకు ఒప్పందాలు చేసుకోవడంపై అగ్ర నేతలు సీఎంను ప్రశంసించారు. సీఎం వెంట మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు సురేశ్ షెట్కార్, మందాడి అనిల్ కుమార్, పోరిక బలరాం నాయక్, డాక్టర్ మల్లు రవి, కుందూరు రఘువీర్ రెడ్డి, గడ్డం వంశీకృష్ణ ఉన్నారు.

### మెస్సీ కార్యక్రమానికి హాజరుకండి..

'మెస్సీ గోట్ ఇండియా టూర్' కార్యక్రమానికి



కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ఆహ్వానించినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఢిల్లీ పర్యటన ముగించుకొని హైదరాబాద్ బయలుదేరే ముందు పార్లమెంట్ ఆవరణలో సీఎం మీడియాతో మాట్లాడారు. "ఈనెల 13న ప్రముఖ ఫుట్‌బాల్ క్రీడాకారుడు మెస్సీ హైదరాబాద్ వస్తున్నారు. ఒక ప్రముఖ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హాజరు అవుతున్నారు. ముఖ్యమంత్రిగా ఉన్నా కాబట్టి నన్ను కూడా ఒక అతిథిగా పిలిచారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఈ కార్యక్రమానికి ఎలాంటి సంబంధం లేదు. ప్రముఖ క్రీడాకారుడు వస్తున్నారు కాబట్టి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఇస్తున్నాం. ఢిల్లీలో కలిసిన అందరినీ ఈ కార్యక్రమానికి రావాలని పిలిచా" అని తెలిపారు. మిగతా 2లో..



## తెలంగాణలో బీసీ బిల్లుపై కేంద్రం స్పందించాలి

- రాష్ట్ర ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని మద్దతు తెలపాలి
- లోక్‌సభలో ప్రస్తావించిన ఎంపీ చామల

2లో..



ఏటునాగారంలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు భారీగా బారులు తీరిన మహిళలు

# ఓటెత్తిన పల్లెలు

### తొలి విడతలో పంచాయితీ ఎన్నికల్లో భారీగా తరలివచ్చి ఓటేసిన గ్రామీణం

### 84.28 % పోలింగ్ నమోదు

- యాదాద్రి జిల్లాలో అత్యధికంగా 92.88%
- జిల్లా కొత్తగూడెంలో అత్యల్పంగా 71.79 %
- ఆధిక్యంలో కొనసాగుతున్న కాంగ్రెస్
- మూడుచోట్ల లాటరీలో సర్పంచుల ఎన్నిక
- మూడు సర్పంచి స్థానాలు లాటరీ ద్వారా ఎన్నిక

## తొలివిడతలో హస్తానిదే హవా..

- భారీ సంఖ్యలో సర్పంచులుగా విజయం సాధించిన హస్తం మద్దతుదారులు
- ఇది ప్రజల విశ్వాసానికి నిదర్శనం
- సర్పంచి ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంపై మహేశ్ గౌడ్ హర్షం

హైదరాబాద్(జనంసాక్షి):గురువారం జరిగిన తొలివిడత పంచాయితీ పోరులో కాంగ్రెస్ మద్దతుదారులు అధిక సంఖ్యలో సర్పంచులుగా విజయం సాధించారు. రెండో స్థానంలో బీఆర్ఎస్ నిలవగా తక్కువ సంఖ్యతో బీజేబీ అభ్యర్థులు గెలుపొందారు. తొలి విడతలో మూడు సర్పంచి స్థానాలు లాటరీ ద్వారా తేలాయి. యాదాద్రి జిల్లా లక్ష్మక్కపల్లిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతిచ్చిన అభ్యర్థులకు 148 ఓట్లు వచ్చాయి. దాంతో, విజేతను తేల్చడం కోసం అధికారులు లాటరీ తీశారు. లాటరీలో బీఆర్ఎస్ అభ్యర్థి ఇండ్ల రాజయ్య సర్పంచ్‌గా ఎంపికయ్యారు. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం సూరంపల్లిలోనూ మిగతా 2లో..

## మృతిచెందిన అభ్యర్థికి 'జై' కొట్టిన జనం!

రాష్ట్ర పంచాయతీ ఎన్నికల్లో సంచలనం

- గుండెపోటుతో మరణించినా 700కు పైగా ఓట్లతో గెలుపు
- సానుభూతి ఓట్లతో గ్రామస్తుల నివాళి
- బీఆర్ఎస్ అభ్యర్థి చెర్ల మురళి ఘన విజయం
- వేములవాడలో గ్రామస్తుల భావోద్వేగ ఓటు

11లో..

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో తొలి విడత జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లు పోటెత్తారు. 45,15,141 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఫలితంగా మొదటి దఫా ఎలక్షన్స్‌లో 84.28 పోలింగ్ నమోదైంది. యాదాద్రి జిల్లాలో అత్యధికంగా 92.88 ఓటింగ్ నమోదైంది. మిగతా 2లో..

## మంత్రి సురేఖపై నాన్ బెయిలబుల్ వారెంట్

### జారీ చేసిన నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు

### నాన్ బెయిలబుల్ వారంట్ అబద్ధం: కొండా సురేఖ

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్ర మంత్రి కొండా సురేఖపై నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. తనపై మంత్రి సురేఖ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పరువునష్టం కేసు వేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో విచారణకు హాజరుకాకపోవడంతో నాంపల్లి కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 5కి వాయిదా వేసింది.

### నాన్ బెయిలబుల్ వారెంట్ అబద్ధం:కొండా సురేఖ

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరువు నష్టం దావా కేసులో నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయినట్లు తనపై జరుగుతున్న ప్రచారంపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పందించారు. కొన్ని పత్రికలు, ఛానళ్లు, వెబ్ సైట్లలో తనకు కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసినట్లు వార్తలు వస్తున్నాయన్నారు. ఈ వార్తలు పూర్తిగా అవాస్తవం అని ఆమె గురువారం హదరాబాద్‌లో స్పష్టం చేశారు. ఈ కేసులో తదుపరి విచారణ.. ఫిబ్రవరి 5వ తేదీన మిగతా 2లో..

### ప్రపంచ శాంతి, స్థిరత్వం కోసం

## అమెరికా-భారత్‌లు కలిసి పనిచేస్తూనే ఉంటాయి

### ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని నరేంద్ర మోదీ

### ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై చర్చించినట్లు వెల్లడి



న్యూఢిల్లీ(జనంసాక్షి):అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. ద్వైపాక్షిక సంబంధాల్లో పురోగతిని సమీక్షించినట్లు, ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై చర్చించినట్లు మోదీ ట్వీట్ చేశారు. ప్రపంచ శాంతి, స్థిరత్వం కోసం ఇరుదేశాలు కలిసి పనిచేస్తూనే ఉంటాయని పేర్కొన్నారు. పుతిన్ భారత పర్యటన మిగతా 2లో..

## అమిత్ షాలో ఆందోళన నెలకొంది



### లోక్‌సభలో ఆయన భాషకూడా సరిగా లేదు

### నా ప్రశ్నలకు ఆయన నుంచి ఎలాంటి సమాధానం రాలేదు:రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):కేంద్ర హోంమంత్రి అమిత్ షా బుధవారం కంగారుగా కనిపించారని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు ఆయన వాడిన భాష కూడా సరిగా లేదని విమర్శించారు. మిగతా 2లో..

### శీతాకాల విడిది కోసం

## హైదరాబాద్‌కు రాష్ట్రపతి ముర్ము

### 17 నుండి 21 వరకు ముర్ము పర్యటన

### అధికారులతో సమీక్షించిన సిఎస్ రామకృష్ణారావు



హైదరాబాద్(జనంసాక్షి): శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 17 నుంచి 21 వరకు హైదరాబాద్ రాష్ట్రపతి నిలయంలో బస చేస్తారని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తెలిపారు. ఐదు రోజులపాటు రాష్ట్రంలో రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్ల పై గురువారం డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేసి విస్తృత ఏర్పాట్లు చేయాలని సి.ఎస్. ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ విభాగాలు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, రాష్ట్రపతి నిలయం అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలీసు శాఖ తగు భద్రతా, ట్రాఫిక్, బందోబస్త్ ప్రణాళికను రూపొందించాలని, అగ్నిమాపక శాఖ అవసరమైన సిబ్బందితో పాటు తగిన అగ్నిమాపక ఏర్పాట్లు, ఫైర్ టెండర్లను ఏర్పాటు చేయాలని, వైద్య, ఆరోగ్యశాఖ వైద్య బృందాన్ని మిగతా 2లో..

## సిట్ ఎదుట వెంటనే లొంగిపోండి



### ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావుకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్‌రావుకు సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన వెంటనే సిట్ ముందు లొంగిపోవాలని ఆదేశించింది. ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్.మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం.. శుక్రవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ పీఎస్‌లో సిట్ అధికారి ఎదుట లొంగిపోవాలని ఆదేశించింది. కస్టోడియల్ దర్యాప్తనకు సిట్‌కు అనుమతిచ్చిన ధర్మాసనం.. ప్రభాకర్‌రావుకు భౌతికంగా ఎలాంటి హాని లేకుండా చూడాలని స్పష్టం చేసింది. పిటిషనర్‌కు మధ్యంతర రక్షణ కల్పిస్తూ విచారణకు సహకరించాలని కోర్టు చెప్పినా.. ఆయన దర్యాప్తునకు సహకరిం చడం లేదని రాష్ట్ర ప్రభుత్వం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఐక్లౌడ్ పాస్‌వర్డ్‌లను రీసెట్ చేసి అందులోని వివరాలను దర్యాప్తు అధికారులకు చూపించాలని కోర్టు ఆయనకు చెప్పినప్పటికీ కేవలం రెండు పాస్‌వర్డ్‌లను మాత్రమే రీసెట్ చేశారని.. రీసెట్ చేసిన రెండు అకౌంట్లలోని సమాచారాన్ని ముందే డిలీట్ చేశారని చెప్పారు. జస్టిస్ బీవీ నాగరత్న స్పందిస్తూ.. 'కోర్టు పిటిషనర్‌కు మధ్యంతర మిగతా 2లో..




## నాణేలు, వారసత్వ అధ్యయనాల్లో తెలంగాణ అగ్రభాగంలో నిలవాలి

- నాణేల పరంపరకు దక్షిణ భారతం ప్రసిద్ధి
- నాణేల అధ్యయనం అంటే ఆలోచనలను అధ్యయనం చేయడమే
- న్యూ మిస్ మ్యాటిక్స్ జాతీయ సెమినార్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

హైదరాబాద్(జనంసాక్షి):న్యూ మిస్ మ్యాటిక్స్ (నాణేల అధ్యయనం), వారసత్వ అధ్యయనాల్లో తెలంగాణ అగ్రస్థానంలో నిలవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం ఆయన మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల విభాగంలో ఏర్పాటుచేసిన 'దక్షిణ భారతదేశ నాణేలు ,ఆర్థిక వ్యవస్థ' అనే అంశంపై న్యూ మిస్ మ్యాటిక్స్ సొసైటీ ఏర్పాటు చేసిన జాతీయ సెమినార్ లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సదస్సు రెండు రోజులు జరిగే కార్యక్రమంగా మాత్రమే కాకుండా, ఒక చిచ్చరపిడుగులా కొత్త ఆలోచనలను రగిలించే వేదిక కావాలని నా ఆశ అన్నారు. వివిధ సంస్థల మధ్య సహకారం పెరగాలి, యువ పరిశోధకులు అంతర శాస్త్రీయ అధ్యయనాలపై దృష్టి పెట్టాలి, న్యూ మిస్ మ్యాటిక్స్, వారసత్వ అధ్యయనాల్లో తెలంగాణ ముందంజలో మిగతా 2లో..

### హెచ్-1 వీసా ఇంటర్వ్యూల వాయిదా..

## వీసాదారుల్లో గందరగోళం




### ఇండియాకు వెళ్లొద్దని లాయర్ల సూచన

వాషింగ్టన్(జనంసాక్షి):భారత్‌లో డిసెంబర్‌లో జరగాల్సిన వీసా ఇంటర్వ్యూలను వచ్చే ఏడాదికి అమెరికా వాయిదా వేసిన క్రమంలో ఎవ్వరు కూడా ఇప్పుడు ఇండియాకు వెళ్లవద్దని సూచిస్తున్నారు. ఏడాది ఏప్రిల్, మే నెలల్లో ఇంటర్వ్యూలు ఉండొచ్చంటూ ఇటీవల అకస్మాత్తుగా లబ్దిదారులకు సందేశాలు పంపించింది. దీంతో, ఒక్కసారిగా కలకలం రేగింది. లబ్దిదారుల సోషల్ మీడియా అకౌంట్స్ పరిశీలన నిబంధనలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో వీసా ఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయి. దీంతో, అమెరికాలోని హెచ్-1బీ వీసాదారులకు అక్కడి ఇమిగ్రేషన్ లాయర్లు కీలక సూచనలు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో వీసా స్టాంపింగ్ కోసం భారత్‌కు వెళ్లడం మంచిది కాదని హెచ్చరిస్తున్నారు హెచ్-1బీ వీసా కాలపరిమితి ఇంకా ముగియని వారు మాత్రమే తమ సొంత దేశాలకు వెళ్లి రావొచ్చని ఇమిగ్రేషన్ లాయర్స్ చెబుతున్నారు. హెచ్-1బీ వీసాదారులు తిరిగి అమెరికా వెళ్లాలంటే తమ సొంత దేశాల్లోని యూఎస్ కాన్సులార్ కార్యాలయాల ఆమోదముద్ర తప్పనిసరి. కాబట్టి ఇంటర్వ్యూలు వాయిదా పడిన ప్రస్తుత పరిస్థితుల్లో హెచ్-1బీ హోల్డర్స్ తమ మిగతా 2లో..

## మార్చి నాటికి భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం

9లో..

### రష్యా నుంచి చమురు దిగుమతుల్లో

## తగ్గేదెలే..

### ఎప్పటిలానే పెద్దమొత్తంలో కొనుగోలు చేస్తున్న భారత్



న్యూఢిల్లీ(జనంసాక్షి):రష్యా చమురు దిగుమతుల విషయంలో భారత్ ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. అమెరికా ఆంక్షలకు తలొగ్గకుండా డిస్కౌంట్ ధరకు లభిస్తున్న చమురును ఎప్పటిలానే పెద్దమొత్తంలో దిగుమతి చేసుకుంటోంది. డిసెంబర్ నెలలో సగటున రోజుకు 18.5 లక్షల బ్యారెళ్ల చొప్పున చమురును దిగుమతి చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. నవంబర్‌లో 18.3 లక్షల బ్యారెళ్లను దిగుమతి చేసుకున్న భారత్.. డిసెంబర్ నెలలో దానిని మరింత పెంచుతోంది. దీంతో దిగుమతులు ఆరు నెలల గరిష్ఠానికి చేరనున్నాయని కమోడిటీ అనలిస్ట్ కెప్లర్ పేర్కొంది. ఈ ఏడాది జూన్‌లో గరిష్ఠంగా రోజుకు 21 లక్షల బ్యారెళ్లను భారత్ దిగుమతి చేసుకుంది. ఆ తర్వాత ఇదే అత్యధికం కానుంది.ఉక్రెయిన్‌తో యుద్ధం విషయంలో రష్యాపై ఒత్తిడి పెంచేందుకు మాస్కోకు చెందిన ఆయిల్ ఉత్పత్తిదారులైన లుకోయిల్, రాస్‌నెఫ్ట్‌పై అమెరికా ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. దీంతో భారత్ దిగుమతులు తగ్గుతాయని భావించారంతా. కానీ, భారత్ మాత్రం చమురు కొనుగోళ్ల విషయంలో ఏమాత్రం వెనక్కి తగ్గలేదని గణాంకాలు చెబుతున్నాయి. గుజరాత్‌లోని మిగతా 2లో..

## 'సర్'గడువు పొడిగింపు

- పలు రాష్ట్రాల్లో కొనసాగించిన ఈసీ
- పశ్చిమబెంగాల్, రాజస్థాన్, లక్షద్వీప్, గోవాల్లో ముగిసిన ప్రక్రియ

న్యూఢిల్లీ(జనంసాక్షి):తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి ఎన్నికల సంఘం తాజా అప్‌డేట్ ఇచ్చింది. వీటిలో తమిళనాడు, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తర్‌ప్రదేశ్ సహా అండమాన్ నికోబార్ దీవుల్లో ఈ గడువును పొడిగించింది. పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, లక్షద్వీప్, మిగతా 2లో..

## 'సర్'పై మహిళలు పోరాడాలి

### మీ కిచెన్ టూల్స్‌తో సిద్ధంగా ఉండండి: మమత

2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
12.12.2025

## శభాష్ రేవంత్

ఈనెల 13న ఉప్పల్ స్టేడియంలో జరిగే ఫుట్‌బాల్ మ్యాచ్‌లో మెస్సీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారులు పాల్గొంటున్నారు. మెస్సీ పర్యటన, ప్రముఖుల రాక నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

## ప్రణబ్‌కు సీఎం రేవంత్ నివాళులు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దశాబ్దాల పాటు ప్రజాసేవకు అంకితమైన గొప్ప నాయకుడు ప్రణబ్ ముఖర్జీ.. అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ జయంతి సందర్భంగా.. ఢిల్లీలోని నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి.. ప్రణబ్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళు లర్పించారు. ఈ సందర్భంగా.. ప్రణబ్ ముఖర్జీ దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీలు డా.మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, గడ్డం వంశీ, అనిల్ కుమార్ యాదవ్, నాయకులు రోహిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సిట్ ఎదుట వెంటనే లొంగిపోండి

రక్షణ కల్పించడం వల్ల దర్యాప్తునకు సహకరించట్లేదని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. దీనిపై మీరేమంటారు' అని ప్రభాకర్‌రావు తరఫున న్యాయవాది రంజిత్‌కుమార్‌ను ప్రశ్నించారు. పిటిషనర్ దర్యాప్తునకు సహకరిస్తున్న విషయాలను వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేసినట్లు ఆయన చెప్పారు. ఆ అఫిడవిట్‌ను మంగళవారం సాయంత్రం 4 గంటలకు దాఖలు చేయడంతో పరిశీలించలేదని రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది సిద్దార్థ లూథ్రా బుధవారం జరిగిన విచారణ సందర్భంగా చెప్పారు. ఇరువైపులా వాదనల అనంతరం సిట్ అధికారి ఎదుట ప్రభాకర్‌రావు లొంగిపోవాలని ధర్మాసనం గురువారం ఆదేశాలు జారీ చేసింది.

## బీసీ బిల్లుపై కేంద్రం స్పందించాలి

న్యూఢిల్లీ(జనంసాక్షి):తెలంగాణ ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని బీసీ బిల్లుకు మద్దతు తెలపాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. లోక్‌సభ జీరో అవర్‌లో.. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావించారు. "తెలంగాణలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలు, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గం, అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించారు. అనంతరం బీసీ బిల్లును ఆరు నెలల క్రితమే గవర్నర్ వద్దకు పంపినా.. ఇప్పటివరకు నిర్ణయం తీసుకోలేదు. ఓబీసీ వర్గానికి చెందిన నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా ఉన్నారు.. వెంటనే జోక్యం చేసుకుని బీసీ రిజర్వేషన్ల బిల్లులను ఆమోదించాలని కోరుతున్నా" అని ఎంపీ చామల తెలిపారు.

## తెల్లారిన బతుకులు

- వెయ్యి అడుగుల లోయలో పడ్డ కూలీలతో వెళ్తున్న ట్రక్కు..
- 14 మంది మృతదేహాల గుర్తింపు.. రెండురోజుల తర్వాత వెలుగులోకి..



**ఈటానగర్(జనంసాక్షి):**అరుణాచల్ ప్రదేశ్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. 1000 అడుగుల లోయలో ట్రక్కు అదుపుతప్పి పడిపోవడంతో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. వారంతా కూలీలని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి అస్సాంలోని తీన్‌సుకియా ప్రాంతానికి చెందిన కూలీలు ట్రక్కులో పనికి వెళ్తున్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని హయులియాంగ్- చాగ్లగామ్ సమీపంలోకి రాగానే వాహనం అదుపుతప్పి వెయ్యి అడుగుల లోయలోకి పడిపోయింది. డిసెంబర్ 8 రాత్రి ఈ ఘటన జరిగింది. కానీ రెండురోజుల వరకు ఆ ప్రమాదం గురించి ఎవరికీ తెలియలేదు. ఆ ఘటన నుంచి బయటపడిన ఒక వ్యక్తి డిసెంబర్ 10న దగ్గర్లోని భారత సాయుధదళాలకు చెందిన క్యాంప్ వద్దకు వచ్చి సమాచారం ఇవ్వడంతో ప్రమాదం గురించి వెలుగులోకి వచ్చింది.ప్రమాద సమయంలో ట్రక్కులో 22 మంది ఉన్నట్టు ఆ వ్యక్తి వెల్లడించారు. దీంతో భారత ఆర్మీ, స్థానిక పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, జిల్లా యంత్రాంగం రంగంలోకి దిగాయి. భారీ స్థాయిలో సెర్చ్ ఆపరేషన్‌ను ప్రారంభించాయి. రెండు గంటల తర్వాత భద్రతాసిబ్బందికి ట్రక్కు కనిపించింది. ఇప్పటివరకు 14 మృతదేహాలను గుర్తించారు. ఈ ట్రక్కు పడిన ప్రాంతం రోడ్డు మీద నుంచి కానీ, హెలికాప్టర్ నుంచి కానీ కనిపించదని అధికారులు తెలిపారు. మొత్తం ఆకులతో నిండిపోయి, బయటి ప్రపంచంతో అంతగా అనుసంధానం లేని ఈ ప్రాంతం నుంచి మృతదేహాలను బయటకు తీయడం కూడా క్లిష్టంగా మారిదని వెల్లడించారు.

**గోవా నైట్‌క్లబ్‌లో అగ్నిప్రమాద ఘటన..**

## థాయ్‌లాండ్‌లో యజమానులు అదుపులోకి

**పనాజీ(జనంసాక్షి):**గోవా నైట్‌క్లబ్ అగ్నిప్రమాదంపై ముమ్మర దర్యాప్తు జరుగుతోంది. ఈ కేసులో ప్రధాన నిందితులు, క్లబ్ యజమానులు సౌరభ్ లూథ్రా, గౌరవ్ లూథ్రాలను థాయ్‌లాండ్‌లో అదుపులోకి తీసుకున్నారు. అక్కడి అధికారులు వారిని అదుపులోకి తీసుకున్న దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ఈనెల 6న రాత్రి 11.45 గంటల సమయంలో ప్రమాదం చోటుచేసుకోగా.. నిందితులిద్దరూ 7న ఉదయం 5.30 గంటలకు ఓ విమానంలో థాయ్‌లాండ్‌లోని పుకెట్‌కు పారిపోయినట్లు ముంబయిలోని 'బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్' గుర్తించినట్లు ఇప్పటికే పోలీసులు తెలిపారు. వారి పాస్‌పోర్టులు సస్పెండ్ అయిన నేపథ్యంలో ఆ దేశంలో ఉండటం చట్టవిరుద్ధం. దాంతో అధికారులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని 24 గంటల్లో భారత్‌కు తరలించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి..

## అజ్ఞాతం వీడిన నోబెల్ శాంతి గ్రహీత

**నార్వేలో ప్రత్యక్షమై..మద్దతుదారులకు అభివాదం తెలిపిన మచాడో**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, వెనెజువెలా విపక్ష నేత మరియా కొరినీ మచాడో అజ్ఞాతం వీడారు. దాదాపు ఏడాది పాటూ అజ్ఞాతంలో ఉన్న ఆమె తాజాగా నార్వేలో ప్రత్యక్షమయ్యారు. నార్వేలోని ఓ హోటల్ వద్ద బహిరంగంగా కనిపించారు. ఈ మేరకు తన మద్దతుదారులకు అభివాదం చేశారు. కాగా, ఈ ఏడాది నోబెల్ బహుమతి మచాడోను వరించిన విషయం తెలిసిందే. బుధవారం నార్వే రాజధాని ఓస్లోలో ప్రదానోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మచాడో హాజరుకాలేదు. దీంతో ఆమె కుమార్తె నోబెల్ బహుమతిని స్వీకరించారు. ఇక ఈ కార్యక్రమం జరిగిన కొన్ని గంటల్లోనే మచాడో అజ్ఞాతం వీడి పబ్లిక్‌లోకి వచ్చారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. వెనెజువెలాలో మదురో నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా అనేక ఏళ్లుగా సాగుతున్న ప్రజాస్వామ్య అనుకూల ఉద్యమానికి మచాడో సారథ్యం వహిస్తున్నారు. ఆమె బెదిరింపులను ఎదుర్కోవడమే కాక అరెస్టు కూడా అయ్యారు.

# ఓటెత్తిన పల్లెలు



బుధవారం ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్.. మధ్యాహ్నం ఒంటిగంటతో పూర్తయ్యింది. పలుచోట్ల ఒంటిగంట వరకు క్యూలో ఉన్న ఓటర్లకు అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం అయ్యింది. రాత్రి వరకు పోలింగ్ ఫలితాలు ప్రకటించి.. ఉప సర్పంచ్ ఎన్నికలను నిర్వహించారు. చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా సాగింది. కలెక్టర్లు, పోలీస్ ఉన్నతాధికారులు పోలింగ్‌ను పర్యవేక్షించారు. తొలి విడుతలో 4,236 సర్పంచ్ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల కాగా.. ఇందులో 396 సర్పంచ్ స్థానాలు, 9,633 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగతా 3,834 సర్పంచ్ స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. 12,960 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మూడు విడుతల్లో జరుగనున్న పంచాయతీ ఎన్నికల కోసం 93,905 మంది సిబ్బందిని నియమించినట్టు ఎస్ఈసీ కమిషనర్ పేర్కొన్నారు. మూడు విడుతల్లో జరుగనున్న పంచాయతీ ఎన్నికల కోసం 93,905 మంది సిబ్బందిని నియమించినట్టు ఎన్నికల అధికారులు తెలిపారు. 3,591 మంది రిటర్నింగ్ అధికారులను, 2,489 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు చెప్పారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా 3,461 పోలింగ్ కేంద్రాలను.. 45,086 బ్యాలెట్ బాక్సులను వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఇకపోతే పెద్ద సంఖ్యలో ఓటర్లు క్యూన్లలో బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తొలి విడుతలో 4,236 సర్పంచ్ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల కాగా.. ఇందులో 396 సర్పంచ్ స్థానాలు, 9,633 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఇక మిగతా 3,834 సర్పంచ్ స్థానాలకు పోటీ చేస్తుండగా.. 12, 960 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అలాగే, ఒక గ్రామ పంచాయతీ, పది వార్డుల్లో ఎన్నికలను నిలిపివేసినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. 56,19,430 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు ఇందులో పురుషులు 27,41,070, మహిళలు 28,78,159, ఇతరులు 201 మంది ఉన్నారు. మూడు విడుతల్లో జరుగనున్న పంచాయతీ ఎన్నికల కోసం 93,905 మంది సిబ్బందిని నియమించినట్టు ఎస్ఈసీ కమిషనర్ పేర్కొన్నారు. 3,591 మంది రిటర్నింగ్ అధికారులను, 2,489 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించినట్టు చెప్పారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా 3,461 పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు చెప్పారు. 45,086 బ్యాలెట్ బాక్సులను వినియోగించిట్టు చెప్పారు.

## తొలివిడతతో హస్తానిదే హవా

లాటరీ తప్పలేదు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు సమానంగా 276 ఓట్లు వచ్చాయి. లాటరీ తీయగా బీఆర్ఎస్ బలపరిచిన మైలారం పోచయ్య సర్పంచ్ అయ్యారు. రంగారెడ్డి జిల్లా కొందుర్గ్ మండలం చిన్న ఎల్క చెర్లలో బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులకు 212 ఓట్లు వచ్చాయి. రీకౌంటింగ్ లోనూ ఇద్దరికీ సమాన ఓట్లు రావడంతో అధికారులు.. టాస్ వేశారు. టాస్‌లో.. కాంగ్రెస్ అభ్యర్థి మరాఠి రాజ్‌కుమార్‌ను అదృష్టం వరించింది.రేగోడ్ మండలం కొండాపూర్‌లో ఒక్క ఓటు తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి బేగరి పాండరి గెలుపొందారు. వెలువడిన ఫలితాలను బట్టి కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు ఆధిక్యంలో దూసుకెళ్లారు పోలింగ్‌లో 3,834 సర్పంచి పదవులకు 12,960 మంది అభ్యర్థులు, 27,628 వార్డు సభ్యుల స్థానాలకు 65,455 మంది పోటీ పడ్డారు. ఇప్పటివరకు వెలువడిన ఫలితాల ప్రకారం.. ఏకగ్రీవంతో కలుపుకొని 776 మందికిపైగా కాంగ్రెస్ మద్దతుదారులు సర్పంచ్‌లుగా విజయం సాధించారు. భారత రాష్ట్ర సమితి బలపర్చిన అభ్యర్థులు 312 మంది, భాజపా 63 మంది, ఇతరులు 164 మంది గెలుపొందారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం తిమ్మయ్యపల్లె గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తల్లి, కుమార్తె మధ్య ఆసక్తికర పోరు నడిచింది. తిమ్మయ్యపల్లె రిజర్వేషన్‌లో బీసీ మహిళకు కేటాయించారు. దీంతో శివరాత్రి గంగవ్వకు భారత రాష్ట్ర సమితి మద్దతు ప్రకటించగా.. కుమార్తె సుమలతను అధికార కాంగ్రెస్ బలపరిచింది. పోలింగ్ అనంతరం జరిగిన ఓట్ల లెక్కింపులో తల్లి గంగవ్వపై సుమలత 91 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం బద్యాతండాలో ఓట్ల లెక్కింపులో గందరగోళం నెలకొంది. మొదట ఒక ఓటుతో కాంగ్రెస్ మద్దతుదారు సర్పంచిగా గెలిచినట్టు ప్రకటించారు. రెండోసారి రీకౌంటింగ్‌లో 3 ఓట్ల తేడాతో భారత రాష్ట్రసమితి మద్దతుదారు విజయం సాధించినట్టు



ప్రకటించారు. కాంగ్రెస్ మద్దతుదారు ఆందోళనతో అధికారులు మూడోసారి ఓట్ల లెక్కింపు చేపట్టారు. యాదాద్రి జిల్లా లక్ష్మక్కపల్లిలో ఉత్కంఠ పోరు సాగింది. సర్పంచ్ అభ్యర్థులు ఇద్దరికీ సమానంగా 148 చొప్పున ఓట్లు రావడంతో అధికారులు లాటరీ తీశారు. డ్రాలో భారత రాష్ట్ర సమితి మద్దతుదారు ఇండ్ల రాజయ్యను విజయం వరించింది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి స్వగ్రామం రంగారెడ్డిగూడెంలో భాజపా బలపరిచిన సర్పంచి అభ్యర్థి రేవతి 6 ఓట్ల తేడాతో విజయం సాధించారు.పంచాయతీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పలుచోట్ల స్వల్ప ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. నల్గొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో కాంగ్రెస్, భారత రాష్ట్రసమితి నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, డెయిరీ కార్పొరేషన్ ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి మధ్య మాటల యుద్ధం జరిగింది. ఇరువర్గాలను పోలీసుల చెదరగొట్టారు. కేతేపల్లి మండలం కొర్లపహాడ్‌లో రాళ్లు, కత్తులతో ఇరువర్గాలు పరస్పరం దాడులకు దిగాయి. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. వారిని ఆస్పత్రికి తరలించారు. దీంతో గ్రామంలో భారీగా పోలీసులు మోహరించారు.నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కుప్పగండ్ల పదోవార్డులో పోలింగ్ కాసేపు నిలిచిపోయింది. బ్యాలెట్ పేపర్‌పై వార్డు అభ్యర్థి దేరాంగుల యాదమ్మకు గుర్తు కేటాయించకపోవడంతో అధికారులు పోలింగ్‌ను నిలిపివేశారు. అరగంట తర్వాత వేరే బ్యాలెట్ పేపర్లు తీసువచ్చి పోలింగ్‌ను కొనసాగించారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పాలమాకుల పోలింగ్ కేంద్రం వద్ద వృద్ధులు, దివ్యాంగులు అవస్థలు పడుతున్నారు. వీల్‌ఛైర్‌లు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. కుటుంబసభ్యులు వారిని చేతులపై మోసుకుంటూ వెళ్లి ఓటు వేయిస్తున్నారు.

**ఇది ప్రజల విశ్వాసానికి నిదర్శనం:మహేశ్ గౌడ్**

రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచి ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారుల విజయం.. ప్రజల విశ్వాసానికి నిదర్శనమని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. పంచాయతీ ఎన్నికల తొలి విడతలో.. కాంగ్రెస్ మద్దతుదారులైన అభ్యర్థులు ఘన విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లో సామాజిక న్యాయం స్పష్టంగా కనిపించిందన్నారు. మొదటి విడత ఎన్నికల్లో 90 శాతం కంటే ఎక్కువ స్థానాల్లో కాంగ్రెస్ అనుబంధ అభ్యర్థులే గెలుపొందడం.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల ఆశయాలకు అద్దం పట్టే ఈ ఫలితాలు, ప్రభుత్వంపై వారి అపార నమ్మకాన్ని తిరిగి చాటుతున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు విడుదల చేసిన ప్రకటనలో అభిప్రాయపడ్డారు. పంచాయతీ ఎన్నికలను కాంగ్రెస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో, పార్టీ తరఫున ఎన్నికల పర్యవేక్షణలో కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. నిరంతరం మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులను సమన్వయం చేస్తూ గ్రామ స్థాయి వరకు ప్రచార వ్యూహాలు రూపొందించి అమలు చేసిన విధానమే ఈ విజయానికి ప్రధాన కారణమన్నారు. గ్రామీణ స్థాయిలో పార్టీని బలోపేతం చేసే క్రమంలో, ప్రజలను నేరుగా కలిసే పద్ధతి కాంగ్రెస్‌కు మరింత అనుకూలంగా మారిందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండు సంవత్సరాల ప్రజాపాలన సంక్షేమం- అభివృద్ధి పథకాలతో ప్రజలకు చేరువైందని, ప్రజా పాలన పట్ల ప్రజల సంతృప్తి పంచాయతీ ఎన్నికల్లో స్పష్టంగా ప్రతిఫలించిందని మహేశ్‌గౌడ్ అన్నారు.ఎన్నికల్లో స్పష్టంగా ప్రతిఫలించిందని మహేశ్‌గౌడ్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు.. గ్రామస్థాయి సమస్యలను అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి కట్టుబడి పనిచేయడం, గ్రామీణ ఓటర్లలో కాంగ్రెస్‌పై విశ్వాసం పెరిగేందుకు కారణమైందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మైనారిటీలు, దళితులు, గిరిజనులు, మహిళలు, రైతులు, యువత విస్తృతంగా కాంగ్రెస్‌కు మద్దతు తెలపడం, గ్రామ పాలనా వ్యవస్థలో నూతన దిశకు సంకేతం అని వ్యాఖ్యానించారు. ఈ విజయం పార్టీకి మరింత బాధ్యతను పెంచిందని.. గ్రామీణ అభివృద్ధిని మరింత వేగవంతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి ప్రాధాన్యత కేంద్రంగా మార్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు.

## మంత్రి సురేఖపై నాన్ బెయిలబుల్ వారెంట్

ఉందన్నారు. ఆ రోజు జరిగే విచారణకు హాజరుకావాలని కోర్టు తనకు స్పష్టం చేసిందన్నారు. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ విజ్ఞప్తి చేశారు.

## వీసాదారుల్లో గందరగోళం

సొంత దేశాల్లోనే ఉండిపోవాల్సి వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. చివరకు అమెరికా జాబ్‌లో పోగొట్టుకునే అవకాశం ఉందని కూడా అన్నారు.

## ప్రపంచ శాంతి, స్థిరత్వం కోసం అమెరికా -భారత్‌లు కలిసి పనిచేస్తూనే ఉంటాయి

అనంతరం ట్రంప్-మోదీ సంభాషించుకోవడం ఇదే తొలిసారి.మరోవైపు, ఎన్డీయే పక్ష ఎంపీలకు ప్రధాని మోదీ తన నివాసంలో గురువారం సాయంత్రం విందు ఏర్పాటు చేశారు. 7లోక్ కల్యాణ్ మార్గ్‌లో ఉన్న మోదీ నివాసానికి ఎంపీలు బృందాల వారీగా బస్సుల్లో వెళ్లారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన నేపథ్యంలో ఈ విందు ఏర్పాటు చేసినట్లు సమాచారం. బిహార్‌కు చెందిన ఎన్డీయే నేతలు గత సోమవారం ప్రధాని మోదీని కలిసి సత్కరించిన విషయం తెలిసిందే.

## 'సర్' గడువు పొడిగింపు

గోవాల్లో మాత్రం ఈ గడువు నేటితో ముగిసింది. తమిళనాడు, గుజరాత్‌లలో డిసెంబర్ 14వరకు, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అండమాన్ నికోబార్ దీవులకు డిసెంబర్ 18వరకు, ఉత్తర్ ప్రదేశ్‌లో డిసెంబర్ 26 వరకు గడువు పెంచుతున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. వీటికి అనుగుణంగా సవరణ జాబితా ప్రచురణ తేదీలు కూడా మార్చినట్లు తెలిపింది.

## రష్యా నుంచి చమురు దిగుమతుల్లో తగ్గేదేలే..

వాడినార్ పోర్ట్‌కు డిసెంబర్‌లో రోజుకు సగటున 6.58 లక్షల బ్యారెళ్ల రష్యన్ చమురు దిగుమతి అయ్యే అవకాశం ఉందని కెప్లర్ పేర్కొంది. నవంబర్‌లో ఈ మొత్తం 5.61 లక్షల బ్యారెళ్లుగా ఉండగా.. 2025లో సగటున 4.31 లక్షల బ్యారెళ్లతో పోలిస్తే ఈ మొత్తం చాలా ఎక్కువని తెలిపింది. నయారా ఎనర్జీ వాడినగర్ పేరుతో రిఫైనరీని నిర్వహిస్తోంది. ఈ సంస్థలో రష్యాకు చెందిన రాస్‌నెఫ్ట్‌కు 49.13 శాతం వాటా ఉండడం గమనార్హం.ఈ రిఫైనరీ రోజుకు సగటున 4.05 లక్షల బ్యారెళ్ల ముడి చమురును శుద్ధి చేయగలదు. రష్యా ఆయిల్‌పై ఆంక్షలు తొలగి, రిఫైన్డ్ ఉత్పత్తులపై నిబంధనలు సడలిస్తారన్న ఆశతో నయారా ఈ చమురును పెద్దమొత్తంలో నిల్వ చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు రిలయన్స్ ఇండస్ట్రీస్ మాత్రం రష్యా చమురు దిగుమతులను తగ్గించుకుంటోంది. నవంబర్‌లో 5.52 లక్షల బ్యారెళ్ల చమురు దిగుమతి చేసుకున్న సంస్థ.. ఈసారి 2.93 లక్షల బ్యారెళ్లను మాత్రమే దిగుమతి చేసుకోబోతోందని కెప్లర్ పేర్కొంది. అమెరికా, యూరోపియన్ యూనియన్ ఆంక్షల నేప ్థ్యంలో రిలయన్స్ ఈ నిర్ణయం తీసుకోగా.. దేశీయ చమురు సంస్థలు మాత్రం 9.04 లక్షల బ్యారెళ్ల చమురును దిగుమతి చేసుకునేందుకు సిద్ధమవుతున్నాయి.



## నాణేలు, వారసత్వ అధ్యయనాల్లో తెలంగాణ అగ్రభాగంలో నిలవాలి

నిలవాలి అని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు.వారసత్వ ఆధారిత పరిశోధనకు తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది. పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నాయకత్వంలో మన రాష్ట్రాన్ని శాస్త్రీయ అధ్యయనం, సంస్కృతి సంరక్షణ, జ్ఞాన ఉత్పత్తిలో కేంద్రీకృత హబ్‌గా తీర్చిదిద్దడంలో రాష్ట్ర ప్రభుత్వం దృఢసంకల్పంతో ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు.దక్షిణ భారతదేశానికి ప్రపంచంలోనే అత్యంత సమృద్ధిగా నాణేల పరంపర ఉంది అని డిప్యూటీ సీఎం తెలిపారు. శా తవాహనులు, ఇక్ష్వాకులు తమ వాణిజ్య నెట్‌వర్క్‌లను నాణేల ద్వారా విస్తరించగా, కాకతీయుల నుండి విజయనగర సామ్రాజ్యపు వైభవం వరకు మన ప్రాంతపు నాణేలు ఆవిష్కరణ, కళాత్మకత, నైపుణ్యమైన రాజ్యపాలనకు ప్రతీకగా నిలిచాయి అని డిప్యూటీ సీఎం వివరించారు. ఈ నాణేలు మనతో మాట్లాడతాయి, కొన్నిసార్లు బిగ్గరగా ఆ కాలపు పన్ను వ్యవస్థలు, ముద్రణ, సాంకేతికత, వాణిజ్య ప్రాధాన్యతలు, రాజకీయ దృక్పథం గురించి ఎన్నో విషయాలను వివరిస్తాయని డిప్యూటీ సీఎం భట్టి అన్నారు.ఈ సదస్సు స్వతహాగానే చారిత్రాత్మకమైనది. వారసత్వ శాఖ ఇంతకు ముందు పురావస్తు మ్యూజియంల శాఖ114 ఏళ్ల ప్రయాణంలో తొలిసారిగా నాణేలపై మాత్రమే సర్వాంగ సుందరమైన జాతీయ సదస్సును నిర్వహించడం అభినందనీయం అన్నారు. సామ్రా జ్యాలు ఉదయించడం అస్తమించడం చూసిన ఈ శాఖకు ఇది నిజంగా ఒక అద్భుతమైన మైలురాయి అని డిప్యూటీ సీఎం అన్నారు. ఈ సదస్సు తెలంగాణకే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాలకూ గర్వకారణం అన్నారు.న్యూ మిస్ మ్యాటిక్స్ అంటే చేతిలో పట్టుకునే చిన్న చిన్న లోహపు ముద్రల అధ్యయనం మాత్రమే అనిపించవచ్చు. కానీ ఒక నాణెం పైకి చూస్తే అది ఒక చిన్న ప్రపంచమే కనిపిస్తుంది అన్నారు. నాణేలు మన పురాతన "కంప్రెస్డ్ డేటా" లాంటివి అని తాను తరచూ భావిస్తుంటానని తెలిపారు. కొద్ది గ్రాముల లోహంలో ఆ కాలం ఆర్థిక వ్యవస్థ, రాజు ఆశయాలు, సాంకేతిక పరిజ్ఞానం, వాణిజ్య మార్గాలు, ధార్మిక చిహ్నాలు, దౌత్య సంబంధాలు అన్నీ అందులో నిక్షిప్తం అయి ఉంటాయి అన్నారు.

సంగారెడ్డి జిల్లా కంకోల్‌లోని వోక్సెన్ యూనివర్సిటీ విద్యార్థులతో కళాశాల ఫుట్ బాల్ స్టేడియంలో ప్రాక్టీస్ మ్యాచ్ ఆడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి







మెస్సీ పాల్గొననున్న ఫుట్‌బాల్ మ్యాచ్‌కు సంబంధించి ఉప్పల్ స్టేడియంలోని ఏర్పాట్లను డీజీపీ శివధర్‌రెడ్డి సమీక్షించారు. ప్రేక్షకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, అన్ని విభాగాలు సమన్వయంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

## అమిత్ షాలో ఆందోళన నెలకొంది

ఎన్నికల సంస్కరణలపై బుధవారం లోక్‌సభలో జరిగిన చర్చలో అమిత్ షా మాట్లాడిన సంగతి తెలిసిందే. ఆ ప్రసంగాన్ని ఉద్దేశించే గురువారం రాహుల్ మీడియాతో మాట్లాడారు. "నిన్న అమిత్‌షాజీ ఆందోళనగా కనిపించారు. ఆయన వాడిన భాష కూడా సరిగా లేదు. చేతులు వణుకుతూ కనిపించాయి. ఏ ప్రశ్నకు కూడా నేరుగా సమాధానం చెప్పలేదు. అలాగే వేటికీ ఆధారం చూపించలేదు. మీడియా ముందు నేను చేసిన వ్యాఖ్యలన్నింటిని పార్లమెంట్‌లో చర్చిద్దామని ఆయనకు సవాలు విసిరాను. కానీ ఆయన నుంచి ఎలాంటి సమాధానం రాలేదు" అని రాహుల్ అన్నారు. బుధవారం లోక్‌సభలో జరిగిన చర్చలో అమిత్ షా 90 నిమిషాల పాటు మాట్లాడారు. విపక్షనేత రాహుల్‌గాంధీ చేస్తున్న ఆరోపణల్ని తోసిపుచ్చారు. ఓటు చోరీకి పాల్పడిన పార్టీ కాంగ్రెస్ అని, ఎన్నికల్లో ఆ పార్టీ ఓట మికి కారణం నాయకత్వ లోపమేనని దుయ్యబట్టారు. చరిత్ర గురించి తాము మాట్లాడితే కాంగ్రెస్‌కి కోపం వచ్చేస్తుందని, చరిత్రే లేకుండా ఏ సమాజమైనా ఎలా ముందుకువెళ్తుందని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లా డుతున్నప్పుడల్లా రాహుల్ బయటకు వెళ్లిపోతారని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ విమర్శించారు. రాహుల్ గాంధీ హిట్ అండ్ రన్ ఫార్ములాను అనుసరిస్తున్నారని, ఇదేనా ఆయన దృష్టిలో ప్రజాస్వామ్యమంటే..? అని ప్రశ్నించారు. భవిష్యత్తులో అయినా ఆయన ఆ అలవాటును మానేస్తారని అనుకుంటున్నానని చెప్పారు.

## శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కు రాష్ట్రపతి

అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రోడ్డు భవనాల శాఖ విభాగం అవసరమైన బారికేడింగ్‌లు, ఇతర ఏర్పాట్లు చేయాలని, జీహెచ్ఎంసీ, పోలీసు శాఖల సమన్వయంతో రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రపతి నిలయంలో 24 గంటలు స్నేక్ క్యాచర్ బృందాన్ని అందుబాటులో వుంచాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ సమన్వయంతో రాష్ట్రపతి నిలయం పరిసరాల్లో కోతుల బెడదను ఎదుర్కొనేందుకు ప్రత్యేక బృందాలను నియమించాలని, అదేవిధంగా తేనెటీగలను పట్టుకోవానికి ముందుస్తు ఏర్పాట్లు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, హోమ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సి.వీ ఆనంద్, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పొలిటికల్ కార్యదర్శి ఈ. శ్రీధర్, అదనపు డిజిపిలు మహేష్ భగవత్, ఉఊఓఅ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ అత. ప్రియాంక, ప్రోటోకాల్ డైరెక్టర్ శివలింగయ్య ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

## 'సర్'పై మహిళలు పోరాడాలి

**కోల్‌కతా(జనంసాక్షి):**పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మమతా బెనర్జీ గురువారం రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా మహిళలను ఉసిగొల్పారు. ఆ సవరణ తర్వాత ఓటరు జాబితాలో పేర్ల తొలగింపునకు గురైతే కిచెన్ టూల్స్‌తో సిద్ధంగా ఉండాలని వ్యాఖ్యలు చేశారు."ఎస్ఐఆర్ పేరుతో మీ తల్లులు, సోదరీమణుల ఓట్లను లాక్కుంటారా..? ఎన్నికల సమయంలో ఢిల్లీ నుంచి పోలీసులను తీసుకువచ్చి మిమ్మల్ని బెదిరిస్తారు. జాబితాలో మీ పేరు లేకపోతే..మీ వద్ద వంటగదిలో వాడే పరికరాలు ఉన్నాయికదా..! వంటచేసేటప్పుడు వాడే ఆ పరికరాలు మీ బలం. మహిళలు ముందుండి పోరాడుతారు. మగవారు వారివెనక ఉంటారు. మహిళలా లేక భాజపానా..? ఎవరు బలవంతులో చూడాలని అనుకుంటున్నాను. నేను లౌకికవాదాన్నే నమ్ముతాను. ఇక్కడి ప్రజలను విభజించేందుకు ఎన్నికల సమయంలో భాజపా డబ్బు వాడి, వేరే రాష్ట్రాల నుంచి మనుషుల్ని దింపుతుంటుంది.రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, రవీంద్రనాథ్ ఠాగూర్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ వంటివారు ఏనాడు ప్రజలను విభజించేలా వ్యవహరించలేదు. మరి మీరంతా ఎవరు..? భారత స్వాతంత్ర్యం కోసం బెంగాల్ ప్రజలు ప్రాణాలు త్యాగం చేశారు.

# అభివృద్ధి, సంక్షేమం.. రెండు కళ్లలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన..

- తెలంగాణలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైంది
- ఎస్ఐఆర్‌పై ఎన్డీయే ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోంది
- ఎంపీ మల్లు రవి



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** ప్రజా పాలనలో భాగంగా.. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన సాగిస్తున్నారని.. తెలంగాణ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) కన్వీనర్ డా.మల్లు రవి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రజాపాలన నచ్చి.. సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు మద్దతు ఇస్తున్నారని చెప్పారు. ఎస్ఐఆర్‌పై ఎన్డీయే ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీ మల్లు రవి న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో గురువారం విలేఖరులతో మాట్లాడారు. 'తెలంగాణ రాష్ట్రం వచ్చిన పది సంవత్సరాల తర్వాత.. కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడింది. బీఆర్ఎస్ పార్టీ 10 సంవత్సరాలు తెలంగాణ ప్రజల ఆకాంక్షల్ని పక్కనపెట్టింది. వారి సొంత లాభాల కోసం పనిచేశారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి వచ్చిన వెంటనే రాష్ట్రంలో రైతులకు రుణమాఫీ ఇవ్వటం, మహిళలకు ఉచిత బస్సులు ఏర్పాటు సౌకర్యం కల్పించడం, 200 యూనిట్స్ కరెంటు ఇవ్వటం, 500 రూపాయల గ్యాస్ సిలిండర్ సప్లై, నిరుద్యోగులకు 75 వేల ఉద్యోగాలు ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో సమూలమైన సాంఘిక మార్పు కోసం 100 ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులను ఒకే హాస్టల్ లో ఉంచి చదువుకునే ఏర్పాటు చేస్తున్నారు. తెలంగాణలో శాస్త్రీయ పద్ధతిలో కుల గణన చేసి 42% రిజర్వేషన్ కోసం కృషి చేశారు. ఇవన్నీ తెలంగాణలో గత 10 సంవత్సరాల పాలనలో జరగలేదు' అని ఎంపీ మల్లు రవి చెప్పారు. 'గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ పెట్టి.. విజయవంతంగా నిర్వహించారు. ప్రపంచ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు తీసుకొచ్చారు. ఈ రెండు రోజుల్లోనే తెలంగాణ రాష్ట్రంలో ఐదు లక్షల 75 వేల కోట్ల పెట్టుబడులు పెట్టటానికి ఎంవోయూలు కుదిరాయి. ఇంత పెద్దఎత్తున ఎప్పుడూ ఒప్పందాలు జరగలేదు. మన ముఖ్యమంత్రి తెలంగాణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూనే.. అత్యున్నతమైన విద్యను అందించాలని సంకల్పించారు. ఆ ఉద్దేశంతోనే 100 సమీకృత రెసిడెన్షియల్ స్కూల్స్ విధానాన్ని తీసుకొచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి ఈరోజు మాతో మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాలకు సంబంధించిన పిల్లలు ప్రపంచ స్థాయిలో పోటీపడాలంటే.. విద్య ఒక్కటే మార్గం అని చెప్పారు. విద్య కారణంగానే.. ఇంట్లో పడుకోడానికి స్థలం లేనటువంటి అంబేద్కర్ భారత దేశ రాజ్యాంగం కమిటీ చైర్మన్ స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. ప్రపంచ స్థాయిలో విద్యనభ్యసించిన కారణంగానే.. ఆయనకు అవకాశం వచ్చిందని చెప్పారు' అని మల్లు రవి వివరించారు. '8,9 తేదీల్లో పార్టీలకతీతంగా గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించారు. అక్కడ కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలు గాని, కాంగ్రెస్ పార్టీ జెండాలు గాని, కాంగ్రెస్ పార్టీ నాయకులు హడావుడిగాని లేకుండా చేశారు. తెలంగాణ ప్రభుత్వం మీద నమ్మకం కలిగేలా ఏర్పాట్లు చేశారు. పెద్దఎత్తున పెట్టుబడులు తీసుకొచ్చారు. కానీ.. కొందరు మాత్రం సమ్మిట్ ఫెయిల్ అయిందని ప్రచారం చేస్తున్నారు. వారికి ఒకటే సమాధానం చెబుతున్నా.. మిగతా రాష్ట్రాల ముఖ్యమంత్రులకు, ప్రధాని మోదీకి సమ్మిట్ గురించి సమాచారం మాత్రమే ఇచ్చాం. వారు వస్తే.. పెట్టుబడులు వారి రాష్ట్రానికి కావాలని అడుగుతారు. దాని వల్ల తెలంగాణకు నష్టం జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం కాబట్టి.. వారి తరఫున కిషన్ రెడ్డి ఆ కార్యక్రమంలో పాల్గొని వారు చెప్పాల్సింది చెప్పారు. దీనిపై అనసరమైన తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పాలన నచ్చింది కాబట్టే.. సర్పంచ్ ఎన్నికల్లో మా పార్టీ మద్దతు ఇచ్చిన అభ్యర్థులు విజయం సాధిస్తున్నారు' అని మల్లు రవి వివరించారు.

## మెస్సి ఫుట్‌బాల్ మ్యాచ్ ఏర్పాట్లపై
# ఉప్పల్ స్టేడియంలో డీజీపీ సమీక్ష



**హైదరాబాద్, డిసెంబరు 11 (జనంసాక్షి) :** ఈనెల 13న ఫుట్ బాల్ క్రీడాకారుడు మెస్సితో ఫుట్‌బాల్ మ్యాచ్ నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన భద్రతాపరమైన, ఇతర ఏర్పాట్లపై రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి గురువారం ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ మ్యాచ్‌కు సంబంధించిన సమగ్ర ఏర్పాట్లను పర్యవేక్షించారు. గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), విద్యుత్ శాఖ, వాటర్ వర్క్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణకు చెందిన అధికారులతో పాటు మ్యాచ్ నిర్వాహకులు కూడా ఈ సమావేశంలో హాజరై, తమ శాఖల ద్వారా జరుగుతున్న ఏర్పాట్లను డిజిపికి వివరించారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ....మ్యాచ్‌కు తరలివచ్చే ప్రేక్షకులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా, వారికి సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా, ఫుట్‌బాల్ ప్రొఫెషనల్ క్రీడాకారుడు లియోనల్ మెస్సికి ఉన్న ప్రపంచవ్యాప్త ఇమేజ్ దృష్ట్యా, రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి పాల్గొంటున్నందున భద్రతాపరమైన ఏర్పాట్లు అత్యంత పటిష్టంగా ఉండాలని, జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. ప్రేక్షకులకు సంబంధించిన మార్గదర్శకాలను, భద్రతా నియమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఇందుకోసం మెట్రో రైళ్లలోనూ, నగరంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసే ప్రచార బోర్డుల ద్వారా ప్రజలకు అవసరమైన సమాచారాన్ని, తీసుకోవాల్సిన జాగ్రత్తలను, ట్రాఫిక్ మళ్లింపు వివరాలను తెలియజేయాలని డిజిపి అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమీక్షా సమావేశంలో రాచకొండ పోలీస్ కమిషనర్ శ్రీ సుధీర్ బాబు ,శాంతిభద్రతల అడిషనల్ డిజిపి శ్రీ మహేష్ ఎం భగవత్, డిజి, ఎస్పీఎఫ్ శ్రీమతి స్వాతి లక్రా, అడిషనల్ డిజిపి (సీఐడీ) చారు సిన్హా, అడిషనల్ డీజీపీ (ఇంటెలిజెన్స్) శ్రీ విజయకుమార్, డిజి,ఫైర్ సర్వీసెస్ శ్రీ విక్రమ్ సింగ్ మాన్, జాయింట్ సీపీ (ట్రాఫిక్) శ్రీ జోయల్ డేవిస్, మల్కాజిగిరి డిసిపి శ్రీధర్, నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీ శ్రీమతి పద్మజ, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శ్రీ కె. శివసేన రెడ్డి తదితరులు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

### వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పరిశీలించిన డిజిపి

తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ సరళిని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్‌రెడ్డి గురువారం వెబ్‌కాస్టింగ్ ద్వారా ప్రత్యక్షంగా పరిశీలించారు. ముఖ్యంగా సమస్యాత్మక గ్రామాల్లో జరుగుతున్న పోలింగ్ తీరును డిజిపి పర్యవేక్షించారు. తన కార్యాలయంలో ఎన్నికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో డిజిపి వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ , కౌంటింగ్ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా శాంతిభద్రతల అదనపు డిజిపి శ్రీ మహేష్ ఎం. భగవత్, ఇంటెలిజెన్స్ అదనపు డిజిపి శ్రీ విజయ్ కుమార్‌లతో కలిసి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిస్థితిపై ఆరా తీశారు. ఎన్నికల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా పర్యవేక్షించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ 3,000కు పైగా గ్రామ పంచాయతీల్లో వెబ్‌కాస్టింగ్ ద్వారా ప్రత్యక్ష నిఘా ఏర్పాటు చేసినట్లు డిజిపి తెలిపారు. పోలింగ్ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విస్తృత బందోబస్తు చర్యలు చేపట్టామని శివధర్‌రెడ్డి వివరించారు.

# ఒక్క ఓటుతో గెలిచిన మహిళ

**ఆదిలాబాద్, డిసెంబర్11 (జనంసాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో కేవలం ఒక్క ఓటుతో 'ఆమె'ను గెలుపు వరించింది. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని వివాదాస్పద గ్రామమైన పరందొలి గ్రామ పంచాయతీ సర్పంచిగా రాఠోడ్ పుష్పలత కేవలం ఒక్క ఓటుతో ప్రత్యర్థి దీలిప్ కాటేపై గెలిచినట్లు రిటర్నింగ్ అధికారి వెంకటస్వామి ప్రకటించారు. ఈ గ్రామ పంచాయతీలో మొత్తం 873 ఓటర్లు ఉన్నారు. ఏడుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. కాటే దీలిప్‌కు 101 ఓట్లు రాగా, పుష్పలతకు 102 ఓట్లు పోలయ్యాయి. దీంతో ఒక్క ఓటు తేడాతో ఆమెకు విజయం దక్కింది. పంచాయతీ అభివృద్ధికి తాను కృషి చేస్తామని పుష్పలత పేర్కొన్నారు.

# తల్లికోసం విదేశం నుంచి తనయుడు రాక


**జగిత్యాల, డిసెంబర్ 11 (జనంసాక్షి) :** తల్లిని గెలిపించేందుకు ఓ కుమారుడు ఆస్ట్రేలియా నుంచి వచ్చి మరీ ఓటు వేశాడు. కరీంనగర్ జిల్లా కోరుట్ల మండలం సంగెం గ్రామంలో చీటి స్వరూప బిఆర్ఎస్ బలపరిచిన సర్పంచి అభ్యర్థిగా పోటీ చేశారు. ఆమె కుమారుడు ఆస్ట్రేలియాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. తల్లిని సర్పంచిగా గెలిపించేందుకు ఈ నెల 4 న ఆస్ట్రేలియా నుంచి వచ్చి ప్రచారం చేపట్టి ఈరోజు ఓటు వేశారు. దీంతో గ్రామంలో ఆనందం వెల్లివిరిసింది. తల్లి కోసం వచ్చినందుకు అతడిని స్నేహితులు అభినందించారు.

# లగచర్లలో బీఆర్ఎస్ మద్దతుదారుల గెలుపు

**మహబూబ్‌నగర్, డిసెంబర్11 (జనంసాక్షి) :** సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌లో భూమి కోసం పోరాటం చేసిన లగచర్ల బీఆర్ఎస్ కు జై కొట్టింది. అధికార పార్టీ ఎన్ని ప్రలోభాలు పెట్టిన అక్కడి గిరిజనులు తమకు ఆపదగా నిలిచిన బీఆర్ఎస్‌కు జేజేలు పలికారు. దుద్యాల మండలంలోని సత్తారుకుంట తండాలో మూడవత్ పూజ, రోటిబండ తండాలో రుక్కమ్మ బీఆర్ఎస్ మద్దతుతో విజయం సాధించారు. లగచర్ల, హకీంపేట గ్రామపంచాయతీల్లో కాంగ్రెస్ ఎదురీదుతుంది. సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ ఫార్మ క్లస్టర్‌కు బీజం వేసిన దానిపై లగచర్లలో పోరాటం జరిగింది. ఇక్కడి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వార్డు సభ్యుల స్థానాలను బీఆర్ఎస్ మద్దతుదారులే గెలుపొందారు. బీఆర్ఎస్‌కు గిరిజన తండాలు జై కొట్టాయి. ఇప్పటికే రెండు చోట్ల సర్పంచ్ స్థానాలను బీఆర్ఎస్ మద్దతుదారులు గెలుపొందగా మరో రెండుచోట్ల విజయం వైపు దూసుకెళుతున్నారు. కొడంగల్ మండలంలోని కాజా అహ్మద్‌పల్లిలో లో సర్పంచ్ అభ్యర్థిగా (కాంగ్రెస్)పోటీ చేసిన తెలుగు లక్ష్మి ఆత్మహత్యాయత్నం చేసుకోవడం సంచలనంగా మారింది.

# జూబ్లీహిల్స్ రహమత్‌నగర్‌లో అగ్నిప్రమాదం

- మంటల్లో మూడు కార్లు..ఒక ఆటో దగ్ధం



**హైదరాబాద్, డిసెంబర్11 (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ రహమత్‌నగర్ ఎస్పీఆర్ హిల్స్ గ్రౌండ్‌లో గురువారం అగ్నిప్రమాదం జరిగింది. ఈ మంటల్లో మూడు కార్లు, ఒక ఆటో దగ్ధమయ్యాయి. వీటితో పాటు సమీపంలో పార్కింగ్ చేసిన వాహనాలకు మంటలు అంటుకున్నాయి. అగ్నిప్రమాదం ధాటికి మంటలు ఎగిసి పడ్డాయి. స్థానికులు ఈ ఘటనతో తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. సమాచారం అందగానే సంఘటన స్థలానికి ఫైర్ సిబ్బంది చేరుకున్నారు. మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. మరోవైపు పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. స్థానికులను సంఘటనా స్థలం నుంచి దూరంగా పంపించివేసారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందనే విషయంపై దగ్గరలోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. గంజాయి మత్తులో ఓ వ్యక్తి చెత్తకు నిప్పు అంటించినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సమీపంలోని ఇళ్ల వారు ఈ గ్రౌండ్‌లో కార్లు పార్కింగ్ చేస్తుంటారని పోలీసులు తెలిపారు. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా? దురుద్దేశంతో చేశారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. ఘటనా స్థలాన్ని ఎస్ఆర్ నగర్ ఏసీపీ రాఘవేంద్రరావు, బోరబండ ఇన్‌స్పెక్టర్ సురేందర్ పరిశీలించారు.

# నితిన్ గడ్కరీతో కామారెడ్డి ఎమ్మెల్యే భేటీ

- కామారెడ్డి పట్టణంలో ఔటర్ రింగ్ రోడ్డు కోసం వినతి



**న్యూఢిల్లీ, డిసెంబర్11 (జనంసాక్షి) :** కామారెడ్డిలో అభివృద్ధి పనులు లక్ష్యంగా ఢిల్లీ వెళ్లిన స్థానిక బిజెపిఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి వరుసగా కేంద్రమంత్రులను కలుస్తున్నారు. బుధవారం అశ్వినీ వైష్ణవ్‌ను కలిసిన ఎమ్మెల్యే గురువారం నితిన్ గడ్కరీని కలిశారు. కామారెడ్డి పట్టణంలో ఔటర్ రింగ్ రోడ్డుతో పాటు నియోజకవర్గంలోని రహదారుల విస్తరణకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి దిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రానికి నలువైపులా 54 కిలోమీటర్ల మేర పొడవైన రింగ్ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. లింగాపూర్ స్టేజీ నుంచి వైద్య కళాశాల, మైనార్టీ గురుకుల కళాశాల మీదుగా జాతీయ రహదారి వరకు నాలుగు వరుసల రోడ్ల విస్తరణకు రూ.40 కోట్ల నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. భిక్కనూరు మండల కేంద్రం నుంచి తిప్పాపూర్, తలమడ్ల మీదుగా రాజంపేట వరకు రెండు వరుసల రోడ్డుకు రూ.18 కోట్లు మంజూరు చేయాలన్నారు. కామారెడ్డి పట్టణంలో పాత బస్టాండు నుంచి జాతీయ రహదారి వరకు రోడ్డు విస్తరణ నిమిత్తం రూ.8 కోట్ల నిధులు అవసరమని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పాల్వంచమర్రి నుంచి మాందాపూర్ మీదుగా భిక్కనూరు వరకు రెండు వరుసల రోడ్డు విస్తరణకు రూ.24 కోట్లు విడుదల చేయాలని కోరారు.

## కోహెడ ఫైరింగ్ రేంజ్‌ను పరిశీలించిన అదనపు డిజిపి సంజయ్‌కుమార్ జైన్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్ శివార్లలోని కోహెడ ప్రాంతంలో కొత్తగా నిర్మిస్తున్న 3వ బెటాలియన్‌కు సంబంధించిన ఫైరింగ్ రేంజ్ పనులను టిజిఎస్పి అదనపు డిజిపి సంజయ్ కుమార్ జైన్ గురువారం నాడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఫైరింగ్ రేంజ్ నిర్మాణం, భద్రతా ఏర్పాట్లు, షూటింగ్ లైన్ల ఏర్పాటు, సిబ్బందికి అవసరమైన శిక్షణా సౌకర్యాలు వంటి అంశాలను పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులు ఇచ్చిన వివరాలను పరిశీలించిన అనంతరం, రేంజ్‌ను మరింత ఆధునీకరించే విధంగా సూచనలు చేశారు. పోలీస్ సిబ్బందికి షూటింగ్‌లో నైపుణ్యం పెంపొందించేలా అవసరమైన ఆధునిక పరికరాలు, సాంకేతికతను వినియోగించాలని ఆయన సూచించారు. పోలీస్ అధికారులతో కలిసి పిస్టల్‌తో షూటింగ్ ప్రాక్టీస్ నిర్వహించారు. సిబ్బంది నైపుణ్యాన్ని గమనించి షూటింగ్ టెక్నిక్స్, భద్రతా మార్గదర్శకాలు, లక్ష్యాలను సాధించే విధానాలపై వారికి సలహాలు ఇచ్చారు.

# డిజిపి కార్యాలయ పరిధిలోని స్టాఫ్ క్యాంటీన్ల నిర్వహణకు సీల్డ్ టెండర్ల ఆహ్వానం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** డిజిపి కార్యాలయం పరిధిలోని రెండు వేర్వేరు ప్రాంతాలలో స్టాఫ్ క్యాంటీన్లను నిర్వహించేందుకు అనుభవం గల క్యాటరర్ల నుండి సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ జనరల్ (వెల్ఫేర్) ఎం. రమణ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

**మొదటి టెండర్ :** లక్డీ-కా-పూల్‌లోని ఉమెన్ సేఫ్టీ వింగ్ వెనుక ఉన్న సువిధా కాంప్లెక్స్ ప్రాంగణంలో క్యాంటీన్ నిర్వహణకు సంబంధించినది. ప్రభుత్వ లేదా సంస్థాగత స్టాఫ్ క్యాంటీన్లను నిర్వహించడంలో నిరూపితమైన ట్రాక్ రికార్డు మరియు అనుభవం ఉన్న క్యాటరర్లు ఈ టెండర్‌లో పాల్గొనడానికి అర్హులు.

**రెండవ టెండర్:** డిజిపి కార్యాలయం, ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో స్టాఫ్ క్యాంటీన్ నిర్వహణకు సంబంధించినది. దరఖాస్తుదారులు ఇలాంటి సౌకర్యాలను నిర్వహించడంలో తగినంత అనుభవాన్ని కలిగి ఉండాలి.

టెండర్ పత్రాల జారీ: 15-12-2025 నుండి, పని దినాల్లో ఉదయం 11:00 గంటల నుండి సాయంత్రం 17:00 గంటల వరకు.. టెండర్లు సమర్పించడానికి చివరి తేదీ 29-12-2025, మధ్యాహ్నం 3:00 గంటలలోపు సమర్పించాలని సూచించారు. ఆసక్తి గల క్యాటరర్లు, రెండు క్యాంటీన్ల కోసం వివరణాత్మక టెండర్ పత్రాలను, డిజిపి కార్యాలయం, లక్డీ-కా-పూల్, వెల్ఫేర్ డివిజన్, 4వ అంతస్తులోని వీ సెక్షన్‌లోని సూపరింటెండెంట్ కార్యాలయం నుండి పొందవచ్చు. టెండర్ పత్రాల ధర రూ. 500/- (ఐదు వందల రూపాయలు మాత్రమే), ఇది తిరిగి చెల్లించబడదు (నాన్-రిఫండబుల్). సీల్డ్ బిడ్స్‌ను తప్పనిసరిగా అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (వెల్ఫేర్), 4వ అంతస్తు, డిజిపి కార్యాలయం, హైదరాబాద్ చిరునామాకు పైన పేర్కొన్న గడువులోగా చేరేలా పంపాలని, ఇతర వివరాల కోసం ఎం. రమణ కుమార్ అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ జనరల్ (వెల్ఫేర్) సంప్రదించగలరని సూచించారు.

# ఇన్సర్వీస్ టీచర్లకు టెట్‌పై మినహాయింపు ఇవ్వాలి

- సివిల్ సర్వీస్ జాన్ స్టాఫ్ కౌన్సిల్ శాశ్వత సభ్యత్వ సంఘం టిఆర్టిఎఫ్ ధర్నా




**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** ఇన్సర్వీస్ టీచర్లకు టెట్ పై మినహాయింపు ఇవ్వాలని సివిల్ సర్వీస్ జాన్ స్టాఫ్ కౌన్సిల్ శాశ్వత సభ్యత్వ సంఘం టిఆర్టిఎఫ్ ధర్నా నిర్వహించారు. 2010 విద్యాహక్కు చట్టం ప్రకారం సుప్రీంకోర్టు గత సెప్టెంబర్ లో ఇచ్చినటువంటి తీర్పు ప్రకారం ప్రతి ఒక్కరికి ఎవరైతే ఉద్యోగ ఉపాధ్యాయులు ఉన్నారో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఈటీ) ఉత్తీర్ణత..పొంది ఉండాలనే నియమాన్ని కేటాయించిందని, ఇందులో ఐదు సంవత్సరాల లోపు రిటైర్మెంట్ అయ్యేటటువంటి ఉద్యోగ ఉపాధ్యాయులను మినహాయింపు ఇచ్చిందని, లేదా రెండు సంవత్సరాల్లో ..ఎస్జీటీలు(సెకండరీ గ్రేడ్ టీచర్) పేపర్ 1, స్కూల్ అసిస్టెంట్లు..పేపర్ 2, ఉత్తీర్ణులు కావాలని నిర్ణీత సమయాన్ని ఇస్తూ తీర్పు వెలువరించిన తదనంతరం ఉద్యోగ ఉపాధ్యాయులు దేశవ్యాప్తంగా ఎంతో ఆందోళనకు గురిచేసిందని, ఈ నేపథ్యం దృష్టిలో ఉంచుకొని ,ఇన్ని రోజుల మేధావి వర్గ సోదర పక్క రాష్ట్ర ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల..చర్చల సారాంశాన్ని క్రోడీకరించి సుప్రీంకోర్టు న్యూఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ఫెడరేషన్ ఉపాధ్యాయ ఉద్యోగుల పక్షాన సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేశారని, భారత రాజధాని నగరం న్యూఢిల్లీలో జంతర్మంతర్ వద్ద టెట్ పై మినహాయింపు ఇవ్వాలని దేశవ్యాప్తంగా జరుగుతున్నటువంటి ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ అనుసంధాన తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం టిఆర్టిఎఫ్ తరపున రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్ హాజరై తన వాయిస్ను వినిపించారు. పార్లమెంటు నడుస్తున్న ఈ సమయంలో తక్షణమే ఆర్టికల్ 23 క్లాస్ 2ను సవరించి 2010కు ముందు నియామకమైనటువంటి ఉపాధ్యాయులకు టెట్ పై మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయుల తరపున వారి వాయిస్..ను వినిపించిన తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేష్ కు నాగర్ కర్నూల్ జిల్లా టిఆర్టిఎఫ్ తరఫున ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునగాల సతీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

## చేతకాకున్నా ...నడవ రాకున్నా..



**వరంగల్ ఈస్ట్, డిసెంబర్ 11 (జనంసాక్షి) :** ఒంట్లో చేతకాకున్నా నడవ రాకున్నా ఓటు వేయాలని సంకల్పంతో వృద్ధులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు రావడం కనిపించింది. గురువారం వరంగల్ జిల్లాలో మొదటి విడత గ్రామపంచాయతీ పోలింగ్లో పాల్గొని తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన వృద్ధులు మాట్లాడుతూ తాము ఇప్పటికే ఎన్నోసార్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నామని, బతికున్నన్ని నాళ్ళు ఎప్పుడు ఎలాంటి ఎన్నికలు వచ్చిన తాము ఓటు వేస్తూనే ఉంటామన్నారు. ఓటు హక్కు ఉన్న వాళ్ళు ఎవరైనా ఓటేసి తీరాలని చెప్పారు.



# కలిసికట్టుగా బీసీ రిజర్వేషన్లు సాధిద్దాం

- ఎవరూ బలిదానాలు చేసుకోవద్దు
- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** కలిసికట్టుగా బీసీ రిజర్వేషన్లు సాధిద్దామని, ఎవరూ బలిదానాలు చేసుకోవద్దని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం కోరారు. బీసీ రిజర్వేషన్ ల సాధన కోసం ఆత్మ బలిదానంకు పాల్పడిన సాయి ఈశ్వర్ చారికి టీజెస్ పార్టీ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ నివాళులు అర్పించారు. జగద్గిరిగుట్టలో బీరప్ప నగర్ లో ఇంటి వద్ద సాయి ఈశ్వర్ చారి పార్థివ దేహానికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ అందరం కలిసి పోరాటం చేద్దాం రిజర్వేషన్ లు బీసీల సాధిద్దామన్నారు. కానీ ఎవరు కూడా చనిపోవద్దు వారి కుటుంబంకు దుఃఖంను మిగల్చవద్దు అని అన్నారు. సాయి ఈశ్వర్ చారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వచ్చే విదంగా, ప్రభుత్వం ఆదుకునే విదంగా కృషి చేస్తాని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, కుటుంబ సమస్యను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ప్రొఫెసర్ కోదండరాంతో టీజెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా:నిజ్జన రమేష్ ముదిరాజ్, విద్యార్థి వింగ్ రాష్ట్ర అధ్యక్షులు మాసం పల్లి అరుణ్ కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు అశోక్ రెడ్డి, యువత విభాగం రాష్ట్ర నాయకులు, ఎర్ర వీరన్న, అనిల్ లు ఉన్నారు.

### ఎన్‌కౌంటర్ హత్యలు ఆపండి...

# ఆదివాసీల హక్కులు కాపాడండి

భారతదేశంలో ఆదివాసీలు శతాబ్దాలుగా అడవులతో సహజీవనం సాగిస్తున్నారు. వారి జీవనవిధానం ప్రకృతితో మమేకమైనది. అయితే, స్వాతంత్ర్యం తర్వాత కూడా ఆదివాసీలు అనుభవిస్తున్న హక్కుల ఉల్లంఘనలు, ఎన్‌కౌంటర్ పేరుతో హత్యలు ఆందోళనకరం. మావోయిస్టుల ఎన్‌కౌంటర్ల పేరుతో అమాయక ఆదివాసీలు బలవుతున్నారు. ఇటీవల చత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో జరిగిన సంఘటనలు దేశాన్ని కలవరపరుస్తున్నాయి. ప్రభుత్వాలు ఎన్‌కౌంటర్లను ఆపి, ఆదివాసీల హక్కులను కాపాడాల్సిన అవసరం ఉంది. ఇది కేవలం మానవత్వపరమైన సమస్యే కాదు, రాజ్యాంగబద్ధమైన బాధ్యత కూడా. ఆదివాసీలు దేశంలోని మూలవాసులు, వారి సంస్కృతి, జీవనవిధానం భారతీయ సంప్రదాయానికి మూలం. కానీ, ఆధునిక అభివృద్ధి పేరుతో వారిని అణచివేయడం సరికాదు. ఆదివాసీ ప్రాంతాలు సంపదల సమాహారం, కానీ వారికి ఆ సంపదలో భాగం లభించడం లేదు. మైనింగ్, పారిశ్రామిక ప్రాజెక్టులు వారి భూములను కబళీకరిస్తున్నాయి. ఇది వారి ఉనికినే ప్రశ్నార్థకం చేస్తోంది. ఆదివాసీలు తమ భూములు, సంస్కృతి కాపాడుకోవాలంటే పోరాడుతున్నారు. కానీ, ఇది మావోయిజం పేరుతో అణచివేయడం సర్వసాధారణమైంది. గత దశాబ్దంలో ఎన్‌కౌంటర్లలో వందలాది ఆదివాసీలు మరణించారు. ఇది దేశంలో మానవ హక్కుల స్థితిని ప్రశ్నిస్తుంది. భద్రతా దళాలు ఆదివాసీలను మావోయిస్టులుగా ముద్రవేసి చంపడం సర్వసాధారణమైంది. ఇటువంటి ఘటనలు ఆదివాసీలలో అవిశ్వాసాన్ని పెంచుతున్నాయి. ప్రభుత్వాలు ఎన్‌కౌంటర్లను ఆపి, శాంతియుత మార్గాలను అన్వేషించాలి.

**ఎన్‌కౌంటర్ల పేరుతో అమాయకుల హత్యలు**

ఆదివాసీ ప్రాంతాల్లో మావోయిస్టులు, నక్సలైట్లు క్రియాశీలంగా ఉంటున్నారనేది వాస్తవం. కానీ, భద్రతా దళాలు ఎన్‌కౌంటర్ పేరుతో అమాయకులను చంపడం న్యాయం కాదు. ఉదాహరణకు, చత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది మరణించారు. వీరిలో కొందరు సాధారణ ఆదివాసీలుగా గుర్తించబడ్డారు. మానవ హక్కుల సంఘాలు ఈ ఘటనలను ఫేక్ ఎన్‌కౌంటర్లుగా పేర్కొన్నాయి. సుప్రీంకోర్టు కూడా గతంలో ఎన్‌కౌంటర్లపై జ్యుడీషియల్ విచారణ ఆదేశించింది. కానీ, అమలు లోపాలతో సమస్యలు కొనసాగుతున్నాయి. భద్రతా దళాలు మావోయిస్టులను లక్ష్యంగా చేసుకుంటున్నప్పుడు ఆదివాసీలు బలి అవుతున్నారు. ఇది ఆదివాసీలలో అసంతృప్తి పెంచి, సమస్యను మరింత తీవ్రతరం చేస్తుంది. చత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఎన్‌కౌంటర్లు ఆదివాసీలను భయభ్రాంతులను చేస్తున్నాయి. పోలీసులు, సీఆర్‌పీఎఫ్ దళాలు ఆదివాసీలను మావోయిస్టులుగా ముద్రవేసి చంపడం సర్వసాధారణమై ంది. ఇటువంటి ఘటనలు ఆదివాసీలలో అవిశ్వాసాన్ని పెంచుతున్నాయి. ప్రభుత్వాలు ఎన్‌కౌంటర్లను ఆపి, శాంతియుత మార్గాలను అన్వేషించాలి. ఆదివాసీలు తమ భూములు, సంస్కృతి కాపాడుకోవాలంటే పోరాడుతున్నారు. కానీ, ఇది మావోయిజం పేరుతో అణచివేయడం సరికాదు. గత దశాబ్దంలో ఎన్‌కౌంటర్లలో వందలాది ఆదివాసీలు మరణించారు. ఇది దేశంలో మానవ హక్కుల స్థితిని ప్రశ్నిస్తుంది. ఆదివాసీలు తమ సమస్యలు చెప్పుకోవడానికి ప్లాట్‌ఫారమ్‌లు కల్పించాలి. ఇది అవిశ్వాసాన్ని తగ్గించి, శాంతిని నెలకొల్పుతుంది. ఎన్‌కౌంటర్లు ఆదివాసీలలో భయాన్ని సృష్టిస్తున్నాయి. వారు అడవుల్లో స్వేచ్ఛగా తిరగలేకపోతున్నారు. ఇది వారి సాంప్రదాయ జీవనాన్ని దెబ్బతీస్తుంది. ప్రభుత్వాలు ఆదివాసీలతో సంప్రదింపులు జరిపి విధానాలు రూపొందించాలి. లేకపోతే, సమస్యలు మరింత తీవ్రమవుతాయి.

**ఆదివాసీల భూమి హక్కుల ఉల్లంఘనలు**

ఆదివాసీల హక్కుల ఉల్లంఘనలు కేవలం ఎన్‌కౌంటర్లకు మాత్రమే పరిమితం కాదు. వారి భూమి, వనరులపై పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వాలు కన్ను వేస్తున్నాయి. ఫారెస్ట్ రైట్స్ యాక్ట్ 2006 ప్రకారం ఆదివాసీలకు భూమి హక్కులు ఉన్నప్పటికీ, అమలులో లోపాలు కనిపిస్తున్నాయి. ఒడిశాలోని నియమ్‌గిరి ప్రాంతంలో వేదాంతా కంపెనీ మైనింగ్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఆదివాసీలు పోరాడి విజయం సాధించారు. కానీ, ఇలాంటి ఘటనలు అరుదు. చాలా చోట్ల భూమి స్వాధీనాలు బలవంతంగా జరుగుతున్నాయి. ఆదివాసీలు తమ సాంప్రదాయ భూముల నుంచి తరిమివేయబడుతున్నారు. ఇది వారి జీవనోపాధిని దెబ్బతీస్తుంది. ప్రభుత్వాలు ఆదివాసీల సమ్మతి లేకుండా ప్రాజెక్టులు చేపట్టడం రాజ్యాంగ విరుద్ధం. పంచమ షెడ్యూల్ ప్రకారం ఆదివాసీ ప్రాంతాల్లో ప్రత్యేక రక్షణ ఉంది, కానీ అమలు బలహీనం. మైనింగ్ కంపెనీలు, పారిశ్రామికవేత్తలు ఆదివాసీల భూములను కబళించడం సర్వసాధారణమైంది. జార్ఖండ్‌లో ఆదివాసీల భూములపై ఖనిజ సంపద కోసం ప్రభుత్వాలు ఒప్పందాలు చేస్తున్నాయి. ఇది వారి సాంస్కృతిక వారసత్వాన్ని నాశనం చేస్తుంది. ఆదివాసీలు తమ భూములను కాపాడుకోవడానికి పోరాడుతున్నప్పుడు, ప్రభుత్వాలు బలప్రయోగం వాడుతున్నాయి. ఇది వారి హక్కులను ఉల్లంఘిస్తుంది. రాజ్యాంగం 5వ షెడ్యూల్ ఆదివాసీలకు ప్రత్యేక అధికారాలు ఇచ్చింది, కానీ అమలు లోపాలతో వారు నష్టపోతున్నారు. ప్రభుత్వాలు ఆదివాసీల సమ్మతి తీసుకుని మాత్రమే ప్రాజెక్టులు చేపట్టాలి. లేకపోతే, ఇది సామాజిక అసమానతలను పెంచుతుంది. ఆదివాసీల భూములు వారి జీవనాధారం, సంస్కృతి మూలం. ఇవి కోల్పోతే వారు ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతారు. ప్రభుత్వాలు భూమి స్వాధీనాలు ఆపి, ఆదివాసీలకు హక్కులు ఇవ్వాలి. ఇది దేశంలో శాంతి నెలకొల్పుతుంది.

**మానవ హక్కుల సంఘాల పాత్ర పెంచాలి**

మానవ హక్కుల సంఘాలు ఎన్‌కౌంటర్లు, హక్కుల ఉల్లంఘనలపై విచారణలు జరిపి నివేదికలు సమర్పిస్తున్నాయి. నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఇటీవల చత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్లపై విచారణ ఆదేశించింది. అమ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటి అంతర్జాతీయ సంస్థలు కూడా ఈ సమస్యలను ఎత్తిచూపుతున్నాయి. ప్రభుత్వాలు ఈ నివేదికలను పరిగణనలోకి తీసుకుని చర్యలు తీసుకోవాలి. ఆదివాసీలకు రక్షణ కల్పించడానికి ప్రత్యేక దళాలు, విచారణ కమిటీలు ఏర్పాటు చేయాలి. భద్రతా దళాలకు మానవ హక్కుల శిక్షణ ఇవ్వాలి. ఆదివాసీలు తమ హక్కులపై అవగాహన పెంచుకోవడానికి ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలి. ఇది సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. మానవ హక్కుల సంఘాలు ఆదివాసీ ప్రాంతాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి, బాధితులకు సాయం అందించాలి. NHRC, SHRCలు ఎన్‌కౌంటర్లపై స్వతంత్ర విచారణలు జరపాలి. అంతర్జాతీయ సంస్థలు భారత ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. ఇది దేశ ప్రతిష్ఠకు మచ్చ తెస్తుంది. ప్రభుత్వాలు మానవ హక్కుల సంఘాలతో సమన్వయం చేసుకుని సమస్యలు పరిష్కరించాలి. ఆదివాసీలు తమ సమస్యలు చెప్పుకోవడానికి ప్లాట్‌ఫారమ్‌లు కల్పించాలి. ఇది అవిశ్వాసాన్ని తగ్గించి, శాంతిని నెలకొల్పుతుంది. మానవ హక్కుల సంఘాలు ఆదివాసీలకు న్యాయ సాయం అందించాలి. ఇది వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ప్రభుత్వాలు ఈ సంఘాలను శత్రువులుగా చూడకుండా, సహకరించాలి.


**ఆదివాసీల అభివృద్ధికి సమగ్ర విధానం అవసరం**

ఎన్‌కౌంటర్లు, హక్కుల ఉల్లంఘనలు ఆపడమే కాదు, ఆదివాసీల అభివృద్ధికి సమగ్ర విధానం అవసరం. విద్య, ఆరోగ్యం, ఉపాధి కల్పనలో ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రభుత్వాలు ఆదివాసీల సమ్మతితోనే అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టాలి. ఫారెస్ట్ రైట్స్ యాక్ట్‌ను సమర్థవంతంగా అమలు చేయాలి. మావోయిస్టుల సమస్యను ఆయుధాలతో కాకుండా సంభాషణలతో పరిష్కరించాలి. ఆదివాసీలు దేశ సంపద, వారి హక్కులు కాపాడితేనే భారత్ నిజమైన అభివృద్ధి సాధిస్తుంది. ప్రభుత్వాలు, సమాజం ఇప్పుడు స్పందించకపోతే భవిష్యత్తు తరాలు ఈ అన్యాయాలను మరచిపోలేవు. ఆదివాసీలకు విద్యా సౌకర్యాలు పెంచాలి, ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ఉపాధి అవకాశాలు సృష్టించాలి. ప్రభుత్వాలు ఆదివాసీలను మావోయిస్టులతో ముడివేసి చూడకుండా, వారి సమస్యలను అర్థం చేసుకోవాలి. శాంతి సంధానాలు, అభివృద్ధి ప్యాకేజీలు అవసరం. ఆదివాసీల సంస్కృతి, భాషలను సంరక్షించాలి. ఇది దేశ వైవిధ్యాన్ని కాపాడుతుంది. ప్రభుత్వాలు ఆదివాసీలతో సంప్రదింపులు జరిపి విధానాలు రూపొందించాలి. లేకపోతే, సమస్యలు మరింత తీవ్రమవుతాయి. ఆదివాసీల హక్కులు కాపాడడం దేశ ప్రగతికి కీలకం.

శానం ఏలేశ్వరరావు
విద్యా విశ్లేషకులు, 9985833750

### భారత జ్ఞాన వారసత్వ సంరక్షణకు

# మూలస్తంభాలు



భారతదేశంలో ముద్రిత, ప్రచురిత జ్ఞాన సంపదను సంరక్షించడం, నమోదు చేయడం మరియు దేశ వారసత్వంగా రూపొందించడం అనేది ఒక చారికల సంప్రదాయం. ఈ ప్రయత్నంలో రెండు చట్టాలు మూలస్తంభాలుగా నిలుస్తాయి: 1867లోని ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ బుక్స్ యాక్ట్ మరియు 1954లోని డెలివరీ ఆఫ్ బుక్స్ అండ్ న్యూస్పేపర్స్ (పబ్లిక్ లైబ్రరీస్) యాక్ట్. ఈ చట్టాలు దేశంలో ప్రచురించే ప్రతి ప్రతిని రాష్ట్రం యొక్క జ్ఞానాభివృద్ధి మరియు చరిత్రలో భాగంగా నమోదు చేయడానికి ఒక న్యాయపరమైన వ్యవస్థను (లీగల్ డిపాజిట్) ఏర్పాటు చేశాయి. పబ్లిక్ లైబ్రరీలు ఈ వ్యవస్థలో కీలక పాత్ర వహించి, జాతీయ జ్ఞానభాండాగారాలను నిర్మించడంలో సహాయపడతాయి.

1. ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ బుక్స్ యాక్ట్, 1867: లైబ్రరీ సందర్భంలో లక్షణాలు మరియు విధులు: బ్రిటిష్ పాలనలో 1867లో ప్రవేశపెట్టబడిన ఈ చట్టం, భారతదేశంలో ప్రచురణలను నియంత్రించడానికి మరియు నమోదు చేయడానికి మొదటి ప్రధాన చట్టపరమైన చర్య.

**లైబ్రరీల సందర్భంలో దీని ప్రాముఖ్యత మూడు ప్రధాన రంగాలలో కనిపిస్తుంది:**

రాష్ట్ర స్థాయి నిక్షేపణకు పునాది (ఫౌండేషన్ ఫర్ స్టేట్ లెవెల్ డిపాజిట్): ఈ చట్టం ప్రకారం, దేశంలో ప్రచురించబడిన ప్రతి పుస్తకం, పత్రిక, పంపిణీదారుడు లేదా ప్రచురణకర్త నుండి ప్రతిని సంబంధిత ప్రాంతీయ ప్రభుత్వానికి (ప్రెసిడెన్సీ ప్రభుత్వాలు) సమర్పించాలని నిబంధన ఉంది. ఇది రాష్ట్ర స్థాయిలో ప్రచురణలను సేకరించడానికి మరియు నమోదు చేయడానికి ఒక అధికారిక వ్యవస్థను సృష్టించింది.

- రాష్ట్ర కేంద్ర లైబ్రరీ సేకరణల నిర్మాణంలో పాత్ర (రోల్ ఇన్ బిల్డింగ్ స్టేట్ సెంట్రల్ లైబ్రరీ కలెక్షన్స్): ఈ చట్టం ద్వారా సేకరించిన పుస్తకాలు తరువాత వివిధ ప్రాంతాలలోని ప్రధాన లైబ్రరీలకు (చెన్నై, కోల్కతా, ముంబైలోని లైబ్రరీలు) బదిలీ చేయబడ్డాయి. ఈ విధంగా, ఈ లైబ్రరీలు తమ ప్రాంతంలో ప్రచురించిన వనరులను సంరక్షించే "రాష్ట్ర కేంద్ర గ్రంథాలయాలుగా" వ్యవహరించడానికి ఈ చట్టం పునాది వేసింది. కాలక్రమేణా ఈ లైబ్రరీలు గొప్ప జ్ఞాన సంపద కేంద్రాలుగా మారాయి.
- రాష్ట్ర లైబ్రరీ చట్టాల ద్వారా అమలు (ఇంప్లిమెంటేషన్ త్రూ స్టేట్ లైబ్రరీ యాక్ట్స్): 1867 చట్టం యొక్క స్ఫూర్తితో, వివిధ రాష్ట్రాలు తమ స్వంత పబ్లిక్ లైబ్రరీ చట్టాలను రూపొందించుకున్నాయి. ఈ చట్టాలు లైబ్రరీలను నిర్వహించడానికి మరియు చట్టబద్ధ నిక్షేప వ్యవస్థను మరింత శక్తివంతం చేయడానికి ఒక చట్టపరమైన రూపురేఖలను అందించాయి.
- రాష్ట్ర లైబ్రరీ చట్టాల ద్వారా అమలు (ఇంప్లిమెంటేషన్ త్రూ స్టేట్ లైబ్రరీ యాక్ట్స్): 1867 చట్టం యొక్క స్ఫూర్తితో, వివిధ రాష్ట్రాలు తమ స్వంత పబ్లిక్ లైబ్రరీ చట్టాలను రూపొందించుకున్నాయి. ఈ చట్టాలు లైబ్రరీలను నిర్వహించడానికి మరియు చట్టబద్ధ నిక్షేప వ్యవస్థను మరింత శక్తివంతం చేయడానికి ఒక చట్టపరమైన రూపురేఖలను అందించాయి. తమిళనాడు పబ్లిక్ లైబ్రరీ చట్టం, 1948: ఇది రాష్ట్రంలో లైబ్రరీ వ్యవస్థలను స్థాపించడానికి, నియంత్రించడా నికి ఒక సంస్థాగత నిర్మాణాన్ని ఏర్పాటు చేసింది. చెన్నైలోని కన్నేమర పబ్లిక్ లైబ్రరీ (ఇప్పుడు అనేక చట్టాల ప్రకారం డిపాజిటరీ లైబ్రరీగా పనిచేస్తోంది) వంటి లైబ్రరీలు ఈ చట్టం కింద లబ్ధి పొందాయి.
- రాష్ట్ర పబ్లిక్ లైబ్రరీ మరియు సమాచార కేంద్రాల చట్టం 2008 (ఉదా: బీహార్): ఇటీవలి చట్టాలు, సమాచార సాంకేతికత మార్పులను అంగీకరిస్తూ, లైబ్రరీలను సమాచార కేంద్రాలుగా మార్చడానికి మరియు డిజిటల్ నిక్షేపణ వంటి ఆధునిక అవసరాలను పరిష్కరించడానికి రూపొందించబడ్డాయి. ఈ చట్టాలు తరచుగా చట్టబద్ధ నిక్షేపానికి సంబంధించిన నిబంధనలను కలిగి ఉంటాయి.

**డెలివరీ ఆఫ్ బుక్స్ అండ్ న్యూస్ పేపర్స్ (పబ్లిక్ లైబ్రరీస్) యాక్ట్, 1954: లక్షణాలు.. విధులు:**

స్వాతంత్ర్యం తరువాత, 1954లో ప్రవేశపెట్టబడిన ఈ చట్టం, జాతీయ స్థాయిలో చట్టబద్ధ నిక్షేప వ్యవస్థను మరింత బలోపేతం చేసింది, కేంద్రీకృతం చేసింది. కోర్ పర్పస్ (ప్రధాన ఉద్దేశ్యం): ఈ చట్టం యొక్క ప్రధాన ఉద్దేశ్యం, భారతదేశంలో ప్రచురించబడిన ప్రతి ప్రచురణ (పుస్తకాలు, పత్రికలు, జర్నల్స్ మొదలైనవి) నుండి కొన్ని నిర్దిష్ట ప్రతులు, ప్రత్యేకంగా గుర్తించబడిన జాతీయ మరియు ప్రాంతీయ లైబ్రరీలకు (డిజిగ్నేటెడ్ డిపాజిటరీ లైబ్రరీస్) స్వయంచాలకంగా మరియు ఉచితంగా అందేలా చూసుకోవ దం. ఇది 1867 చట్టంలో ఉన్న అంశాలను విస్తరించి, దాన్ని ఎక్కువ సమర్థవంతంగా మరియు బాధ్యతాయుతంగా చేసింది. నియమించబడిన నిక్షేప గ్రంథాలయాలు (డిజిగ్నేటెడ్ డిపాజిటరీ లైబ్రరీస్): ఈ చట్టం కింద, నాలుగు లైబ్రరీలు ప్రధాన జాతీయ నిక్షేప గ్రంథాలయాలుగా నియమించబడ్డాయి. ప్రతి ప్రచురణకర్త తన ప్రచురణ నుండి ప్రతిని వీటికి పంపాలి:

1. నేషనల్ లైబ్రరీ, కోల్కతా: ఇది దేశంలో అతిపెద్ద నిక్షేప గ్రంథాలయం. భారతదేశంలో ప్రచురించిన ప్రతి ప్రచురణ యొక్క ప్రతిని స్వీకరించే అధికారం దీనికి ఉంది. ఇది జాతీయ జ్ఞానభాండారాన్ని సంరక్షిస్తుంది.
2. కన్నేమర పబ్లిక్ లైబ్రరీ (పూర్వం కనెమారా పబ్లిక్ లైబ్రరీ), చెన్నై: దక్షిణ భారత ప్రాంతంలో, ముఖ్యంగా తమిళ భాషా సాహిత్యంలో ప్రచురించిన వనరులను సేకరించడం మరియు సంరక్షించడం దీని ప్రధాన పాత్ర.
3. సెంట్రల్ లైబ్రరీ, ముంబై: పశ్చిమ భారత ప్రాంతం, మరాఠీ మరియు గుజరాతీ సాహిత్యానికి సంబంధించిన ప్రచురణల సేకరణకు ఇది కేంద్రం.
4. ఢిల్లీ పబ్లిక్ లైబ్రరీ, ఢిల్లీ: ఉత్తర భారతదేశం మరియు హిందీ భాషా ప్రచురణలకు సంబంధించి ఇది ప్రాథమిక నిక్షేప గ్రంథాలయంగా పనిచేస్తుంది.

**జాతీయ లైబ్రరీ సేకరణల పునాది (ఫౌండేషన్ ఆఫ్ ది నేషనల్ లైబ్రరీ కలెక్షన్):**

ఈ చట్టం స్వయంచాలక నిక్షేపం ద్వారా, భారతదేశంలో ప్రచురించబడిన అన్ని రకాల సాహిత్యం, పరిశోధన,జ్ఞానం యొక్క సంపూర్ణ మరియు నిరంతరాయమైన సేకరణను నిర్ధారిస్తుంది. ఈ విధంగా, ఇది జాతీయ లైబ్రరీ సేకరణలను నిర్మించడానికి పునాదిగా పనిచేస్తుంది, ఇవి భవిష్యత్ తరాల కోసం జాతీయ జ్ఞానం మరియు సాంస్కృతిక వారసత్వాన్ని అందుకొనేలా చేస్తాయి.

**లైబ్రరీ నమోదు ప్రణాళిక ప్రాముఖ్యత (సిగ్నిఫికెన్స్ ఇన్ లైబ్రరీ రిజిస్ట్రేషన్ ప్లానింగ్):**

లైబ్రరీ మరియు సమాచార శాస్త్రవేత్తలు, పరిశోధకులు మరియు ప్రణాళికదారులకు, ఈ చట్టాలు చాలా ముఖ్యమైనవి. ఎందుకంటే:


- ఇవి జాతీయ బిబ్లియోగ్రఫీ (భారతీయ గ్రంథ పట్టిక) సృష్టికి ఆధారాన్ని అందిస్తాయి. ఈ చట్టాల ద్వారా నిర్మించబడిన నిక్షేప వ్యవస్థ ద్వారా,(ఐ.ఎస్. బీ. ఎన్) (ఇంటర్నేషనల్ స్టాండర్డ్ బుక్ నంబర్) మరియు (ఐ.ఎస్.ఎస్.ఎన్)(ఇంటర్నేషనల్ స్టాండర్డ్ సీరియల్ నంబర్) వంటి ఆధునిక నమోదు వ్యవస్థలు మరింత సమగ్రంగా ఉండేలా చేస్తాయి.లైబ్రరీలు తమ సేకరణ అభివృద్ధి విధానాలను రూపొందించేటప్పుడు, వీటి ద్వారా అందుబాటులో ఉండే వనరుల గురించి తెలుసుకోవచ్చు. ఈ చట్టాలు కాపీరైట్ పరిరక్షణ, ముద్రణా చరిత్ర పరిశోధన మరియు సాంస్కృతిక అధ్యయనాలకు చట్టపరమైన మద్దతును ఇస్తాయి.

ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ బుక్స్ యాక్ట్ (1867) మరియు డెలివరీ ఆఫ్ బుక్స్ యాక్ట్ (1954) లు భారతదేశ జ్ఞాన వారసత్వాన్ని రక్షించడానికి రూపొందించబడిన పరస్పరం అనుబంధితమైన చట్టపరమైన నిర్మాణాలు. 1867 చట్టం రాష్ట్ర స్థాయిలో నమోదు మరియు నిక్షేపం కోసం పునాది వేస్తే, 1954 చట్టం దాన్ని జాతీయ స్థాయికి విస్తరించి, నాలుగు ప్రధాన లైబ్రరీలను దేశ జ్ఞాన సంపద యొక్క సంరక్షకులుగా నియమించింది. ఈ వ్యవస్థ లైబ్రరీలను కేవలం పుస్తకాల భండారాలుగా కాకుండా, జీవంతంగా మరియు పెరుగుతున్న జాతీయ జ్ఞానభాండారాలుగా మార్చడంలో సహాయపడింది. డిజిటల్ యుగంలో, ఈ చట్టాల సూత్రాలు ఇప్పటికీ ప్రస్తుతం ఉన్నాయి, అయితే ఇప్పుడు ఇ-ప్రచురణలు, డిజిటల్ వనరుల నిక్షేపానికి సవాళ్లు మరియు అవకాశాలను ఎదుర్కొంటున్నా యి. అయినప్పటికీ, ఈ చారికల చట్టాలు భారతదేశం యొక్క ముద్రిత మరియు ప్రచురిత చరిత్రను శాశ్వతంగా నమోదు చేసిన చట్టపరమైన వ్యవస్థ యొక్క మూల స్తంభాలుగా మిగిలి ఉన్నాయి.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

## అభివృద్ధి!



కళలు కావ్యాలు
ప్రజల కోసమా?
మీ పాండిత్య
ప్రదర్శన కోసమా?
రాజుల ఆనందానికి
మీకు అక్షర లక్షలకు
ఆనాటి ప్రయోగాలు!
ఇప్పుడుకాలంమారింది!
ఇది ప్రజాస్వామ్యం
ప్రజలే ప్రభువులు!
వారి అభివృద్ధే
దేశాభివృద్ధి!
దేశమంటే మనుషులు!
మీ'అగ్ర'తాంబూలాలు
కులమత ద్వేషాలు
మీ అహంకారాలు కాదు!
అట్టడుగు జనం
నిర్భాగ్యులై యింకా
దిగజారిపోతే
అది అభివృద్ధి కాదు!
శాస్త్రీయతను త్రుంచి
మూఢత్వాన్ని పెంచే
వైషమ్యాలబ్రతుకూ
ఒక బ్రతుకేనా?
మత విద్వేషాలతో
కులాలపిచ్చితో
జనాన్నిరెచ్చగొట్టటమూ
ఒక పరిపాలనా?
మొన్నటివరకూ'హిందూ
ముస్లిం'భాయిభాయి!
ఇప్పుడేమో 'హిందూ
ముస్లిం'విడిపోఓయి!
మతాలన్నీ ఏనాడో
ఎక్స్ పైరీ అయ్యాయి!
అవి 'కాలధర్మం'చెందాక
ఇక 'సహధర్మం' ఏంటి?
గుడి మసీదు చర్చి...
మత మందిరాలను
విద్యామందిరాలుగా
మార్చుకుందాం రండి!
విద్యా విజ్ఞానాలకి
కులమతాల్లేవు!
కులమత రహితంగా
జ్ఞానాభివృద్ధికావాలి!
మనదేశం అనేక
జాతులమతాలకూడలి!
మనుషులందరూ
వలస జీవులే!
కొన్ని పాశ్చాత్య దేశాలు
విదేశీవిద్యార్థులకుజి
సిటిజన్షిప్ ఇచ్చి-తాము
అభివృద్ధి చెందారు!
ఇక్కడ మన ప్రభువులు
వేలపళ్లుగాఉన్నవాళ్లను
బైటకుపొమ్మనటం
ఎంత మూర్ఖత్వం!
ఇది వైజ్ఞానికయుగం
వైజ్ఞానికాభివృద్ధితో
దేశాభివృద్ధి సాధించు!
మూఢత్వంతో కాదు!
నీ సాహిత్యంతో
పిట్టకతలు కాదు
సైన్స్ ను జోడించి
గట్టి కథలు చెప్పు!
మతాలను బ్యాన్ చేసి
విజ్ఞాన సమాచారంతో
డౌన్ లోడ్ చెయ్యాలి!
అదీ 'అభివృద్ధి' అంటే!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

## ఓటు - ఐదు సంవత్సరాల వెలుగుకు నీవేసే విత్తనం!!

ఓటు.. ఐదు సంవత్సరాలకు ఒక్కసారి
నీ చేతికి చేరే అమూల్యమైన బహుమానంబీ
దాన్ని అమ్ముకుంటే..ఊరి ఎదుగుదలను
నీ చేతులే మట్టిలో పాతిపెట్టినట్టే.
ఓటు.. ఒక కాగితం కాదు,
ఒక గౌరవం, ఓటమి గెలుపులకు మించి
ఒక గ్రామం ఆశలను మోసే శ్వాస.
ఓటు హక్కు కోల్పోవద్దు, అమ్ముకోవద్దు
డబ్బు ఇవ్వగలదు ఒకరోజు ఆనందం,
కానీ ఓటు ఇవ్వగలదు
ఐదు ఏళ్ల అభివృద్ధి, నూరేళ్ల మార్పు.
గ్రామ మట్టి.. నీ అడుగుల మనుగడను చూసి
"నువ్వే మా భవిష్యత్తు"
అని నిశ్శబ్దంగా పిలుస్తుంది
నీ వేలిముద్ర.పల్లె రోడ్లను, బోళ్లు పాఠశాలలను,
చెరువుల కలువలను ప్రకాశించే
దారిగా మారుతుంది.
ఓటు వేయడం.. ఒక నిమిషపు పని,
కానీ ఆ నిమిషం..ఊరి ఐదుసంవత్సరాల విధిని
నియంత్రించే నిర్ణయం.
అందుకే.. ఓటును అమ్ముకోవద్దు,
నీ విలువను తగ్గించుకోవద్దు
ఊరికి తోడ్పడే వ్యూహాన్ని,
నాయకత్వాన్ని, అభివృద్ధి బాటను
ఎంచుకునే అవకాశం కదా ఇది!
ఓటు అనేది.. నీ చేతిలోని చిన్న దీపం కాదు,
యావత్ పల్లెను వెలిగించే జ్యోతిబీ
దానితో నువ్వు.. నీ ఊరిని.. నీ భవిష్యత్తును
నీ పిల్లల రేపటిని తీర్చిదిద్దుతావు.
ఓటు హక్కును అమ్మకండి
ఓటు హక్కును కోల్పోవద్దు
ఓటుతోనే పల్లె పుంజుకుంటుంది,
ఓటుతోనే అభివృద్ధి ముందడుగు వేస్తుంది.
ఐదు సంవత్సరాలకు ఒకేసారి
వచ్చే ఆ పవిత్ర అవకాశం
నువ్వు వేయే ఓటుతోనే
గ్రామం వెలుగుదీపమవుతుంది!

రైటర్ రాజు (యువ రచయిత)
తెలంగాణ యూనివర్సిటీ, నిజామాబాద్.
9347196264.

# సంక్షేమ రాజ్యానికి హంతక స్వభావం ఉంటుందా?



1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పటికి రాజ్యాంగం అమలులోకి తెచ్చుకోవడానికి కొద్దికాలం పట్టినప్పటికి అప్పటికే ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో రాజ్యాంగం, విలువలు, ప్రజాస్వామ్యం, విప్లవాలు వచ్చిన స్థితిలో మన రాజ్యాంగంలో దాని స్వాభావిక గుణాలన్ని కూడా చేర్చుకొని ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలలో పాటు "ప్రవేశిక"లోనే రాజ్యం స్వభావం ఎలా ఉండాలని స్పష్టం చేసుకోవడం జరిగింది. అది ఇప్పటి వరకు భారత ప్రభుత్వాలు ఏవి ఉన్నప్పటికి కూడా సంక్షేమ ప్రభుత్వాలుగా కొనసాగాలనేదే భారత ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఆదేశిక సూత్రాల యొక్క సారం. ఆదేశిక సూత్రాల పేరుతో అన్ని ప్రభుత్వాలకు రాజ్యాంగం ఆదేశాలు జారీ చేసి ఉన్నది. ప్రభుత్వాలు ప్రజల్ని పరిపాలించడానికి అనుకూలంగా ప్రజలకు మౌళిక హక్కులను ప్రాథమిక హక్కుల రూపంలో చేర్చడం జరిగింది. ఏది ఏమైనప్పటికి కూడా ప్రజలకు చెందిన ప్రాథమిక హక్కులు ఖచ్చితంగా అమలు చేయాల్సిన స్థితి సంక్షేమ రాజ్యాలుగా ఉన్న ప్రభుత్వాలదే. కానీ సంక్షేమ ప్రభుత్వాలు కాస్తా తమ ఉనికిని, తమ లక్ష్యాలను దాటుకొని కార్పొరేట్ల కోసం భారత రాజ్యాంగాన్ని ప్రజలు సాధించుకున్న అన్ని చట్టాలకు తిలోదకాలు ఇచ్చి వారికి అనుగుణంగా చట్టసవరణలు చట్టాల అమలును కొనసాగిస్తున్నాయి. మొత్తంగా భారత రాజ్యాంగం లేదా పాలిస్తున్న ప్రభుత్వాలన్ని కూడా సంక్షేమ రాజ్య పాలనన నుంచి బయటికి వచ్చేసాయి. రైతులు, కార్మికులు, పేద ప్రజలు రాజ్యం దృష్టిలో ప్రజలు కానంత స్థాయిలో వారి పరిపాలన కొనసాగుతున్నది. ప్రభుత్వానికి అగ్రకులాలు, పెట్టుబడిదా రులు, కార్పొరేట్లు, కార్పొరేట్ల ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా పరిపాలన సాగుతున్నది. రాజ్యం సంక్షేమ రాజ్యంగా కొనాసగుతున్న కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలు తమ జీవనోపాధి హక్కును సాధించడం కోసం భూసంస్కరణ అమలు కావాలని ప్రభుత్వంతో శాంతియుతంగా ఎన్నో పోరాటాలు చేసి భూసంస్కరణను అమలు చేస్తాననే ఒక విశ్వాసాన్ని తీసుకోగలిగింది. కానీ అది కష్టతరమైన నేపథ్యంలో వినోభాభావే లాంటి పెద్ద మనుషులను ముందు పెట్టి భూస్వాముల నుంచే భూములను సేకరించి (కొని) ఆ భూములనే భూదానం పేరుతో ప్రజలకు అందించే ప్రక్రియ కొనసాగించేది. అది కూడా సఫలం కాని స్థితిలోనే దేశంలో అనేక రైతాంగ సాయుధ పోరాటాలు బలంగా ముందుకు వచ్చాయి. ఆనాటి నుండి ఈనాటి వరకు అర్థ శతాబ్దంపైగా ముందుకు వచ్చిన ఏ రైతాంగ కార్మిక పోరాటాల పట్ల ప్రభుత్వాలు ప్రజాస్వామికంగా వ్యవహరించలేక పోయాయి. వాటి మూలాల్లోకి వెళ్ళలేక పోయాయి. అలా కాక ప్రజల్ని విభజించి పరిపాలించే విధానానికి మాత్రం ఆనాటి నుండి ఈనాటి వరకు బలంగా విభజన ప్రక్రియను మాత్రం కొనసాగిస్తున్నారు. మన దేశానికి ఉన్న ఇబ్బందికరమైన పరిస్థితే కుల వ్యవస్థ అనుకుంటే, తెలంగాణ వ్యాప్తంగా ఉన్నటువంటి విప్లవోద్యమం ప్రక్రియలో భాగంగా కుల చైతన్యాన్ని అధిగమించి వర్గ స్వభావం కలిగి ఉంటున్న నేపథ్యంలోనే కులపరమైన మత పరమైన దాడులకు తెలంగాణ చాలా దూరంగా ఉండిపోయింది.

అలా ఒక కార్మిక వర్గ చైతన్యాన్ని ప్రజాస్వామిక చైతన్యాన్ని కలిగి ఉన్న నేపథ్యాన్ని తట్టుకోలేని ప్రభుత్వాలు ఎన్‌కౌంటర్ పేరుతో హత్యాకాండను కొనసాగించాయి. ఈ నేపథ్యంలోనే నక్సల్బరీ శ్రీకాకుల పోరాట నేపథ్యంలో దేశ వ్యాప్తంగా హక్కుల సంఘాల ఆవిర్భావం జరిగింది. ఈ హక్కుల సంఘాలు ప్రజలకు ప్రశ్నించడం నేర్పడం రాజ్యాన్ని రాజ్యాంగ బద్ధంగా పరిపాలన చేయాలని నిలదీయడం ప్రభుత్వాలకు కంటగింపుగా మారి హక్కుల సంఘాల నేతలు కూడా నిరాయుధంగా పోరాటం చేసినప్పటికి వారిని న్యాయస్థానాల్లో దోషులుగా చూపెట్టలేక ప్రభుత్వమే వాళ్ళని అత్యంత అమానవీయంగా హత్య చేసింది. హత్యలు జరిగిన నాలుగు దశాబ్దాలు దాటుతున్నా ఒక్క హంతకుడు కూడా ఇప్పటి వరకు శిక్షించబడలేదు. నేడు ఎలాగైతే డా॥ దబోల్కర్, గోవింద్ పన్సారే, ప్రొ. కల్‌బుర్గి, జర్నలిస్టు గౌరీ లంకేష్ హత్యకు గురికాబడి హంతకులను శిక్షించలేని స్థితి కొనసాగుతూ ఉందో ఈ స్థితి ప్రజాస్వామ్యం పట్ల, రాజ్యాంగం పట్ల న్యాయ వ్యవస్థ పట్ల పూర్తి విశ్వాసాన్ని ప్రజలు ప్రకటించలేని స్థితిలో ఏర్పడి ఉంది. సాయుధ పోరాట ఉద్యమాలపై నిర్బంధమైనా, శాంతియుత ప్రజాస్వామ్య పోరాటాలపై నిర్బంధమైనా ఒకేలాగ కొనసాగుతుంది. ఇందిరా గాంధి ఎమర్జెన్సీ నిర్బంధంలో కూడా న్యాయ వ్యవస్థ పారదర్శకంగా వ్యవహరిస్తూ తన ఎన్నిక చెల్లదని తెలియజేసినందుకు రాజ్యాంగ ప్రక్రియను స్వార్థ పూరితంగా ఉపయోగించుకొని ఎమర్జెన్సీని ప్రకటించి అనేక వేల మందిని నిర్బంధాలకు గురి చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసారు. అదే విధంగా 2014 నుంచి వచ్చిన మోడీ ప్రభుత్వం కూడా ప్రజలను వేటాడుతూనే అధికారంలోకి వచ్చింది. 2002 గుజరాత్ మారణకాండ అయినా తరువాత జరిగిన ముజఫర్ నగర్ హత్యాకాండ అయినా కాందమల్లులో జరిగిన క్రిస్టియన్ల హత్యాకాండ అయినా ఎక్కడ ఏ మత ఘర్షణ జరిగినా చివరికి మైనారిటీ మతస్తుల రక్తం ఏరులుగా కారిన స్థితే కొనసాగింది. మొత్తంగా ప్రభుత్వాలే కుల పరంగా, మతపరంగా, జాతి పరంగా, విభజించి పాలన చేయడంలోనే తమ కుట్రలు కొనసాగాయి. నిన్నమొన్న జరిగిన మణిపూర్ హత్యాకాండలో కూడా మైతీ జాతీయులకు రాజ్యమే అండగా ఉండి వందల కొలది అధునాతన ఆయుధాలను లక్షలాది తూటాలను దోపిడి పేరుతో అప్పగించింది. ఆ విధంగా మణిపూర్‌లో కూకీ, జో జాతి ప్రజలపై మారణకాండ నేటికి కొనసాగుతూనే ఉంది. ఇక దళితులపై మహిళలపై హత్యాకాండ అయితే అంతే లేకుండా ఉంది. మహారాష్ట్రలో జరిగిన ఖైర్లాంజి మొదలు ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగిన అన్ని హత్య, అత్యాచారకాండలపై బాధితులెవరికి న్యాయం దొరకలేని స్థితి ఉన్నది. చివరికి బాధితులను కూడా చంపేసి కేసులను ముగించిన స్థితి దేశవ్యాప్తంగా కొనసాగుతున్నది. నేరస్తులే పాలకులైన చోట న్యాయమూర్తులు కూడా హత్యకు గురికాబడుతున్నారు. బుద్ధిజీవులు ఐదేళ్ళకు పైగా జైళ్ళో బెయిల్ లేకుండా నిర్బంధాలకు గురి అవుతున్నారు. మరొకవైపు కొమురంభీం,బీర్సాముండా, అల్లూరి సీతారామరాజులు ఆదివాసీ నాయకులుగా దేశ వ్యాప్తంగా వారి విగ్రహాలుపెట్టి ప్రభుత్వాలే వారి పోరాట సూర్తిని కీర్తిస్తాయి. ప్రజలు వాళ్ళలాగా పోరాటాల్లోకి ఎదిగి వస్తే మాడివి హిడ్మాలాగా హత్యగావించబడతారు. మధ్యభారతంలో ఆదివాసీలను వేటాడుతూ కార్పొరేట్లకు ఖనిజసంపదను అప్పగిస్తున్నారు. భారత పాలకులకు సంక్షేమ పాలన కన్నా హంతక పాలన బలంగా సాగుతున్నాయి. చట్టాలను మార్చుకుంటారు, ఖనిజ సంపదను కార్పొరేట్లకు అందిస్తారు అలా అందించే క్రమంలో పర్యావరణ విధ్వంసం జరుగుతూ కరోనా మృతుల కన్నా ఎక్కువ మృతులు పర్యావరణ విధ్వంసంతో జరిగినప్పటికి ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. మొత్తంగా మనం జీవించే హక్కును ప్రభుత్వాలు వేటాడుతున్నాయి. అది సాయుధ బలగాలతో కావచ్చు, పర్యావరణ విధ్వంసంతో కావచ్చు. మొత్తంగా పాలకులు వారి స్వభావము సంక్షేమ రాజ్యాంగ ప్రజాస్వామ్య స్ఫూర్తితో కొనసాగడం లేదు. ఎంతటి పోరాటాలనైనా ఆ పోరాటాల్లో ఇన్‌ఫార్మర్లను, కోవర్టులను పెట్టి ఆ ఉద్యమాలను నాశనం చేస్తున్నాయి. ప్రజా పోరాటాలపై ప్రభుత్వ దమన కాండ ఊహించనంత స్థాయిలో కొనసాగుతుంది. ఈ నిర్బంధాలను దాటుకొని ప్రజలు ముందుకు రావడం ద్వారానే మళ్ళీ మనం పాలకులను, సంక్షేమ రాజ్యాలుగా మార్చుకోవడానికి లేక ప్రజా ఉద్యమం విప్లవీకరించబడితే విప్లవాన్ని సాధించుకోవడానికి అవకాశాలు ఏర్పడతాయి.ఆ వైపుగా ప్రతీ ఒక్కరు ప్రశ్నించి ఉద్యమించే స్థితికి ఎదగాల్సిన అవసరాన్ని పౌరహక్కుల సంఘం గుర్తిస్తూ పాలకులు ఎంతటి నిర్బంధమైన ప్రజా చైతన్యం ముందు నిలవదనేది చరిత్ర చూపిస్తున్న వాస్తవం.



ఎన్. నారాయణ రావు
ప్రధాన కార్యదర్శి
పౌరహక్కుల సంఘం




# ఎస్‌బీఐ మెగా ప్రాపర్టీ ఎక్స్‌పో

### హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు..



**హైదరాబాద్ (జనంసాక్షి) :** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ), హైదరాబాద్ సర్కిల్ ఆధ్వర్యంలో డిసెంబర్ 19, 20, 21 తేదీల్లో మెగా ప్రాపర్టీ ఎక్స్‌పో జరగనుంది. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నగరంలోని 50 మందికి పైగా ప్రముఖ బిల్డర్లు వారి నిర్మాణంలో ఉన్న, రాబోయే రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్‌లను ప్రదర్శిస్తారు. వినియోగదారులు తమ కలల ఇంటిని కొనుగోలు చేయడానికి ఇది ఒకే వేదికపై అన్ని పరిష్కారాలను అందించే వేదిక. ఎక్స్‌పోలో తమ ఇంటిని బుక్ చేసుకునే వారికి ఎస్బీఐ హోమ్ లోన్లలో ప్రాసెసింగ్ ఫీజు, వడ్డీ రేట్లలో ప్రత్యేక రాయితీలు అందించనున్నారు. ఎస్బీఐ హోమ్ లోన్‌లతో పాటు, పీ-ల్యాప్ (ఆస్తిపై వ్యక్తిగత రుణం), మాక్స్‌గైన్ - హైబ్రిడ్, ఎన్ఆర్ఐ హోమ్ లోన్ వంటి ఇతర రుణ ఉత్పత్తుల గురించి కూడా వివరించబడుతుందని, కస్టమర్‌లు బ్యాంకు శాఖను సందర్శించకుండానే యోనో యాప్ ద్వారా హోమ్ లోన్‌లను దరఖాస్తు చేసుకునే డిజిటల్ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని ఎస్‌బీఐ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సర్కిల్ ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ మాట్లాడుతూ.. గృహ రుణాలలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్కెట్ లీడర్‌గా కొనసాగుతోందని, కస్టమర్‌లకు ఉత్తమ సేవలు అందించడానికి ఈ ఎక్స్‌పోను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్మాణ రంగంలో వృద్ధిని, హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ప్రాముఖ్యతను వివరించారు. హైదరాబాద్‌లో ఆస్తి కొనుగోలు చేయాలనే ఆసక్తి ఉన్నవారు ఈ మెగా ప్రాపర్టీ ఎక్స్‌పోను సందర్శించి, తమకు నచ్చిన ఇంటిని ఎంచుకుని, ఈ ప్రాపర్టీ షోను విజయవంతం చేయాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కోరింది.

# సమాజ హితం.. యువత అభిమతం కావాలి

### యువ ఆపద మిత్ర వాలంటీర్ల శిక్షణలో హైడ్రా కమిషనర్

**హైదరాబాద్, డిసెంబరు 11(జనంసాక్షి) :** బాధ్యతాయుతమైన పౌరులతోనే మెరుగైన సమాజం ఏర్పడుతుంది.. ఎవరికి వారు మనకెందుకు అనుకోకుండా.. తనవంతుగా సమాజ హితం కోసం కాస్త ఆలోచించాలి అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గారు సూచించారు. మరీ ముఖ్యంగా యువత ఈ విషయమై దృష్టి పెట్టాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తనను తాను రక్షించుకోవడమే కాకుండా తోటి వారితో పాటు చుట్టుపక్కల వారిని సురక్షితంగా కాపాడేందుకు ఉద్దేశించిన -యువ ఆపద మిత్ర- పథకం వాలంటీర్లకు గురువారం ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ప్లాటినం జూబ్లీ హాల్‌లో జరిగిన శిక్షణ కార్యక్రమంలో హైడ్రా కమిషనర్ మాట్లాడారు. ఎన్‌డీఎంఏ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ) ప్రారంభించిన యువ ఆపద మిత్ర పథకంలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు భాగస్వామ్యం అవ్వడం ఎంతో శుభపరిణామమని అన్నారు. వాతావరణ కాలుష్యంతో భారీ వర్షాలు సమోదౌతున్నాయని.. ఇలాంటి తరుణంలో యువ వాలంటీర్లు వివిధ శాఖలతో సమన్వయంగా పని చేయడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం






వైస్ ఛాన్సలర్ సీనియర్ ప్రొఫెసర్ కుమార్ మోలుగరం, హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య, రీజనల్ సెంటర్ ఫర్ అర్బన్ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్(ఆర్‌సీయూఈఎస్) డైరెక్టర్ ప్రొ. నగేష్, యువ ఆపద మిత్ర స్టేట్ నోడల్ ఆఫీసర్ గౌతమ్ కృష్ణ తదితరులు యువ ఆపద మిత్ర వాలంటీర్ల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు చేశారు.

**10 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా**

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి మండలం నిజాంపేట విలేజ్ సర్వే నంబరు 191లో 10 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా గురువారం కాపాడింది. దీని విలువ రూ. 750 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఇక్కడ ప్రభుత్వ భూమి కబ్జా జరుగుతుందని స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులతో కలిసి విచారించింది. ఆక్రమణలను నిర్ధారించుకుంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు శాశ్వత నివాసాల జోలికి వెళ్లకుండా.. మిగతా షెడ్డులను, ప్రహరీలను తొలగించి, 10 ఎకరాల భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసి బోర్డులు ఏర్పాటు చేసింది.

**40 ఏళ్ల సమస్యకు హైడ్రా పరిష్కారం**

ముషీరాబాద్ నియోజకవర్గం రాంనగర్ ప్రాంతంలోని మణెమ్మ గల్లీ నివాసితులు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. 40 ఏళ్ల సమస్యను పరిష్కరించారంటూ శాలువను కప్పి అభినందించారు. డ్రైనేజీ పైపులైన్లు తమ స్థలంలోంచి వెళ్లాయని 50 ఏళ్ల క్రితం అక్కడివారు అడ్డుకున్నారు. అప్పటి నుంచి వివాదం కొనసాగడం, భూగర్భ డ్రైనేజీ పైపులైన్లు దెబ్బతినడంతో మురుగు, వరద నీరు నిలిచిపోయి ఇబ్బందులు పడ్డామని, పైపులైన్ల పైన వేసి దారి కూడా బంద్ అవ్వడంతో నరకం చూశామని వాపోయారు. హైడ్రా రాకతో ఈ ఇబ్బందులన్నీ తొలగాయని ఈ సందర్భంగా పలువురు తెలిపారు.



# హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో సర్వైకల్ క్యాన్సర్‌కు చెక్

### జిల్లా వైద్య సిబ్బందికి హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై శిక్షణ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (జనం సాక్షి) :** జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఫీల్డ్ సిబ్బందికి హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గురువారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జరిగిన ఈ శిక్షణలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కౌశిక్ జిల్లా స్థాయి ట్రైనర్‌గా పీహెచ్సీ వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఫీల్డ్ సిబ్బందికి వ్యాక్సిన్ అమలు విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఉమాగౌరి మాట్లాడుతూ 14 సంవత్సరాల లోపు ఉన్న ఆడపిల్లలను గృహసర్వే ద్వారా ముందుగానే గుర్తించి హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఇవ్వడం ద్వారా సర్వైకల్ క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని 90 శాతం వరకూ నివారించవచ్చని తెలిపారు.

జిల్లాలో ఈ వ్యాక్సిన్ అమలుకు సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు త్వరలోనే అందుతాయని అన్నారు. శిక్షణ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కౌశిక్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ గీత, డాక్టర్ సత్యవతి, పవన్, లావణ్య తో పాటు జిల్లా వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.



# నాచారం షాహీ గార్మెంట్ మహిళా కార్మికుల జీతాల పెంపు డిమాండ్ వెంటనే పరిష్కరించాలి

### సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రమా

### స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న షాహీ మహిళా కార్మికుల పోరాటం



**మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి (జనంసాక్షి) :** చలి, భయం, ఒత్తిడిని లెక్కచేయకుండా హక్కుల కోసం ధైర్యంగా పోరాడుతున్న షాహీ మహిళా కార్మికుల సంకల్పం అభినందనీయమని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రమా అన్నారు. నాచారం పరిశ్రమ ప్రాంతంలోని షాహీ యూనిట్‌లో జీతాల పెంపు కోసం మహిళలు చేపట్టిన నిరసన నాలుగో రోజుకు చేరిన సందర్భంగా ఆమె కార్మికులను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తక్కువ వేతనాలతో కుటుంబాలు నెట్టుకొస్తున్న పరిస్థితుల్లో కనీసం 16,000 రూపాయల కనీస వేతనం ఇవ్వడం యాజమాన్యం బాధ్యత అని ఎస్.రమా స్పష్టం చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకుండా షాహీ యాజమాన్యం మొండి వైఖరి ప్రదర్శించడం తీవ్రంగా ఖండించారు. మహిళలు ఐక్యంగా నిలుస్తున్న వేళ యాజమాన్యం చర్చలకు ముందుకు వచ్చి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రభుత్వం కూడా జోక్యం చేసుకుని మహిళా కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఐఎఫ్టియు నాయకులు అరుణ, ప్రదీప్ మాట్లాడుతూ.. నియమాల ప్రకారం 18 వేల రూపాయల వేతనం ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటికీ 9 వేల మాత్రమే చెల్లించడం షాహీ యాజమాన్యం అవలంబిస్తున్న స్పష్టమైన దోపిడీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కార్మికుల పోరాటానికి సంఘీభావంగా చర్లపల్లి లోని ఏపీ రాక్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో 800 మంది కార్మికులకు భోజనం ఏర్పాటు చేశారు. షాహీ యూనిట్ మహిళా కార్మికులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా ఈ కార్యక్రమం చేపట్టామని యూనియన్ నాయకులు తెలిపారు. కార్మికుల పోరాటం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ తమ మద్దతు, సహకారం కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.చంద్రశేఖర్, ఎర్ర అశోక్, నాయకులు పి.సత్యం, పి.గణేష్, ఐ.రాజశేఖర్, జె.వెంకన్న, లింగస్వామి, ఆర్. సంతోష్, మణికంఠ, బి.వి. సత్యనారాయణ, రమేష్, ఏఐటియుసి నాయకులు సత్యప్రసాద్, ధర్మేంద్ర, రమేష్ తదితర కార్మిక సంఘ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



# రెండో విడత 159 పంచాయతీలకు ఎన్నికలు

### 16 గ్రామపంచాయతీ సర్పంచ్‌లు ఏకగ్రీవం

### అన్ని ఏర్పాట్లు పూర్తి

### సాధారణ ఎన్నికల అబ్జర్వర్ షేక్ యాస్మిన్ భాష

**వికారాబాద్ జిల్లా బ్యూరో డిసెంబర్ 11( జనం సాక్షి):** జిల్లా కలెక్టర్, అబ్జర్వర్ ఆధ్వర్యంలో పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ గురు వారము సమావేశం హాలు నందు గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా రెండవ విడత ఎన్నికలకు సంబంధించి మూడవ ర్యాండమైజేషన్ ద్వార పోలింగ్ సిబ్బందిని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ప్రతీక్ జైన్, జనరల్ అబ్జర్వర్ షేక్ యాస్మిన్ బాష సమక్షంలో నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈ ప్రక్రియను కలెక్టర్, అబ్జర్వర్ నిశితంగా పరిశీలించారు.రెండవ విడత 7 మండలాలకు సంబందించి 175గ్రామా పంచాయతీలకు గాను 16గ్రామా పంచాయతీలు ఏకగ్రీవం కాగ , మిగతా 159 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించబడతాయని,, వార్డ్స్ 1520 లకు గాను 122 వర్డ్స్ ఏకగ్రీవం అయ్యాయని,1398వార్డ్స్ కు ఎన్నికలు నిర్వహించబడతాయని తెలిపారు.ఒక్కో మండలం వారీగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు1701 , ఓ.పీ.ఓ 2127 ,టూ మెంబర్ టీం 1072, త్రి మెంబర్ టీం 298, ఫోర్ మెంబర్ టీం 28 లను మొత్తం 1398 సిబ్బంది ని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో అదనపు కలెక్టర్ సుధీర్, డీపీఓ జయసుధ, నోడల్ అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి కొండా సురేఖపై వార్తలు అవాస్తవం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్ర మంత్రి కొండా సురేఖకు న్యాయస్థానం నాన్ బెయిలబుల్ వారెంట్ ఇష్యూ చేసినట్టు కొన్ని మాధ్యమాల్లో వస్తున్న వార్తలు అవాస్తమని ఓ ప్రకటన విడుదలైంది. తదుపరి విచారణ ఫిబ్రవరి 5వ తేదీన కోర్టుకి హాజరుకావాలని న్యాయస్థానం స్పష్టం చేసినట్టు ప్రకటనలో మంత్రి కార్యాలయం పేర్కొంది.

# మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో మురుగునీటి సమస్య తీవ్రం

### శాశ్వత పరిష్కారానికి 133.5 కోట్లు మంజూరు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసిన ఎంపీ ఈటల

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాదు-సికింద్రాబాద్ జంట నగరాల్లో తీవ్రతరమవుతున్న మురుగునీటి సమస్యపై విస్తృతంగా వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల మాట్లాడుతూ నగరం అత్యంత వేగంగా పెరుగుతున్నప్పటికీ, దశాబ్దాల కిందట ఏర్పాటైన పాత మురుగునీటి పారుదల వ్యవస్థే ఇప్పటికీ వినియోగంలో ఉందని, ఫలితంగా అనేక కాలనీల్లో డ్రైనేజీలు తరచుగా పొంగిపొర్లుతున్నాయని తెలిపారు. కొత్తగా అభివృద్ధి చెందుతున్న మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో సమస్య మరింత తీవ్రంగా మారిందని, మురుగు నీరు చెరువులు, వాగులు, నదుల్లోకి చేరి తీవ్రమైన జల కాలుష్యానికి దారితీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.జల కాలుష్యంతో ప్రజలు పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, దీనికి శాశ్వత పరిష్కారం కోసం జాతీయ నది సంరక్షణ సంస్థ (ఎన్ఆర్సీడి) ద్వారా హైదరాబాదు మెట్రో నీటి సరఫరా, కాల్వల నిర్వహణ మండలి (హెచ్ఎండబ్ల్యూఎస్‌బీ)కి 133.5 కోట్లు మంజూరు చేయాలని ఈటల కేంద్ర మంత్రిని కోరారు.మురుగునీటి శుద్ధి కేంద్రాల విస్తరణ, కొత్త పారుదల లైన్ల ఏర్పాటు, చెరువులు-నదుల్లో కలుషిత ప్రవాహం నివారణ వంటి పనులకు ఈ నిధులు అత్యవసరమని ఎంపీ ఈటల వివరించారు.కేంద్ర ప్రభుత్వం ఈ విషయాన్ని సానుకూలంగా పరిగణించి అవసరమైన సహకారం అందిస్తుందన్న నమ్మకం వ్యక్తం చేశారు.




# సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 294 వాహనాల వేలం

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 11 (జనంసాక్షి) :** సైబరాబాద్ కమిషనరేట్ పరిధి మొయినాబాద్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో గత కొంతకాలంగా ఉండిపోయిన 294 వాహనాలను ఆన్లైన్ ద్వారా వేలంవేసి విక్రయించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు ట్రాఫిక్ విభాగం పోలీస్ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధి మొయినాబాద్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలోవున్న వివిధ కేసుల్లో పట్టుబడిన, వదిలివేసిన, క్లెయిమ్ చేయని వివిధ రకాల 294 వాహనాలను ఆన్‌లైన్ వేలం ద్వారా విక్రయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని సైబరాబాద్ పోలీసులు ఓ ప్రకటనలో తెలిపారు. సైబరాబాద్ (మెట్రోపాలిటన్ ఏరియా) పోలీస్ చట్టం%-%2004 సెక్షన్ 6(2), 7తో పాటు, హైదరాబాద్ సిటీ పోలీస్ చట్టం సెక్షన్ 39, 40, 41 ప్రకారం వాహనాలను వేలం వేయడానికి పోలీసులకు అధికారిక అనుమతి ఉందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ వాహనాలపై ఎవరికైనా ఎటువంటి యాజమాన్య హక్కులు లేదా ఇతర అభ్యంతరాలు ఉన్నా ఈ ప్రకటన వెలువడిన తేదీ నుంచి ఆరు నెలల్లో మీ వివరాలతో సైబరాబాద్ పోలీస్ కమీషనర్‌కు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. మొయినాబాద్ పోలీస్ స్టేషన్ తో పాటు బౌరంపేట పరిధిలో సైతం 119 వాహనాలకు ఆన్లైన్ వేలాన్ని నిర్వహించే అవకాశం ఉందని, గడువులోగా స్పందించని వాహనదారుల వాహనాలను పబ్లిక్ లో వేలం వేయడం జరుగుతుందని మరో మారు స్పష్టం చేశారు. మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న వాహనాల వివరాలకొరకై మోటార్ ట్రాన్స్ పోర్ట్ ఆఫీస్ ఆర్ఐ ఎన్. వీరలింగంను సంప్రదించవలసిందిగా అధికారులు సూచించారు. మరిన్ని వివరాలకు 94906 17317 ఫోన్ నెంబర్ ద్వారా ను సంప్రదించవచ్చుని తెలిపారు. పూర్తి వివరాలు సైబరాబాద్ పోలీస్ అధికారిక వెబ్‌సైట్ www.cyberabadpolice.gov.inలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.




# 19 నుంచి 21 వరకు మహా సాంస్కృతిక వేడుక 'హైడ్.ఆర్ట్ 2025'

### ఎంఎఫ్ హుస్సేన్, ఎస్హెచ్ రజా అరుదైన కళాకృతులు ప్రదర్శన




**ఖైరతాబాద్ (జనంసాక్షి) :** మహా సాంస్కృతిక వేడుక 'హైడ్.ఆర్ట్ 2025' ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు నానక్‌రామ్‌గూడలోని నవనామీ గ్రూప్ ఈయాన్ హైదరాబాద్‌లో వైభవంగా నిర్వహించనున్నట్లు హైడ్.ఆర్ట్ షో డైరెక్టర్ అన్నపూర్ణ మడిపడిగ తెలిపారు. ఈ వివరాలు తెలిపేందుకు జూబ్లీ హిల్స్, కావూరి హిల్స్ లో ఉన్న ఏక్ చిత్ర ఆర్ట్ గ్యాలరీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో ప్రత్యేక గుర్తింపు గల ఆర్ట్ ఫెస్టివల్ అవసరమని భావించామన్నారు. ఈ సాంస్కృతిక వేడుక ఆ లోటును పూరిస్తోందన్నారు. ఈ మహత్తర వేడుక ప్రతిభావంతులైన కళాకారులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చే వేదికగా నిలుస్తోందన్నారు. 200 మందికి పైగా కళాకారులతో ఈ ఫెస్టివల్ నగరంలో జరగనున్న అతిపెద్ద కళా వేడుకలలో ఒకటిగా నిలవనుందని చెప్పారు. ఇందులో ప్రసిద్ధ కళాకారుల మాస్టర్‌పీసులతో పాటు హైదరాబాద్‌కు చెందిన 35 మంది అత్యుత్తమ కళాకారుల ప్రత్యేక ప్రదర్శన కూడా ఉంటుందన్నారు. కీర్తనం ద్వారా కళా రంగంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న తెలుగు కళాకారులను సత్కరించనున్నామని చెప్పారు. కొత్త తరాలకు వాళ్ల విశిష్టతను తెలియజేయడమే మా లక్ష్యమన్నారు. రెండో రోజు, ప్రముఖ కార్టూనిస్టు శంకర్ పామర్తి మహాత్మా గాంధీపై రూపొందించిన 150 చిత్రాల ప్రత్యేక పుస్తక ఆవిష్కరణ కూడా ఉంటుందన్నారు. హైడ్.ఆర్ట్ ఫౌండర్ హసన్ మాట్లాడుతూ ముంబై, ఢిల్లీ, బెంగళూరు వంటి నగరాల్లో జరిగే ఉన్నత స్థాయి ఆర్ట్ షోల మాదిరిగా హైదరాబాదులో కూడా ప్రీమియం ప్రదర్శనలు జరగాలన్న అవసరాన్ని గుర్తించామన్నారు. నవనామి ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ గద్దె వెంకట నవీన్ మాట్లాడుతూ ఈ సాంస్కృతిక వేడుక గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని నిర్మించాలన్న మా నిబద్ధతకు నిదర్శనమన్నారు. నిర్మాణాలు, వ్యాపారం, కళ ఈ మూడు రంగాలు కలిసే నగరమే సరికొత్త సృజనాత్మకతకు వేదిక అవుతుందన్నారు. ప్రఖ్యాత కళాకారులు ఏ రాజేశ్వరరావు మాట్లాడుతూ ఈ సాంస్కృతిక వేడుక హైదరాబాద్‌లో జరగబోయే అతి పెద్ద ఆర్ట్ షోలలో ఒకటన్నారు. ఈ వేదిక ద్వారా అనుభవజ్ఞులైన కళాకారులకే కాదు, గుర్తింపు కోసం ఎదురు చూస్తున్న యువ కళాకారుల ప్రతిభకు కూడా ప్రోత్సాహం లభిస్తుందన్నారు. ప్రఖ్యాత కళాకారిణి పద్మా రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో కళపై ఆసక్తి పెరుగుతోందన్నారు. ఒకే ఒక్క కళాశాలతో ఈ ప్రయాణం ప్రారంభమైందన్నారు. ఇప్పుడు అనేక సంస్థలకు విస్తరించిందన్నారు. నవనామి ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎంఓ, బిజినెస్ హెడ్ ఆర్ నవీన్ కుమార్ మాట్లాడుతూ కళ, డిజైన్ కలిసినప్పుడు నగరాన్ని సుసంపన్నం చేసే ఒక చైతన్యవంతమైన సాంస్కృతిక చిత్రపటాన్ని క్రియేట్ చేస్తుందన్నారు. మా రాబోయే అల్ట్రా-లగ్జరీ మెగలియో ప్రాజెక్ట్ కూడా ఇదే సృజనాత్మకత, కళాత్మకత భావాలను ప్రతిబింబిస్తోందని చెప్పారు.

# తల్లిదండ్రుల కళ్లలో ఆనందం.. పిల్లల ముఖంలో ఉత్సాహం

### ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఐవీఆర్ చిన్నారుల సందడి




**హైదరాబాద్, డిసెంబర్ 11 (జనంసాక్షి) :** దృష్టి లోపం సమస్య ఉండవచ్చు, అది వినోదానికి, ఆనందానికి అడ్డంకి కాదు. ఎందుకంటే, దృష్టికి పరిమితులు ఉండవచ్చు, కానీ ఆనందానికి, ఆత్మవిశ్వాసానికి కాదు. దీనిని రుజువు చేసింది ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల. ఈ హాస్పటల్ కు చెందిన 'ఇన్‌స్టిట్యూట్ ఫర్ విజన్ రిహాబిలిటేషన్' (ఐవీఆర్) ఆధ్వర్యంలో దృష్టి లోపం ఉన్న పిల్లలు, వాళ్ల తల్లితండ్రులు శంకరపల్లి వద్ద ఉన్న 30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న వైల్డ్ వాటర్స్ అమ్యూజ్‌మెంట్ పార్క్‌లో సందడి చేశారు. నాలుగు వందల మంది దృష్టి లోపం ఉన్న పిల్లలు ఇందులో పాల్గొన్నారు. ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు, రైడ్లతో సరికొత్త ప్రపంచంలో తేలియాడారు. ముందుగా ఈరోజు ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల క్యాంపస్‌లో రుచికరమైన అల్పాహారంతో మొదలైంది. అనంతరం పిల్లల రంగురంగుల సాంస్కృతిక కార్యక్రమం వేదికను సందడి చేసింది. వారి ప్రదర్శనలు ఉత్సాహంతో నిండిపోయాయి. ఇవి అద్భుతమైన శుభారంభాన్ని ఇచ్చాయి. అనంతరం పార్క్‌లోని వివిధ రైడ్లు, వాటర్ ఆక్టివిటీస్‌లో పాల్గొన్నారు. పార్క్ ఫుడ్‌కోర్ట్‌లలో సిద్ధం చేసిన భోజనాలు ఆస్వాదించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఒక్యులరిస్ట్రీ లాబొరేటరీ హెడ్ డాక్టర్ తర్జని దవే చిన్నారులను ప్రేరేపిస్తూ మాట్లాడారు. అందరినీ ఇలా చెప్పమని కోరారు. 'నేను బలవంతుడిని, నేను సమర్థుడిని, నేను అందంగా ఉన్నాను, నాకు పరిమితులు లేవు' ఈ నినాదం క్యాంపస్‌లో మార్మోగింది. తర్వాత పిల్లలు తమ సోదరులు, తల్లిదండ్రులు, సిబ్బందితో కలిసి వివిధ ఆటలు, రైడ్లను ఆనందించారు. ఈ సందర్భంగా ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలలో ఇన్‌స్టిట్యూట్ ఫర్ విజన్ రిహాబిలిటేషన్ హెడ్ డాక్టర్ బ్యూలా క్రిస్టీ మాట్లాడుతూ తల్లిదండ్రులు, ముఖ్యంగా తల్లులు, మనసు విప్పి మాట్లాడటం, తమ పిల్లల బలాలను చూడటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రిహాబిలిటేషన్ అనేది కేవలం నేర్చుకోవడం, స్వతంత్రత మాత్రమే కాదన్నారు. భావోద్వేగ సహాయం, సమూహ బలం కూడా అంతే ముఖ్యమని ఇలాంటి క్షణాలు మాకు గుర్తు చేస్తాయన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన మొదటి విడత పంచాయతీ ఎన్నికల పర్వం

● 91.7% శాతం పోలింగ్ నమోదు

**చండూరు, డిసెంబర్ 11 (జనంసాక్షి) :** చండూర్ మండలం మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఉదయం 7.00 గంటలకు ప్రశాంతంగా ప్రారంభమయ్యింది.మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన ఓటింగ్ కు సంబంధించి 91.7%శాతం పోలింగ్ నమోదయ్యింది. వణికించే చలిని సైతం లెక్క చేయకుండా... గ్రామ ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేందుకు గ్రామాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుండే ఓటర్లు బారులు తీరారు. ఉదయం 9.00 గంటల సమయానికి సగటున 24.5 శాతం పోలింగ్ నమోదయ్యింది. 11 గంటల సమయానికి శాతం ఓటింగ్ 65.30




పూర్తయ్యిందని అధికారులు ప్రకటించారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగగా... నిర్ణీత సమయం లోపు క్యూ లైన్లలో నిలుచున్న వారికి కూడా ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఓటు వేసే అవకాశం కల్పించారు. అనంతరం మధ్యాహ్నం 2.00 గంటల నుండి కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఓట్ల లెక్కింపును చేపట్టి ఫలితాలను వెల్లడించేలా విస్తృత స్థాయిలో చర్యలు చేపట్టారు. కౌంటింగ్ సందర్భంగా ఏ చిన్న తప్పిదానికి సైతం తావులేకుండా జాగ్రత్తగా ఓట్ల లెక్కింపు జరిపారు.కాగా ఎన్నికల సాధారణ పరిశీలకులు జిల్లా అధికారులు సైతం పోలింగ్ కేంద్రాలను విస్తృతంగా సందర్శిస్తూ ఓటింగ్ తీరుతెన్నులను పరిశీలన జరిపారు. తదితర చోట్ల పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ తీరుతెన్నులను పరిశీలించారు.

## నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌కు ఘన సన్మానం



**జడ్చర్ల, డిసెంబర్ 11 (జనంసాక్షి) :** ఎన్మనగండ్ల గ్రామ సర్పంచ్‌గా నూతనంగా ఎన్నికైన మల్గారి రంజిత్ కుమార్ గౌడ్‌ను బిఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు దోరేపల్లి రవీందర్ ఘనంగా సన్మానించారు. గురువారం జరిగిన మొదటి విడత సర్పంచ్ ఎలక్షన్ లలో నవాబ్ పేట్ మండలం ఎన్మనగండ్ల గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన రంజిత్ కుమార్ గౌడ్ 150 ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించడంతో జడ్చర్ల పట్టణానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు దోరేపల్లి రవీందర్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గుండు శ్రీశైలం తదితరులు ఉన్నారు.

## గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా..



**వీపనగండ్ల, డిసెంబర్ 12 (జనం సాక్షి) :** వీపనగండ్ల గ్రామపంచాయతీకి ఈ నెల 17న జరుగుతున్న సర్పంచ్ ఎన్నికల బరిలో ప్రజా సంఘాలు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు బలపరిచిన దయ్యపు రేణుక ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ సర్పంచిగా ఒకసారి ఆదరిస్తే ఐదు సంవత్సరాలు గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. గ్రామంలో పలు సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించే దిశగా ప్రభుత్వంతో పోరాడి సాధిస్తానని అన్నారు. డబ్బుకు దాసోహం అవుతున్న ఈ రాజకీయాలలో నిజాయితీగా ఓటు వినియోగించుకొని ఫుట్బాల్ గుర్తుకు ఓటు వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్‌గా పోటీ చేస్తున్న రామకృష్ణ, బలపర్చిన ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పారాత్రోబాల్ పోటీలో ఇండియాకు సిల్వర్ మెడల్

**శామీర్‌పేట్, డిసెంబర్ 11 (జనంసాక్షి) :** ఈనెల డిసెంబర్ 6 తారీకు నుండి 9 తారీకు వరకు జరిగిన శ్రీలంకలో జరిగిన పారాత్రోబాల్ మొదటి సౌత్ ఏషియా చాంపియన్షిప్ పోటీలలో భారతదేశానికి సిల్వర్ మెడల్ రావడం జరిగిందని లింగాపూర్ తండాకు చెందిన ఇండియా కెప్టెన్ మహేష్ నాయక్ అన్నారు.ఈ పోటీలలో భారత దేశానికి నన్ను కెప్టెన్ గా ఎన్నుకోవడం జరిగింది.నా నాయకత్వంలో భారతదేశం తరఫున బంగ్లాదేశ్ నేపాల్ ఇండోనేషియా పాకిస్తాన్ జట్లను ఓడించి ఫైనల్ శ్రీలంకతో జరిగిన మ్యాచ్లో ఓడి రన్నర్ గా నిలువడం జరిగింది. మొదటి స్థానంలో శ్రీలంక రెండవ స్థానంలో భారతదేశం మరియు మూడో స్థానంలో బంగ్లాదేశ్ ఈ టోర్నమెంట్ ని ముగించాయి.నా పేరు డి. మహేష్ నాయక్ మూడు చింతలపల్లి మున్సిపాలిటీ మేడ్చల్ జిల్లా తెలంగాణ. ఈ పోటీలను శ్రీలంకలోనే




రత్నాపుర గవర్నర్ వారు ప్రారంభించగా పథకాలను. వరల్డ్ పారా త్రోబాల్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ నీలిమ రావత్ పథకాలను అందించగా జనరల్ సెక్రెటరీ ఆల్బర్ట్ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు. పోటీలకు వెళ్లడానికి డిస్టిక్ కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా సహాయం చేసినందుకు ధన్యవాదములు తెలిపారు.

## మహేశ్వరం గ్రామాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతా..



**మహేశ్వరం, డిసెంబర్ 11 (జనం సాక్షి) :** మహేశ్వరం గ్రామాన్ని రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతానాన్ని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి కాకి ఈశ్వర్ ముదిరాజ్ అన్నారు. గురువారం మహేశ్వరం గ్రామంలో కాకి ఈశ్వర్ ముదిరాజ్ ప్రచారం జోరందుకుంది.ఈ సందర్భంగా కాకి ఈశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ...మహేశ్వరం గ్రామ ప్రజల సంక్షేమం,అభివృద్దే తన లక్ష్యమన్నారు.అధికార పార్టీ సర్పంచ్ అభ్యర్థికి మహేశ్వరం గ్రామ ప్రజలందరూ అండగా ఉండాలన్నారు.మహేశ్వరం గ్రామ ఓటర్లందరూ ఉంగరం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.కాంగ్రెస్ పార్టీ బలపరిచిన వార్డు అభ్యర్థులకు ప్రజలు పట్టం కట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దోమ శ్రీనివాస్ రెడ్డి,కర్రోల్ల రాములు ముదిరాజ్,పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న పలువురిపై కేసు నమోదు

**కోహెడ, డిసెంబర్ 11 (జనం సాక్షి) :** ఎన్నికల నియామవళి ఉల్లంఘన, మద్యం రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు కోహెడ ఎస్సై పుల్లా అభిలాష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం సంక్షిప్త వాస్తవాలు డిసెంబర్ 11 న ఎస్సై అభిలాష్ తన సిబ్బందితో పాటుగా, కోహెడ శివార్లలో వాహన తనిఖీలు చేస్తుండగా తనిఖీల సమయంలో పలువురు వ్యక్తులు వేముగంటి సాయి తండ్రి శంకర్, మైసంపల్లి గ్రామ కోహెడ మండలం, అందే కిషోర్ తండ్రి కనకయ్య మైసంపల్లి గ్రామస్తులు వారి ద్విచక్ర వాహనం పై ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా మద్యం రవాణా చేస్తున్నట్లు తనిఖీ చేయగా, నిందితుల వద్ద ఉన్న కాటన్ బాక్స్ లో మద్యం దొరికింది. విచారణలో వేముగంటి సాయి అను వ్యక్తి మైసంపల్లి గ్రామపంచాయతీలో ఐదవ వార్డ్ మెంబర్ గా పోటీ చేస్తూ ఎన్నికలలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడానికి ఓట్లు పొందడానికి మద్యం పంపిణీ చేయడానికి అని పైవారు ఒప్పుకొనగా వారిపై పంచాయతీరాజ్ చట్ట ప్రకారం, ఎక్సైజ్ ఆక్ట్ చట్ట ప్రకారం ఎన్నికల నియామావళి ఉల్లంఘన చట్టాల క్రింద పలు సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేయడమైనదని ఎస్సై తెలిపారు. అలాగే వింజపల్లి గ్రామానికి చెందిన పెసరు శ్రీకాంత్, పెసరు రాజు వింజపల్లి గ్రామానికి చెందిన వీరు అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న వీరిని ఎస్సై అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కోహెడ మండల పరిధిలోని ప్రజలందరికీ తెలుపునది ఏ ఒక్కరు కూడా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్య తీసుకుని కేసు నమోదు చేయబడుతుందని ఎస్సై అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎన్నికలు సజావుగా జరుపుకోవడానికి ప్రజలు అందరూ కూడా స్వేచ్ఛ వాతావరణం లో తమ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అందరూ కూడా స్వేచ్ఛ వాతావరణం లో తమ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్సై తెలిపారు.

## తుక్కాపూర్ అభివృద్ధికి కృషి

● తుక్కాపూర్ బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి ఆంజనేయులు



**మెదక్, డిసెంబర్ 11 (జనం సాక్షి) :** ఉంగరం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని... ఎమ్మెల్యే సునీత రెడ్డి సహకారంతో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని తుక్కాపూర్ టిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి దొడ్ల ఆంజనేయులు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మెదక్ జిల్లా కొల్చారం మండలం తుక్కాపూర్ గ్రామంలో స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు రవీందర్, ఎలుక గంగయ్య, శివకుమార్ లతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ఉంగరం గుర్తుకే ఓటెయ్యాలని అభ్యర్థించారు. గత ఎన్నికల్లో స్వల్ప ఓట్లతో తన సతీమణి అపర్ణ ఓడిపోయిందని... ఈసారి తప్పకుండా భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ఆంజనేయులు ధీమా వ్యక్తం చేశారు. ఆశీర్వదించండి... మీలో ఒకడిగా ఎప్పుడు పిలిచినా అందుబాటులో ఉండి ఆదుకుంటానన్నారు. నాయకుడిగా కాకుండా, మీ సేవకుడిగా పనిచేస్తానని విన్నవించుకున్నారు.

## భారతమ్మ కుటుంబాన్ని పరామర్శించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



**చేవెళ్ల, డిసెంబర్ 11 (జనంసాక్షి) :** బండారి కుటుంబం ప్రజల్లో విశ్వాసం సంపాదించిన కుటుంబం అని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బండారి ఆగిరెడ్డి తల్లి, చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారి శైలజా ఆగిరెడ్డి అత్తగారు భారతమ్మ దశదినకర్మ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి పామేన భీమ్ భరత్‌లు గురువారం వారి ఇంటికి విచ్చేసి భారతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆమెను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ బండారి కుటుంబం ప్రజల్లో విశ్వాసాన్ని సంపాదించిన కుటుంబం అన్నారు. ఈ బాధలో కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని, భారతమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, మల్గారి జనార్ధన్ రెడ్డి, చన్వెల్లి సర్పంచ్ గుండన్నగారి ప్రభాకర్ రెడ్డి, మధుసూధన్ గుప్తా, మల్గారీ మల్లా రెడ్డి, రవీందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## నేటితో రెండో విడత ప్రచారం సమాప్తం

● గ్రామాలలో హెూరాహెూరిగా ప్రచారం

**మల్దకల్, డిసెంబర్ 11 (జనంసాక్షి) :** మల్దకల్ మండలం లో రెండో విడత జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రచారంశుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రచారం సమాప్తం అవుతుంది. మండలంలోని 20 గ్రామపంచాయతీలో ఎన్నికల ప్రచారం అభ్యర్థులు తమ ఓటర్లను ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే అభ్యర్థులు ప్రచారాన్ని ఉధృతంగా చేశారు.ప్రతిరోజు విందులతో ఓటర్లు మునిగి తేలుతున్నారు.ఉదయాన్నే అభ్యర్థులు ఓటర్లకు టిఫిన్ చేశారా కాఫీలు తాగారా అంటూ ప్రచారం హెూరెత్తింది. వలస ఓటర్ల పై వలలు వేస్తున్నారు.రాను ఫోన్ చార్జీలు ఖర్చులు అభ్యర్థులే భరిస్తూ వలస వెళ్లిన దగ్గరికి వెళ్లి వారిని తమ వైపు మళ్లించుకుంటున్నారు. ఇప్పటికే ప్రచారం గ్రామాల్లో తాజాస్థాయికి చేరుకుంది. గ్రామాలులో పోటాపోటీగా ప్రచారం సాగుతుంది.నువ్వా నేనా అన్నట్టు అభ్యర్థులు తమ ఖర్చుకు వెనకాడు లేకుండా ఖర్చు చేస్తున్నారు. ఓటుకు 500 నుండి 1000 వరకు పంచడానికి అభ్యర్థులు సిద్ధంగా ఉన్నారు. కొన్ని గ్రామాల్లో 2000 నుంచి 3000 వరకు కూడా ఇవ్వడానికి అభ్యర్థులు సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తుంది.ఏది ఏమైనప్పటికీ గ్రామపంచాయతీ ఎన్నికలు రసవత్తరంగా మారింది.

## నర్కూడ గ్రామంలో కాంగ్రెస్ ఘన విజయం

● గడ్డం శేఖర్ యాదవ్ భారీ మెజారిటీతో గెలుపు



**రాజేంద్రనగర్, డిసెంబర్ 11 (జనం సాక్షి) :** నర్కూడ గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ–కాంగ్రెస్ మధ్య తీవ్ర పోటీ నెలకొనగా, చివరకు అదృష్టం కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం శేఖర్ యాదవ్ వైపే చేరింది. ముదిరాజ్ సంఘం చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మాజీ జెడ్పిటిసి చైర్పర్సన్ నీరటి తన్వీరాజు ముదిరాజ్‌ల నాయకత్వంలో కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా పనిచేయడంతో ఆయన ఘనవిజయం సాధించారు. గ్రామంలో మొత్తం 3426 ఓట్లు పోలగా, గడ్డం శేఖర్ యాదవ్ 1431 మెజారిటీతో గెలుపొందుతూ, తన సమీప ప్రత్యర్థి నానవాళ్ళ కుమార్ యాదవ్‌పై భారీ ఆధిక్యం సాధించారు.అదే గ్రామంలో 8వ వార్డు నుంచి పోటీ చేసిన నీరాటి మహేష్ ముదిరాజ్ ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. విజయంతో ఉత్సాహభరితమైన కాంగ్రెస్ శ్రేణులు నర్కుడ గ్రామంలో భారీగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించి, కొత్త సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్‌ను ఘనంగా సన్మానించారు.

## తొగర్‌పల్లి సర్పంచ్‌గా గౌండ్ల దివ్యవాణి ఘన విజయం

● 12 వార్డులు వార్ వన్ సైడ్
● గ్రామ చరిత్రలో మొదటిసారి

**కొండాపూర్, డిసెంబర్ 11 (జనం సాక్షి) :** మండల పరిధిలోని తొగెర్ పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి గౌండ్ల దివ్యవాణి ప్రశాంత్ గౌడ్ భారీ మెజార్టీతో విజయం కైవసం చేసుకుంది గ్రామంలోని పన్నెండు వార్డ్ మెంబర్లు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందారు. మొదటి వార్డ్ మెంబర్ బిఆర్ఎస్ పానేటి సంగీత రవికుమార్, రెండో వార్డ్ మెంబర్ సూర్యాపేట సందీప్, మూడో వార్డు మహమ్మద్ రియాజ్, నాలుగో వార్డ్ జబ్బర్, ఐదో వార్డ్ కోట వినయ్ కుమార్, ఆరో వార్డు సుమనోళ్ల కవిత, ఏడో వార్డు



కుమ్మరగొల్ల ఆంజనేయులు, ఎనిమిదవ వార్డు పక్కముల్ల వినయ్, వార్డు 9వ వార్డు కుమ్మరి లక్ష్మీ శంకర్, పదో వార్డు అక్కమొల్ల సౌందర్య, పదవ వార్డ్ అక్కమొల్ల సామెల్, పన్నెండు వార్డు అక్కమొల్ల ఆనంద్, మొత్తము పన్నెండు వార్డులు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు కైవసం చేసుకున్నారు.

## క్రిస్మస్ వేడుకలకు డీసీసీ అధ్యక్షుడు వజ్రెష్ యాదవ్‌కు ప్రత్యేక ఆహ్వానం



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 11 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించబోయే క్రిస్మస్ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొనాలని కోరుతూ మేడ్చల్ జిల్లా పాస్టర్ల ప్రతినిధి బృందం డీసీసీ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్‌ను ప్రత్యేకంగా కలిసి ఆహ్వానించారు.మేడ్చల్‌లోని డీసీసీ అధ్యక్షుడు వజ్రెష్ యాదవ్ నివాసంలో సంజీవ తెనాలి, కో-ఆర్డీనేటర్ మిట్టు ప్రణీత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పాస్టర్లు వజ్రెష్ యాదవ్‌కు పూజలు చేసి ఆహ్వాన పత్రం అందజేశారు.ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ "తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రిస్టియన్ మతస్థుల సంక్షేమానికి, వారి ఆచారం–విచారాలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తోంది. ఈ నెల 16న జరగనున్న క్రిస్మస్ వేడుకల్లో మీ సమక్షం మాకు మరింత గౌరవం" అని వజ్రెష్ యాదవ్‌ను కోరారు.పాస్టర్ల ప్రేమాభిమానాలకు స్పందించిన వజ్రెష్ యాదవ్, ప్రభుత్వాన్ని నమ్మిన ప్రతి వర్గానికి తాను అండగా ఉంటానని, క్రిస్మస్ వేడుకలకు తప్పకుండా హాజరవుతానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లాలోని అనేక పాస్టర్లు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణకు కళాశాలను సందర్శించిన ఆర్డీవో మహిపాల్

**కౌడిపల్లి, డిసెంబర్ 11 (జనంసాక్షి) :** మండల కేంద్రమైన కౌడిపల్లిలో గురువారం ఉదయం ఆర్డీవో మహిపాల్, ఎంపీడీవో శ్రీనివాస్,తహసిల్దార్ కృష్ణ, సంబంధిత అధికారులతో కలిసి ఈనెల 17న జరిగే ఎన్నికలకు సంబంధించి ఎన్నికలు నిర్వహించే ప్రాంతాన్ని ప్రత్యేకంగా సందర్శించారు. కౌడిపల్లి లోని జూనియర్ కళాశాలని సందర్శించి కళాశాలలో అన్ని విధాల సౌకర్యాలు ఉన్నాయా లేవా అని ప్రిన్సిపల్ వెంకటసుబ్బయ్యని అడిగి తెలుసుకున్నారు. కళాశాల కాంపౌండ్ లో పెద్ద పెద్ద గుంతలు గమనించి కళాశాలలో కాంపౌండ్ లో ఉన్న గుంతలను పూడ్చి, రాళ్లను తొలగించి లోపలికి ఓటర్ అభ్యర్థులు, సీనియర్ సిటిజెన్లు, అధికారులు వచ్చే విధంగా మొరంతో రోడ్డు నిర్వహించాలని ఎమ్మార్వో కృష్ణకు ఆదేశాలు జారీ చేశారు. వెంటనే తాసిల్దార్ కృష్ణ మరుసటి రోజు మట్టి పోయించి ఓటర్లు నడవడానికి సులువుగా ర్యాంపును నిర్వహిస్తామని అన్నారు. అనంతరం గ్రామపంచాయతీ సిబ్బందికి బాత్రూంలు శుభ్రం చేయించి లైట్లు బిగించాలని అన్నారు. ఎలక్షన్ అధికారుల వాహనాల పార్కింగ్ కోసం కళాశాల వెనుకా ప్రాంతంలో ఉన్న మల్లన్న గుడి, చైతన్య స్కూల్ ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు కళాశాల యాజమాన్యం గ్రామపంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మంగపేటలో 'కేటుగాళ్ల' నయా దందా

- అమాయక ప్రజలె వీళ్ళ టార్గెట్
- అన్ని మేమే చూసుకుంటాం అంటూ అధిక మొత్తంలో వసూళ్లు
- అధికారులను మచ్చిక చేసుకుని దందాకు తెరలేపుతున్న ' కేటుగాళ్లు'?



**మంగపేట డిసెంబర్ 11(జనంసాక్షి) :** ఏజెన్సీ గ్రామాల్లో ఉంటున్నటువంటి అమాయక ప్రజలను మాటలతో మచ్చిక చేసుకుని వారి అవసరాలనే కేటుగాళ్లకు అవకాశంగా మార్చుకొని మండలంలో 'నయా దందా 'కు తరలింపుతున్నారు. వీరు ఏకంగా ఒంటరి మహిళలు, వితంతువులను టార్గెట్ చేసుకుంటూ ఆధార్ కార్డ్, లేబర్ కార్డు, పెన్షన్స్, ఇందిరమ్మ ఇండ్లు, కళ్యాణి లక్ష్మి, రేషన్ కార్డుల విషయాల్లో అన్ని మేమే చూసుకుంటా మంటూ వారి వద్ద అధిక మొత్తాల్లో వసూళ్ళు చేసుకుంటూ వారిని నిలువు దోపిడి చేస్తున్నారు. ఈ కేటుగాళ్లు మండల కేంద్రాల్లోని కొందరు అధికారులను మచ్చిక చేసుకొని ఈ నయా దందాకు తినలేపుతున్నట్లు కొందరు ప్రజలు బహిర్గతంగానే చర్చించుకుంటున్నారు. ఏజెన్సీ గ్రామాల్లో కొందరు కేటుగాళ్లు వారి అవసరాలను తెలుసుకొని ఏకంగా వాళ్ళ ఇళ్ల చుట్టే తిరుగుతూ వారిని మచ్చిక చేసుకొని మేమున్నామంటూ అమాయక ప్రజలకు భరోసానీ కలిగిస్తూ పనులు సాగిస్తున్నారు. మీరు ఎక్కడికి వెళ్లినవసరం తిరిగే అవసరం కూడా లేదు అంత మాదే బాధ్యత ప్రజలను మభ్యపెడుతున్నారు. సరిగ్గా ఇలాంటి సంఘటనే మండలంలో గత మూడు రోజుల క్రితం ఏకంగా ఈ కేటుగాళ్లు చేసిన వ్యవహారము మండల ప్రాంతంలో పెళ్లి కాకపోయినా పెళ్లయినట్టు అన్ని సృష్టించి కళ్యాణ లక్ష్మి మంజూరు జరిగేలా చేసి ఏకంగా చెక్కు వచ్చిన వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొందరు కేటుగాళ్లు ఇలాంటి వ్యవహారాల్లో సంబం ధిత అధికారులు, కొన్ని ఆన్లైన్ సెంటర్ల నిర్వాహ కులతో కుమ్మక్కై ఇలాంటి వ్యవహారాలను కొనసా గిస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి ఇలాంటి కేటుగాళ్ల ఆగడాలకు కళ్లెం వేయాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

# మొదటి విడత గ్రామపంచాయతీ పోలింగ్ ప్రశాంతం

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి, డిసెంబర్ 11(జనం సాక్షి):** గ్రామపంచాయతీ ఎన్నికల తొలి విడత పోలింగ్ నేపథ్యంలో వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం వర్ధన్నపేట మండలం ఇల్లంద, కొత్తపల్లి, రాయపర్తి మండలం దుబ్బతండ, రాగన్నగూడెం, గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సౌకర్యాలు, సిబ్బంది డ్యూటీల అమలు, పోలింగ్ సాగుతున్న విధానం, భద్రతా చర్యలు వంటి అంశాలను వివరంగా పరిశీలించారు. సమర్థవంతమైన పోలింగ్ నిర్వహణకు సంబంధిత అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియలో ఏ విధమైన నిర్లక్ష్యం చోటుచేసుకోకూడదని, ప్రతి ఓటరికి సౌకర్యవంతమైన, అంతరాయం లేని వాతావరణం కల్పించడం సిబ్బంది పైనున్న ప్రధాన బాధ్యతఅని అన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి పరిష్కరించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్రమశిక్షణ, పారదర్శకత, నిబంధనల ఖచ్చితమైన అమలు అత్యంత ఔచిత్యం కలదని కలెక్టర్ స్పష్టం చేశారు. జెడ్పీ సీఈఓ రాం రెడ్డి, ఆర్డీఓ సుమా, నోడల్ అధికారులు, ఎంపిడీవోలు, తహాశీల్దార్లు, ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# వృద్ధ ఓటర్లకు సేవలు



**వరంగల్ బ్యూరో, డిసెంబర్ 11 (జనం సాక్షి) :** వరంగల్ జిల్లాలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా గురువారం పర్వతగిరి మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిం చినటువంటి ఎన్నికలలో వృద్ధులు వికలాంగులకు స్థానికంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసినటువంటి సేవలు ఎంతో ఉపయోగకరంగా మారాయి. ముఖ్యంగా గ్రామ పరిధిలో ఉన్నటువంటి పలువురు వృద్ధులు వికలాంగులు చేతకాని ఓటర్లను పోలింగ్ కేంద్రాల వద్దకు వీల్ చైర్లు ద్వారా పోలింగ్ కేంద్రాల వద్దకు తీసుకెళ్లి ఓటు వేసేలా అక్కడ ఉన్నటువంటి సేవకులు ఎంతో కృషి చేశారు. అదేవిధంగా వారు ఓటు వేసిన తర్వాత తిరిగి వారి వారి ప్రాంతాలకు వెళ్లేందుకు వచ్చినటువంటి వాహనాలలో కూడా వారిని క్షేమంగా ఇంటికి పంపే విధంగా వారు సేవలందించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని రకాల సేవలను అందించారు.

# పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన రెవెన్యూ అడిషనల్ కలెక్టర్, జిల్లా ఎస్పీ



**ేం గొ ం డ ,డిసెంబర్ 11(జనం సాక్షి):** మొదటి దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా మండలంలోని పోలింగ్ కేంద్రాలను రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్,జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ గురువారం వేరు వేరుగా పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలను పోలింగ్ సిబ్బంది హాజరు భద్రత ఏర్పాట్లను వారు సమీక్షించారు. మండల కేంద్రంలో నడవలేని స్థితిలో ఉన్న వృద్ధుడిని వీల్ చైర్ పై పోలింగ్ కేంద్రం వరకు తీసుకెళ్లి సహాయం చేసిన డీఎస్పీ సూర్యనారాయణ,స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ సేవా భావాన్ని ఎస్పీ సంకీర్త్ ప్రశంసించారు. ప్రతి ఓటరు భద్రంగా నిష్పక్షపాత వాతావరణం లో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని ఏర్పాటు చేసినట్లు వారు వివరించారు.

# ఓటు హక్కును వినియోగించుకోవాలి

- ప్రముఖ కవి అంపశయ్య నవీన్




**ఆత్మకూరు, డిసెంబర్ 11 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో గ్రామస్తులందరూ తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించాలని ప్రముఖ కవి అంపశయ్య నవీన్ పిలుపునిచ్చారు. గత 15 సంవత్సరాలుగా ప్రతి ఎన్నికలలో ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న సామాజికవేత్త, ఓటరు చైతన్య పోరాట యోధుడు నిమ్మల శ్రీనివాస్ చేస్తున్న ఓటరు అవగాహన కార్యక్రమాల వివరాలు తెలుసుకొని శ్రీనివాస్ ను అభినందిస్తూ మాట్లాడారు.ప్రజాస్వామ్యం బలపడాలంటే ప్రతి ఒక్కరి ఓటు కీలకమని, గ్రామాభివృద్ధి వైపుకు దారితీసే నిర్ణయాల్లో ప్రజలు నేరుగా పాల్గొనాలి అని వారు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కొంతమంది నాయకులు చూపించే ప్రలోభాలకు లొంగకుండా, తమ గ్రామ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఓటు వేయాలని గ్రామస్థులకు విజ్ఞప్తి చేశారు. ప్రత్యేకంగా యువత ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొని, గ్రామ పంచాయతీని పారదర్శకత, బాధ్యత, అభివృద్ధి విలువలతో ముందుకు తీసుకెళ్లే నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. "గ్రామం మనది, అభివృద్ధి మనదే అందుకే ఓటు కూడా మనసాక్షితో వేయాలి" అని నిమ్మల శ్రీనివాస్, అంపశయ్య నవీన్ సంయుక్తంగా అన్నారు. ప్రజల చిన్న నిర్ణయం కూడా పెద్ద మార్పుకు దారి తీస్తుందని, ప్రతి ఓటు గ్రామ భవిష్యత్తును నిర్మించే శక్తి అని వారు హితవు పలికారు.

## పర్యావరణహిత గ్రీన్ పోలింగ్ కేంద్రాల్లో ఉత్సాహంగా
# ఓటు హక్కు వినియోగించిన ఓటర్లు




**వరంగల్ ప్రతినిధి, డిసెంబర్11(జనంసాక్షి):** వరంగల్ జిల్లా గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా జరిగిన మొదటి విడత పోలింగ్‌లో పర్యావరణహితంగా అలంకరించిన గ్రీన్ మోడల్ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఆహ్లాదకరమైన వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గురువారం వరంగల్ జిల్లాలోని పరవైత్ గిరి మండలంలో పలు గ్రామాల్లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద గ్రీన్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి, పోలింగ్ తీరును పరిశీలించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రతి మండలంలో రెండు చొప్పున హరిత పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ప్రత్యేకంగా చర్యలు చేపట్టారు. వర్ధన్నపేట మండలం ఇల్లంద, కొత్తపల్లి, రాయపర్తి మండలం దుబ్బతండ, రాగన్నగూడెం, పర్వతగిరి మండలం ఏబీ తండా, పర్వతగిరి గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రీన్ మోడల్ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు విశేష ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ కేంద్రాల్లో పచ్చని మొక్కలు, పూల అలంకరణ, ప్లాస్టిక్‌రహిత సామగ్రి, పర్యావరణహిత అలంకరణతో ఓటర్లకు మైమరపించే అనుభూతిని కల్పించారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం వీల్‌చైర్ సౌకర్యం, చిన్న పిల్లల తల్లుల కోసం ప్రత్యేక కుర్చీలు అందుబాటులో ఉంచారు. లంచ్ సమయంలో ప్లాస్టిక్ ప్లేట్లకు బదులుగా అరటి ఆకులు, ఎండు విస్తరాకులు ఉపయోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.పర్వతగిరి మండలంలోని ఏబీ తండా పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెల్ఫీ పాయింట్ ఓటర్లను ఆకట్టుకుంది. అనేక మంది అక్కడ ఫోటోలు తీసుకుంటూ తమ ఓటు హక్కు వినియోగించిన ఆనందాన్ని పంచుకున్నారు. గ్రీన్ మోడల్ పోలింగ్ కేంద్రాలతో పాటు ఇతర పోలింగ్ స్టేషన్లను కూడా జిల్లా కలెక్టర్ వ్యక్తిగతంగా పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆమె అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట జెడ్పి సీఈఓ రామిరెడ్డి, నోడల్ అధికారులు, తహశీల్దార్లు, పాల్గొన్నారు..

# ఆత్మకూరు నియోజకవర్గ కేంద్రంగా మారుస్తాం


- డీలిమిటేషన్లో ఆత్మకూర్ పేరు పెట్టిస్తాం
- ఆత్మకూరు ఆదర్శంగా అభివృద్ధి చేసే అవకాశాన్ని ఇవ్వండి
- పది సంవత్సరాల అవకాశమిచ్చిన టిఆర్ఎస్ నేతలు మోసం చేశారు
- కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి



**ఆత్మకూర్, డిసెంబర్ 11 (జనంసాక్షి):** డిలిమిటేషన్లో ఆత్మకూరు మండల కేంద్రాన్ని నియోజకవర్గం మారుస్తానని కూడా చైర్మన్ ఇనగల వెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూరు మండలం కేంద్రంలో కుల సంఘాలతో మాట్లాడుతూ నా జన్మస్థానమైన ఆత్మకూరును ఆదర్శంగా అభివృద్ధి చేసే అవకాశం వచ్చిందన్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థి పర్వతగిరి మహేశ్వ రతో పాటు వార్డ్ మెంబర్లను కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. అప్పుడే నియోజకవర్గ కేంద్రంతో పాటు మున్సిపాలిటీగా మార్చి ప్రభుత్వం నుంచి వరదలాగా భారీగా నిధులు తేవడంతో పాటు కూడా నిధులతో కూడా ఆత్మకూరును ఆదర్శంగా అభివృద్ధి చేసి తీరుతామని కూడా చైర్మన్ ఇనగాళ వెంకట్రామిరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రామాల అభివృద్ధి కోసం అనేక నిధులను అందిస్తున్నాడని మారుమూల పల్లెలు సైతం అభివృద్ధి జరుగుతుందన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ దశలవారిగా ఇందిరమ్మ గృహాలు, ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, రైతులకు రుణమాఫీ, నిరుపేదలందరికీ సన్నబియ్యం అందించడంతోపాటు అర్హులైన ప్రతి ఒక్కరికి కొత్త రేషన్ కార్డులు అందించామన్నారు. టిఆర్ఎస్ నేతలు 10 సంవత్సరాలు అధికారంలో ఉన్నా కూడా ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ఇది తెలంగాణ ప్రజలందరికీ తెలుసు అన్నారు. టిఆర్ఎస్ నేతలు మళ్లీ మాయ మాటలు చెప్పేందుకు గ్రామాల్లోకి వస్తున్నారు వారి మాటలు నమ్మి మోసపోవద్దని కూడా చైర్మన్ అన్నారు. బిఆర్ స్నేహితుల మాయమాటలు నమ్మి పది సంవత్సరాలు అధికారం ఇస్తే అందిన కాడికి దోచుకున్నారు తప్ప అభివృద్ధి చేసిన దాఖలాలు లేవు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పారదర్శకంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు అందరికీ అందిస్తున్నామని కూడా చైర్మన్ అన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి ఈవంత రెడ్డికే దక్కుతుందని కూడా చైర్మన్ కొనియాడారు. కరోనా కష్టకాలంలో కూడా మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు నిరుపేదలకు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వ్యాధిగ్రస్తులకు పాఠశాలలో ఉండేందుకు ఏర్పాట్లు చేసి సకల సౌకర్యాలు ఉచితంగా మందులు పండ్లు ఆహారాన్ని అందించాలని కూడా చైర్మన్ వెంకటరామిరెడ్డి గుర్తు చేశారు. ఆత్మకూరు ను ఆదర్శంగా అభివృద్ధి చేయాలని దృఢ సంకల్పముతో ఆర్మీ ఉద్యోగాన్ని వదులుకొని వచ్చారని మీరందరూ ఆశీర్వదించి పర్వతగిరి మహేశ్వరుని, వార్డ్ మెంబర్లను భారీ మెజార్టీతో గెలిపించాలని కూడా చైర్మన్ వెంకట్రాంరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్..

- మూడు మండలాల్లో పోలింగ్ సరళిని పరిశీలించిన కలెక్టర్




**హనుమకొండ ప్రతినిధి డిసెంబర్ 11 (జనం సాక్షి) :** హనుమకొండ జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల మొదటి విడత పోలింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ గురువారం పరిశీలించారు. మొదటి విడతలో జిల్లాలోని భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాల్లో ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఉదయం 7 గంటల నుండి ప్రారంభమైంది. మండలాల్లో పోలింగ్ సరళిని పరిశీలించేందుకు హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ ఎల్కతుర్తి మండలంలోని దండేపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ లోని ప్రభుత్వ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. కమలాపూర్ మండలం శంభునిపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో, ఉప్పల్ లోని ప్రభుత్వ బాలుర బాలికల ఉన్నత పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందర్శించి పోలింగ్ సరళిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వారిగా ఎంతమంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, ఎన్నికల సిబ్బంది, పోలీసు సిబ్బంది గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ అనంతరం చేపట్టే కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ఓట్ల కౌంటింగ్ ప్రక్రియను పోలింగ్ కేంద్రాల వారిగా త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులకు సూచనలు చేశారు. కౌంటింగ్ కేంద్రాలలో ఎన్నికల అధికారులను పోలింగ్ సరళి ఎలా ఉందని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలలో ఉన్న ఓటర్లను ఓటరు స్లిప్ తో పాటు గుర్తింపు కార్డులు తెచ్చుకున్నారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎల్కతుర్తి ఎంపీడీవో విజయ్ కుమార్, తహసిల్దార్ ప్రసాద్ రావు, భీమదేవరపల్లి ఎంపీడీవో వీరేశం, తహసిల్దార్ రాజేష్, కమలాపూర్ ఎంపీడీవో గుండె బాబు, తహసిల్దార్ సురేష్ కుమార్, స్పెషలాఫీసర్ నరసింహస్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికలను ప్రశాంతంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ రూరల్, డిసెంబర్11 (జనం సాక్షి) :** జిల్లాలో జరుగుతున్న మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను ఎటువంటి అంతరాయం లేకుండా ప్రశాంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులు సూచించారు. గురువారం మామడ మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్,వరుసలో నిల్చొని ఓటు వేయడానికి వచ్చిన ప్రజలతో మాట్లాడారు. వారికి అందిస్తున్న సౌకర్యాలు తగిన విధంగా ఉన్నాయా అని తెలుసుకున్నారు. దివ్యాంగులకు వీల్‌చైర్ సదుపాయం అందుబాటులో ఉందా అనే విషయంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ బూత్‌లను ఒక్కొటిగా పరిశీలించిన కలెక్టర్ పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగుతున్నదో లేదో ఆరాతీశారు. ఫారమ్‌లు,రికార్డులు,ఓటింగ్ వివరాలు రియల్ టైమ్‌లో నమోదు చేసి పై అధికారులకు అందజేయాలని సూచించారు.ఓటింగ్ ముగిసిన వెంటనే లెక్కింపు ప్రక్రియ ప్రారంభించి ఫలితాలను వెంటనే ప్రకటించాల్సిందిగా ఆదేశించారు.పోలింగ్ పూర్తయ్యేంతవరకూ పటిష్ట బందోబస్తు కొనసాగించాలని పోలీస్ అధికారులకు సూచించారు.సహాయ కేంద్రం, వైద్య శిబిరాలను పరిశీలించిన కలెక్టర్ జిల్లాలో ప్రతి అర్హుడూ ఎటువంటి ఇబ్బంది లేకుండా ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. దివ్యాంగులు, వృద్ధుల కోసం వీల్‌చైర్లు, తాగునీరు, టెంట్లు, విశ్రాంతి సదుపాయాలు వంటి అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించామని తెలిపారు. ప్రజలు అందరూ తప్పకుండా గ్రామపంచాయతీ ఎన్నికల్లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.ఈ పరిశీలన కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, తహసిల్దార్ శ్రీనివాస్,ఎంపీడీవో సుశీల్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




# జిల్లాలో ప్రశాంతంగా పంచాయతీ ఎన్నికలు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల ప్రతినిధి, డిసెంబర్ 11, (జనంసాక్షి) :** పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గురువారం మొదటి విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో కొనసాగాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళి, కౌంటింగ్ ప్రక్రియను అదనపు ఎన్నికల అధికారి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2వ సాధారణ పంచాయతీ ఎన్నికలు- 2025 మొదటి విడతలో జిల్లాలోని జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాలలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందని తెలిపారు. జిల్లాలో గుర్తించిన 24 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా చేయాలి

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**చండూరు, డిసెంబర్ 11 (జనంసాక్షి) :** గ్రామపంచాయతీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.గురువారం ఆమె చండూరు మండలం బంగారిగడ్డ గ్రామంలో పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.ఓటింగ్ జరిగిన విధానం తెలుసుకొని కౌంటింగ్ ప్రక్రియ కూడా పూర్తిగా ఎలాంటి తప్పులు లేకుండా చేయాలని అధికారులకు సూచించారు. పోలింగ్ అనంతరం కౌంటింగ్ ప్రక్రియలో పాటించవలసిన నిబంధనలు, జాగ్రత్తలు, భద్రతా చర్యలపై అక్కడే విధుల్లో ఉన్న ఎన్నికల సిబ్బంది, పోలీసు అధికారులు, రిటర్నింగ్ ఆఫీసర్లతో మాట్లాడుతూ... ఒక అభ్యర్థికి ఒక ఏజెంట్ మాత్రమే లోపలికి అనుమతించాలన్నారు.పోలింగ్ ప్రక్రియ విజయవంతంగా ముగిసిన తర్వాత అసలైన బాధ్యత కౌంటింగ్ దశలో ప్రారంభమవుతుందని,కౌంటింగ్ ప్రక్రియలో జరిగే ప్రతి చర్య ఎన్నికల పారదర్శకతను ప్రతిబింబిస్తుందన్నారు. అందువల్ల ఓట్ల లెక్కింపులో ఏ చిన్న నిర్లక్ష్యం జరగకుండా



చూసుకోవాలని బ్యాలెట్ బాక్సులు, కవర్లు, ఫారమ్లు,స్టేట్మెంట్లు అన్నింటిలో జాగ్రత్తగా వ్యవహరించాలని,బ్యాలెట్ల పరిశీలనలో పారదర్శకత అత్యంత ముఖ్యమని బ్యాలెట్ పేపర్ను చెల్లిన ఓటు, చెల్లని ఓటు అని నిర్ణయించే సమయంలో ప్రతీ టేబుల్ వద్ద ఆర్.వో, ఎ.ఆర్.వో మార్గదర్శకాలను కచ్చితంగా అనుసరించాలన్నారు.ఏవైనా అభ్యంతరాలు వచ్చినప్పుడు టేబుల్ సూపర్వైజర్ తక్షణమే ఆర్.వో ను సంప్రదించి స్పష్టత తీసుకోవాలని చెప్పారు. అభ్యంతరం వచ్చిన ఓటును ప్రత్యేక కవర్లో ఉంచి నోటింగ్లు పూర్తి చేయాలన్నారు. ఒక్క చిన్న పొరపాటు తుది ఫలితంపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున అత్యంత జాగ్రత్త అవసరమన్నారు. ప్రతి ఓటు ప్రజల నమ్మకానికి ప్రతీక అని,ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కౌంటింగ్ ప్రక్రియను అత్యంత నిజాయితీగా, నిష్పక్షపాతంగా నిర్వహించడం అందరి బాధ్యత అని, ఎవరూ ఒత్తిళ్లకు, ప్రభావాలకు లోనుకావద్దన్నారు. కౌంటింగ్ వేగంగా జరగడం కంటే ఖచ్చితమైన ఫలితాలు రావడం ప్రధాన లక్ష్యమన్నారు. అందువల్ల ప్రతి టేబుల్ వద్ద సిబ్బంది శ్రద్ధగా ఆతురత లేకుండా పని చేయాలన్నారు. అన్ని ఫారమ్లు, నమోదు పత్రాలు పూర్తిగా అన్ని ఫారమ్లు, నమోదు పత్రాలు పూర్తిగా తనిఖీ చేసిన తరువాతే రౌండ్ ఫలితాలను ప్రకటించాలని చెప్పారు. ఫలితాలు పూర్తయిన తర్వాతే ఫామ్- 29 ను గెలిచిన అభ్యర్థికి సర్పంచ్గా ఇవ్వాలని తెలిపారు.

## ఓటెత్తిన పుల్లెంల యువతరం



**చండూరు, డిసెంబర్ 11 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న గ్రామ పంచాయతీ మొదటి విడత సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా గురువారం నల్లగొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల గ్రామంలో యువత పెద్ద ఎత్తున ఎన్నికల్లో పాల్గొని ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతుకను, యువత ఆకాంక్షను తెలుపుతూ... గ్రామంలో 90.40% ఓట్లు పోలింగ్ కావడానికి ప్రజల్లో ఓటరు చైతన్యం నింపడంలో విజయం సాధించి భవిష్యత్తులో వంద శాతం పోలింగ్ జరిగి ప్రజాస్వామ్యం విజయవంతం కోసం కృషి చేస్తామని యువత ఐక్య గొంతుకై నినదించింది.

## సీతారాంపురం గ్రామపంచాయతీలో కాటబోయిన అనిత ఘనవిజయం



**పినపాక, డిసెంబర్ 11 (జనం సాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం సీతారాంపురం గ్రామపంచాయతీలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన కాటబోయిన అనిత ఘనవిజయం సాధించారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి అలివేలు, సిపిఐ బలపరిచిన అభ్యర్థి కృష్ణకుమారి, టిడిపి మిత్రపక్షాలు బలపరిచిన అభ్యర్థి తాటి సుచరిత పైన ఆమె గెలుపొందారు. తనపై నమ్మకంతో గెలిపించిన ప్రతి ఒక్కరికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. పంచాయతీకి తన ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని తెలిపారు.

## పినపాక సర్పంచిగా అలివేలు ఘనవిజయం



**పినపాక, డిసెంబర్ 11 (జనం సాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం పినపక గ్రామపంచాయతీ సర్పంచిగా అలివేలు ఘనవిజయం సాధించారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా ఆమె పోటీలో ఉన్నారు. టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి పాయం అఖిలపై ఆమె ఘన విజయం సాధించారు. తన గెలుపుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటామని తెలిపారు.

## దేశ్ముఖి గ్రామ అభివృద్ధే ధ్యేయం

- మీ అమూల్యమైన ఓటు వేసి సర్పంచ్గా ఆశీర్వదించండి
- సర్పంచ్ అభ్యర్థి జక్కుల దశరథ యాదవ్



**భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 10 (జనం సాక్షి) :** మండలంలోని దేశ్ముఖి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్గా పోటీ చేస్తున్న జక్కుల దశరథ యాదవ్ గ్రామ అభివృద్ధే తన ప్రధాన ధ్యేయమని, ప్రజాసేవే తన లక్ష్యమని తెలిపారు. గ్రామంలో అన్ని వర్గాల ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కట్టుబడి పనిచేస్తానన్నారు. దేశ్ముఖి గ్రామ ప్రజలు తనను విజయవంతంగా ఎన్నుకుంటే గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తన అభివృద్ధి ప్రణాళికలను వివరిస్తూ, ప్రతి ఇంటికి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం, ప్రతి వీధికి వీధిదీపాల ఏర్పాటు చేస్తామని తెలిపారు. వృద్ధులు, వికలాంగులకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా ప్రత్యేక చొరవ చూపిస్తానన్నారు. పేద విద్యార్థులకు ఫీజుల భారం తగ్గించేలా చర్యలు తీసుకుంటానని, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం సహకారం అందిస్తానని చెప్పారు. మహిళలు, పురుషులకు కూటీర పరిశ్రమల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి గ్రామ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందిస్తామని తెలిపారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంతల నిర్మాణం, విస్తృతంగా చెట్ల నాటకం చేపడతామని చెప్పారు. దేశ్ ముఖి బడి, దేవాలయాలు, లైబ్రరీల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని, గ్రామానికి ప్రత్యేక వైద్యశాల ప్రతిపాదనతో పాటు శ్రీకృష్ణ దేవాలయ నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. అలాగే గ్రామ ఆడపడుచుల వివాహాలకు ఆర్థిక సహాయం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని జక్కుల దశరథ యాదవ్ వెల్లడించారు. మీలో ఒకడిగా గ్రామ అభివృద్ధికి అంకితభావంతో పనిచేసే అవకాశం కల్పించాలని కోరుతూ, తనను ఆశీర్వదించి ఓటు వేయాలని ఆయన గ్రామ ప్రజలను కోరారు.

## బీఆర్ఎస్ పార్టీ బలపరచిన కొండ రజిత - రవి ఘన విజయం



**చండూరు, డిసెంబర్ 11 (జనంసాక్షి) :** చండూరు మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. తాస్కానిగూడెం గ్రామ సర్పంచ్ గా బి.ఆర్.ఎస్ పార్టీ బలపరచిన కొండ రజిత - రవి ఘన విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ బలపరచిన అభ్యర్థి వంగూరి అనూష - శ్రవణ్ మీద 130 ఓట్ల ఆధిక్యంతో ఘన విజయం సాధించారు. దీంతో సర్పంచ్ అనుచరులు, గ్రామస్తులు టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కొండ రజిత - రవి మాట్లాడుతూ... నాపై నమ్మకంతో నాకు ఓట్లు వేసి ఘనవిజయం అందించిన గ్రామ ప్రజలకు పేరు పేరున కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు.

## గుండ్రపల్లి సర్పంచ్గా ఉజ్జిని ఉషా - అనిల్ రావు ఘన విజయం



**చండూరు, డిసెంబర్ 11 (జనంసాక్షి) :** చండూరు మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. గుండ్రపల్లి గ్రామ సర్పంచ్ గా బి.ఆర్.ఎస్ పార్టీ బలపరచిన ఉజ్జిని ఉషా - అనిల్ రావు ఘన విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ బలపరచిన అభ్యర్థి కాసాల శరణ్య - జనార్ధన్ రెడ్డి మీద 350 ఓట్ల బారి ఆధిక్యంతో ఘన విజయం సాధించారు. దీంతో సర్పంచ్ అనుచరులు, గ్రామస్తులు టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఉజ్జిని ఉషా - అనిల్ రావు మాట్లాడుతూ... నాపై నమ్మకంతో నాకు ఓట్లు వేసి ఘనవిజయం అందించిన గ్రామ ప్రజలకు పేరు పేరున కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు.

# భద్రాచలంలో పంచాయతీ ఎన్నికల తొలి దశ పోలింగ్ ప్రశాంతం

- అత్యధిక పోలింగ్తో దుమ్ముగూడెం, చర్ల ముందంజ

**భద్రాచలం, డిసెంబర్ 11 (జనంసాక్షి) :** భద్రాచలం డివిజన్ పరిధిలో జరిగిన పంచాయతీ ఎన్నికల తొలి దశ పోలింగ్ లో ఓటర్లు చురుగ్గా పాల్గొని తమ పౌర ధర్మాన్ని నెరవేర్చారు. మొత్తం మీద పోలింగ్ శాతం ఆశాజనకంగా నమోదైనా, భద్రాచలం పంచాయతీలో మాత్రం తక్కువ శాతం పోలింగ్ నమోదవ్వడం గమనార్హం.

**పోలింగ్ శాతాల వివరాలు :**
తొలి దశలో మూడు ప్రధాన ప్రాంతాల్లో పోలింగ్ జరిగింది. స్థానిక ఎన్నికల పట్ల ఓటర్లు చూపిన ఉత్సాహం ఈ శాతాల ద్వారా స్పష్టమవుతోంది.దుమ్ముగూడెం: 83.72%చర్ల: 85%



భద్రాచలం: 44%.

**ముఖ్య అంశాలు :**
రికార్డు పోలింగ్: చర్ల మరియు దుమ్ముగూడెం పంచాయతీల్లో ఓటర్లు భారీగా పోలింగ్లో పాల్గొన్నారు. చర్లలో ఏకంగా 85% పోలింగ్ నమోదు కావడం విశేషం.భద్రాచలంలో నిరాశ: ముఖ్య పట్టణమైన భద్రాచలం పంచాయతీలో కేవలం 44% పోలింగ్ మాత్రమే నమోదైంది. మిగిలిన రెండు ప్రాంతాలతో పోలిస్తే, ఇక్కడ ఓటర్ల భాగస్వామ్యం బాగా తక్కువగా ఉంది.

**ప్రజా తీర్పు స్పష్టం :**
అత్యధిక పోలింగ్ నమోదైన ప్రాంతాలలో ప్రజలు తమ స్థానిక నాయకులను ఎన్నుకోవడంలో ఎంత ఆసక్తి చూపారో తెలుస్తోంది. మొదటి దశ పోలింగ్ మొత్తం ప్రశాంతంగా ముగిసింది. స్థానిక జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్ పి రోహిత్ రాజ్ ఆదేశాలతో అధికార యంత్రాంగం పోలైన ఓట్ల లెక్కింపు కార్యక్రమం కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్ల నడుమ మొదలైంది.

## కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూడాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



**కనగల్, డిసెంబర్ 11 (జనం సాక్షి) :** కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా మండలంలోని జి యడవల్లి, ఇస్లాం నగర్ గ్రామపంచాయతీ లో జరుగుతున్న ఓటింగ్ సరలిని పరిశీలించారు. ఓటింగ్ జరిగిన విధానము ను తెలుసుకొని కౌంటింగ్ ప్రక్రియ కూడా పూర్తిగా ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. పోలింగ్ అనంతరం కౌంటింగ్ ప్రక్రియ లో పాటించవలసిన నిబంధనలు జాగ్రత్తలు భద్రత చర్యలపై అక్కడ విధులలో ఉన్న ఎన్నికల సిబ్బంది, పోలీస్ అధికారులు, రిటర్నింగ్ ఆఫీసర్లతో మాట్లాడుతూ ఒక అభ్యర్థికి ఒక ఏజెంటును మాత్రమే లోపలికి అనుమతించాలన్నారు. బ్యాలెట్ పేపర్ను చెల్లని ఓటు, చెల్లిన ఓటు నిర్ధారించే సమయంలో ఆర్ఓ మరియు ఏఆర్ఓ మార్గదర్శకాలను కచ్చితంగా అనుసరించాలన్నారు. ఒక చిన్న పొరపాటు తుది ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున కౌంటింగ్ అధికారి కి జాగ్రత్త అవసరం అన్నారు. కలెక్టర్ వెంట జెడ్పి సీఈవో శ్రీనివాసరావు, ఆర్డీవో అశోక్ రెడ్డి, తహసిల్దార్ పద్మ, ఎంపీడీవో వేద రక్షిత, ఎంపీ ఓ సతీష్ కుమార్ తదితరులు ఉన్నారు.

## చేనేతల సమస్యల పరిష్కారాని ఎంపీ చామల చొరవ


- నకిలీ ఇక్కత్ చీరలను ప్రింటెడ్ చీరలను అరికట్టాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి



**భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 11 (జనం సాక్షి) :** పోచంపల్లి చేనేత టై అండ్ డై సిల్క్ చీరల ఉత్పత్తిదారుల సమస్యలను పరిష్కరించేందుకు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి చొరవ తీసుకున్నారు. గత నెల నవంబర్ 27న పోచంపల్లి చేనేత టై అండ్ డై సిల్క్ చీరల ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షులు భారత లవ కుమార్, ప్రొఫెసర్ తడక యాదగిరి ఎంపీని కలిసి జిఐ యాక్ట్ను ఉల్లంఘిస్తూ ఇతర ప్రాంతాల్లో తయారవుతున్న నకిలీ ఇక్కత్ వస్త్రాలు, ప్రింటెడ్ చీరలను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని అదేవిధంగా పోచంపల్లి ప్రత్యేకతను కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ప్రత్యేక కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించి, గురువారం జరిగిన టెక్స్టైల్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ను ప్రత్యక్షంగా కలిసి ఈ అంశంపై అధికారిక విజ్ఞప్తి చేశారు. ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీసుకున్న చొరవకు పోచంపల్లి టై అండ్ డై అసోసియేషన్ వారు ధన్యవాదాలు తెలియజేసారు. జి ఐ యాక్ట్ రక్షణ, చేనేత కార్మికుల హక్కులు, మార్కెట్ రక్షణ కోసం రూపొందించే ఈ కార్పస్ ఫండ్ ఏర్పడే వరకు ఎంపీ తమ సహకారం కొనసాగించాలని అధ్యక్షులు భారత లవ కుమార్ కోరారు.

## అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తా..

- కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి గరికె సత్యనారాయణ



**రామన్నపేట, డిసెంబర్ 11 (జనంసాక్షి) :** రామన్నపేట పద్మశాలి కాలనీలో సీపీఐ బలపర్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గరికె సత్యనారాయణ గురువారం పార్టీ నాయకులతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఉంగరం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పట్టణ ఓటర్లను కోరారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దిన్, సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు బట్టె సంతోష్ కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వనం చంద్రశేఖర్, సాల్వేరు అశోక్, మహమ్మద్ నాసర్, బొడ్డు సాలయ్య, మొహమ్మద్ అక్రం, గోదాసు శ్రీమన్నారాయణ, కొమ్ము నాగరాజు, ఆముద లక్ష్మణ్, గొలుసుల ప్రసాద్, కోట సుధాకర్, సింగరాజు యశ్వంత్, బుర్రి రవీందర్, మొహమ్మద్ అజార్, రాపోలు ఉపేందర్, కొమ్ము రామస్వామి, శేఖర్, సిపిఐ పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, బాలగోని మల్లయ్య, వీరమల్ల వెంకటయ్య, ఊట్కూరి భగవంతు, గంగాపురం యాదయ్య, సిహెచ్ మల్లేష్, ఊట్కూరి కృష్ణ , రమేష్, ఐలాపురం నరసింహ, ఊట్కూరి శంకర్, పల్లె మల్లేష్, గంగాపురం నవీన్, ఊట్కూరి శివ తదితరులు పాల్గొన్నారు.

## లింగంపల్లి గ్రామంలో ఎన్నికల ప్రక్రియను పరిశీలించిన జిల్లా ఎస్పీ



**నూతనకల్, డిసెంబర్ 11 (జనం సాక్షి) :** నూతనకల్ మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో గురువారం ఎన్నికల ప్రక్రియ లెక్కింపును జిల్లా ఎస్పీ నరసింహ పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి ఎన్నికలను ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని గ్రామంలో అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొల్పడం కోసం పౌరుల సామరస్యం, సమన్వయం ముఖ్యం అని తెలిపారు. చట్టబద్ధంగా జరిగిన ఎన్నికల ఫలితాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. ముఖ్యంగా ఎవ్వరూ ప్రతీకార చర్యలకు పాల్పడవద్దు అని అన్నారు, ప్రతీకార దాడులకు పాల్పడవద్దని అన్నారు, ముఖ్యంగా యువకులు కేసుల్లో చిక్కుకొని తమ బంగారు భవిష్యత్తుని ఆగం చేసుకోవద్దు అని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, సీఐ నరసింహారావు, ఎస్సై నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**కల్లూరు, డిసెంబర్ 11 (జనం సాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా సమన్వయంతో వ్యవహరిస్తూ సమిష్టిగా కలిసి పనిచేసి కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థుల్ని గెలిపించాలని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్వగ్రామం నారాయణపురం వచ్చిన సందర్భంగా నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని నాయకులు కార్యకర్తలు తోపాటు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ మంత్రి పొంగులేటిని కలిశారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైన కాంగ్రెస్ అభ్యర్థులకు కాంగ్రెస్ కండువాలుకప్పి సన్మానించారు. అదేవిధంగా ఐదు మండలాల నుండి కాంగ్రెస్ మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థులు మంత్రిని కలిసి వారి ఆశీస్సులు తీసుకున్నారు.సమిష్టి కృషితో ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా పెట్టుకొని పని చేయాలని అన్నారు .ఈసందర్భంగా ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రస్తుతం జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికల గురించి మంత్రికి వివరించారు. అన్ని మండలాలలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచే విధంగా ప్రయత్నం చేయాలని మంత్రి ఎమ్మెల్యేలను కోరారు. తొలుత రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తండ్రి స్వర్గీయపొంగులేటి రాఘవరెడ్డి 8వ వర్ధంతి కార్యక్రమం నారాయణపురం గ్రామంలోఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా స్వర్గీయ రాఘవరెడ్డి స్మృతి వనం వద్ద కుటుంబ సభ్యులు బ్రాహ్మణోత్తముల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. రాఘవ రెడ్డి తనయుడు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాధురి దంపతులు, ఆయన సోదరుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి శ్రీలక్ష్మి దంపతులతో పాటు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టారాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారీ ఆదినారాయణ,కల్లూరు, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్లు భాగం నీరజా



ప్రభాకర్ చౌదరి, దోమ ఆనందబాబు, సత్తుపల్లి మాజీ ఎంపీ పీ చల్లారి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీలు, అంకిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, కుక్క నాగమ్మ, ఏనుగు సత్యంబాబు, బొల్లం రామారావు,మాలోతు రాధాకృష్ణ,తదితరులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పొంగులేటి అభిమానులు, కార్యకర్తలు స్వర్గీయ రాఘవరెడ్డి వర్ధంతి వేడుకల్లో పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.




## ఈ-20 పెట్రోల్‌తో రూ.1.40 లక్షల కోట్లు ఆదా!

**న్యూఢిల్లీ:**ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ (ఈ-20 పెట్రోల్) వినియోగించడం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, దీనివల్ల పెట్రోల్ దిగుమతులు గణనీయంగా తగ్గుతుందని కేంద్ర రోడ్డు రవాణా రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ చెబుతూనే ఉన్నారు.ఇప్పుడు తాజాగా ఈ చర్య కారణంగా.. రూ. 1.40 లక్షల కోట్లకు పైగా విదేశీ మారకద్రవ్యం ఆదా



అయిందని లోక్‌సభలో వెల్లడించారు.ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ వాడకంపై కొందరు ఆందోళనల చెందుతున్నారు. కానీ ఇథనాల్ కలిపిన పెట్రోల్ ఉపయోగించే కార్లపై ఎటువంటి ప్రతికూల ప్రభావం కనిపించలేదని, ఇప్పటికే.. దీనికి సంబంధించిన పరీక్షలు కూడా నిర్వహించామని నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు.ఈ-20 పెట్రోల్ తక్కువ కాలుష్య కారకాలను విడుదల చేస్తుంది. ఇది పెట్రోల్, డీజిల్ కంటే కూడా ఉత్తమంగా ఉందని గడ్కరీ అన్నారు. పెట్రోల్‌లో ఇథనాల్ కలపడం వల్ల, ఇథనాల్‌లో ఉపయోగించే ముడి పదార్థాలైన చెరకు, మొక్కజొన్న మొదలైన వాటి వినియోగం పెరుగుతుంది. ఇది రైతులను ఆర్థికంగా ఎదిగేలా చేస్తుందని ఆయన అన్నారు.ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమం అమలు తర్వాత.. గతంలో ముడి చమురు దిగుమతులకు ఖర్చు చేసిన డబ్బు ఇప్పుడు రైతులకు చేరుతోందని, దీంతో అన్నదాతలు.. ఊర్జాదాతలుగా మారారని పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరి అన్నారు. గత 11 సంవత్సరాలలో.. ఇథనాల్ వినియోగం, సరఫరా కారణంగా 2014-15 నుంచి 2025 జూలై 2025 వరకు ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు రూ.1,40,000 కోట్లకు పైగా విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేశాయని ఆయన అన్నారు.

### నవంబర్‌లో ఎక్కువమంది కొన్న టాప్-10 కార్లు

**న్యూఢిల్లీ:**భారతదేశంలో ఆటోమొబైల్ రంగం రోజురోజుకి విస్తరిస్తూనే ఉంది. కొత్త కంపెనీలు వస్తున్నాయ్. కొత్త ఉత్పత్తులు లాంచ్ అవుతున్నాయి. కొనుగోలుదారులు ఎప్పటికప్పుడు లేటెస్ట్ మోడల్స్ కొనుగోలు చేయడానికి అమితమైన ఆసక్తి చూపుతున్నారు.దీనివల్ల ప్రతి నెలా కార్ల అమ్మకాలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఈ కథనంలో గత నెలలో ఎక్కువమంది కొన్న టాప్ 10 కార్ల గురించి తెలుసుకుందాం.టాటా నెక్సాన్: 22,434 యూనిట్లు,మారుతి సుజుకి డిజైర్: 21,082 యూనిట్లు,మారుతి సుజుకి స్విఫ్ట్: 19,733 యూనిట్లు,టాటా పంచ్: 18,753 యూనిట్లు,హ్యుందాయ్ క్రెటా: 17,344 యూనిట్లు,మారుతి సుజుకి ఎర్టిగా: 16,197 యూనిట్లు,మహీంద్రా స్కార్పియో: 15,616 యూనిట్లు,మారుతి సుజుకి ఫ్రాంక్స్: 15,058 యూనిట్లు,మారుతి సుజుకి వ్యాగన్‌ఆర్: 14,619 యూనిట్లు,మారుతి సుజుకి బ్రెజా: 13,947 యూనిట్లు,నవంబర్ 2025లో ఎక్కువమంది కొనుగోలు చేసిన కార్ల జాబితాలో.. 22434 యూనిట్ల అమ్మకాలతో టాటా నెక్సాన్ నిలిచింది.

# త్వరలో అతిపెద్ద ఆర్థిక పతనం

- ఇది ఎనిమిదో పాఠం
- ఫెడ్ ఏర్పాటే ప్రస్తుత సంక్షోభానికి మూలం
- రాబర్ట్ కియోసాకి


**ప్రసిద్ధ 'రిచ్ డాడ్ పూర్ డాడ్' పుస్తక రచయిత, ఇన్వెస్ట్‌మెంట్ గురూ రాబర్ట్ కియోసాకి.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ "చరిత్రలోనే అత్యంత తీవ్రమైన పతనం" దిశగా సాగుతోందని సోషల్ మీడియాలో వరుస పోస్ట్‌లు చేస్తూ వస్తున్నారు. ఆర్థికంగా ప్రపంచం పతనమైనా అందులో చిక్కుకోకుండా ధనవంతులు ఎలా కావాలో పాఠాలు చెబుతున్నారు. అందులోభాగంగా ఎనిమిదో పాఠాన్ని తాజాగా 'ఎక్స్'లో పంచుకున్నారు.**



**న్యూఢిల్లీ:**ఆర్థిక పతనాలు ఒక్కరోజులో జరగవని, దశాబ్దాల పాటు నిర్మాణం చెందుతాయని కియోసాకి పేర్కొన్నారు. 1965లో అమెరికా నాణేల్లో వెండిని తొలగించడం, 1971లో నిక్సన్ ప్రభుత్వం డాలర్‌ను బంగారం ప్రమాణం నుంచి వైదొలగించడం వంటి చరిత్రాత్మక సంఘటనలు ప్రపంచ ఆర్థిక నిర్మాణాన్ని మార్చేశాయని చెప్పారు.ఈ పరిణామాలు ప్రపంచాన్ని "రుణ ఆర్థిక వ్యవస్థగా" మార్చాయని, దీని ఫలితంగా అమెరికా జపాన్ వంటి దేశాలు భారీ రుణభారంతో సతమతమవుతున్నాయని అభిప్రాయపడ్డారు. ఇంటి అద్దెలు పెరగడంతో ఉద్యోగాలు ఉన్నవారు కూడా రోడ్డునపడుతున్నారన్నారు.కియోసాకి తన వ్యక్తిగత పెట్టుబడి అనుభవాలను కూడా పంచుకున్నారు. 1970లలో బంగారం కొనడం ఎలా ప్రారంభించారో, ఇప్పటికీ బంగారం వెండి విదేశాల్లో నిల్వ చేస్తానని చెప్పారు. దశాబ్దాల క్రితం కొన్న బంగారు నాణెం విలువ ఇప్పుడు భారీగా పెరిగిందని, ఇది ఆర్థిక అస్థిరత సమయంలో విలువ నిలుపుకొనే ఆస్తులు ఎంత ముఖ్యమో నిరూపిస్తుందని అన్నారు.ప్రస్తుత సంక్షోభానికి మూలం 1913లో ఏర్పడిన ఫెడరల్ రిజర్వ్ నేనని ఆయన ఆరోపించారు. ఆధునిక ఫియట్ కరెన్సీలు విలువ కోల్పోవడానికి ఈ సంస్థ విధానాలు ప్రధాన కారణమని కియోసాకి అభిప్రాయపడ్డారు. బంగారం, వెండి లను "దేవుని సొమ్ము"గా.. బిట్‌కాయిన్, ఈథీరియంను "ప్రజల డబ్బు"గా కియోసాకి అభివర్ణించారు.ద్రవ్యోల్బణం, రుణ సంక్షోభం, నివాస సమస్యలు పెరుగుతున్న సమయంలో కూడా, సిద్ధపడి పెట్టుబడులు మారుస్తున్న వారు లాభపడతారని కియోసాకి పునరుద్ఘాటించారు. "వాళ్లే విజేతలు" అని, "ఫెడరల్ రిజర్వ్ లేదా ప్రభుత్వం రక్షిస్తుంది" అనే నమ్మకంతో ఉన్నవారు నష్టపోతారని హెచ్చరించారు .స్కూళ్లలో ఆర్థిక విద్యను ఎందుకు బోధించడంలేదనే ప్రశ్నను ఆయన మళ్లీ లేవనెత్తారు.' అనే నమ్మకంతో ఉన్నవారు నష్టపోతారని హెచ్చరించారు .స్కూళ్లలో ఆర్థిక విద్యను ఎందుకు బోధించడంలేదనే ప్రశ్నను ఆయన మళ్లీ లేవనెత్తారు.రాబోయే అనిశ్చిత కాలానికి సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. కియోసాకి గత కొన్నేళ్లుగా ఇదే తరహా హెచ్చరికలు చేస్తూ, బంగారం, వెండి, క్రిప్టోకరెన్సీలు వంటి ప్రత్యామ్నాయ ఆస్తుల్లో పెట్టుబడి పెట్టాలని ఆహ్వానిస్తున్నారు. ఆర్థిక నిపుణులు ఆయన అంచనాలను కొట్టిపడేస్తున్నప్పటికీ, రుణభారం, ద్రవ్యోల్బణంపై ఆందోళన ఉన్న పలువురికి కియోసాకి సందేశం ఇంకా ఆందోళన కలిగిస్తోంది.

# బ్యాంకు పరీక్షల్లో భారీ మార్పులు!!

**న్యూఢిల్లీ:**ప్రభుత్వ రంగ బ్యాంకుల నియామక పరీక్షల్లో భారీ మార్పులు చోటుచేసుకోనున్నాయి. రిక్రూట్‌మెంట్ పరీక్షల కాలక్రమాన్ని క్రమబద్ధీకరించడం, వాటి ఫలితాల ప్రకటనకు సంబంధించి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పలు మార్పులను సూచించింది.ఇందులో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జాతీయ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల నియామకాలు ఉన్నాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఆర్థిక సేవల విభాగం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది.తాము సూచించిన మార్పులు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ నిర్వహించే పరీక్షలలో పారదర్శకతను పెంచడానికి దోహదపడతాయని పేర్కొంది. ఎస్‌బీఐలో ఉద్యోగాలకు నియామకాలకు తానే సొంతంగా రిక్రూట్‌మెంట్ చేపడుతుండగా ఇతర ప్రభుత్వ బ్యాంకులు, ఆర్‌ఆర్‌బీలలో రిక్రూట్‌మెంట్‌ను ఆయా బ్యాంకుల ఆదేశాలకు అనుగుణంగా ఐబీపీఎస్ పరీక్షలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తోంది.సాధారణంగా ఇతర ప్రభుత్వ బ్యాంకులు, ఎస్‌బీఐలలో ఉద్యోగాల పరీక్షల కంటే ముందే ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులకు అంటే ఆర్‌ఆర్‌బీలకు నియామక పరీక్షలు నిర్వహిస్తున్నారు. వాటి ఫలితాలను కూడా ఇదే క్రమంలో ప్రకటిస్తున్నారు. "అయితే, కొత్తగా నియమితులైన అభ్యర్థులు తరచుగా ఆర్‌ఆర్‌బీల నుండి ఇతర ప్రభుత్వ బ్యాంకులకు, తరువాత ఎస్‌బీఐకి మారే ఒక ముఖ్యమైన ధోరణి ఉద్భవించింది. ఈ వలస బ్యాంకులలో గణనీయమైన అట్రిషన్ కు దారితీస్తూ కార్యాచరణ సవాళ్లను విసురుతోంది" అని ఆర్థిక సేవల విభాగం తెలిపింది.పై సమస్యను పరిగణనలోకి తీసుకున్న ఆర్థిక సేవల విభాగం బ్యాంకుల రిక్రూట్‌మెం?ట్ పరీక్షల సమగ్ర ప్రక్రియ, ఫలితాల ప్రకటనల నమూనాను సమీక్షించింది. మూడు రకాల బ్యాంకులలో నియామక ఫలితాలను ప్రకటించడానికి ప్రామాణిక, తార్కిక క్రమాన్ని అమలు చేయాలని ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ)కు సూచించింది.పర్యవసానంగా, సవరించిన ఫ్రేమ్‌వర్క్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. దీని ప్రకారం.. మొదట ఎస్‌బీఐ, అనంతరం ఇతర ప్రభుత్వ బ్యాంకులు, ఆ తరువాత చివరగా ఆర్‌ఆర్‌బీలకు సంబంధించిన ఫలితాలను ప్రకటించాలి. ఈ కేటగిరీలలోని అన్ని ఆఫీసర్ స్థాయి పరీక్షల ఫలితాలను ప్రారంభంలో ప్రకటిస్తామని, క్లరికల్ స్థాయి పరీక్ష ఫలితాలను అదే క్రమంలో ప్రకటిస్తామని తెలిపింది.



# నిఫ్టీ నష్టాలకు బ్రేక్

### 427 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

**ముంబై:**దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం లాభాల్లో ముగిశాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ తన కీలక వడ్డీ రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించిన తరువాత భారత ఈక్విటీలు పుంజుకున్నాయి.మూడు రోజుల నష్టాల పరంపరకు ముగింపు పలికాయి.మధ్యాహ్నం 3:30 గంటల సమయానికి బీఎస్‌ఈ సెన్సెక్స్ 426.86 పాయింట్లు లేదా 0.51 శాతం లాభంతో 84,818.13 వద్ద, ఎన్ఎస్‌ఈ నిఫ్టీ 140.55 పాయింట్లు లేదా 0.55 శాతం పెరిగి 25,898.55 వద్ద ముగిసింది.ఎటర్నల్, టాటా స్టీల్, మారుతి సుజుకి, కోటక్ బ్యాంక్, ఇన్ఫోసిస్, బీఈఎల్, అదానీ పోర్ట్స్, ఎం అండ్ ఎం, ఎల్ అండ్ టీ, ఎస్బీఐ ఈరోజు సెన్సెక్స్ లో 1.7 శాతం వరకు లాభపడ్డాయి. టైటాన్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, ట్రెంట్, రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్, పవర్ గ్రిడ్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫిన్సర్వ్ టాప్ లూజర్స్ గా నిలిచాయి.విస్తృత మార్కెట్లలో, నిఫ్టీ మిడ్ క్యాప్ 100, నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 సూచీలు వరుసగా 0.87 శాతం, 0.74 శాతం లాభంతో ట్రేడ్ అవుతున్నాయి. నిఫ్టీ మీడియా ఇండెక్స్ 0.9 శాతం, నిఫ్టీ ఎఫ్ఎంసీజీ ఇండెక్స్ 0.33 శాతం, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 0.08 శాతం క్షీణించాయి. నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ ఇండెక్స్ 0.6 శాతం క్షీణించింది. నిఫ్టీ మెటల్, ఆటో సూచీలు వరుసగా 0.6 శాతం, 0.4 శాతం పెరిగాయి.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 6.51 | ₹ 6.53 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,19,850 (22 క్యారెట్లు) | ₹ 1,30,750 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్
₹ 2,09,000




# న్యూఇయర్ రోజున టారీఫ్ పిడుగు

### భారత్‌పై మెక్సికో 50 % వడ్డింపు

న్యూఢిల్లీ: న్యూ ఇయర్‌లో కొత్తగా కారు కొనుగోలు చేయాలని అనుకుంటున్నారా? లేదంటే ఇతర వాహనాల్ని కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యారా? అయితే తస్మాత్ జాగ్రత్త.త్వరలో ఆటోమొబైల్ ధరలు పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. అందుకు భారత్‌పై మెక్సికో విధించే 50 శాతం సుంకమే కారణమని జాతీయ మీడియా కథనాలు వెలుగులోకి వచ్చాయి.న్యూఇయర్ జనవరి1,2026 నుంచి మెక్సికో నుంచి భారత్ దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకం వసూలు చేయనుంది. ఇప్పటికే భారత్ దిగుమతులపై అమెరికా 50శాతం అంతకంటే ఎక్కువగా సుంకాలు విధించింది. తాజాగా,మెక్సికో సైతం భారత్ దిగుమతులపై భారీ ఎత్తున టారిఫ్ వసూలు చేసేందుకు సిద్ధం కాగా.. అందుకు ఆదేశ సెనేట్ సైతం ఆమోదం తెలిపింది. మెక్సికో భారత్, చైనాతో పాటు ఇతర ఆసియా దేశాల నుంచి సుంకాలను వసూలు చేయనుంది.ఫలితంగా మెక్సికో నుంచి భారత్ భారీ స్థాయిలో దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై 50శాతం సుంకాల్ని చెల్లించాల్సి వస్తుంది. వాటిలో ప్రధాన ఉత్పత్తులు వాహనాలు, వాహనాల విడిభాగాలు, టెక్స్‌టైల్స్, ప్లాస్టిక్, స్టీల్ ఉంది. అలా చెల్లించే పరిస్థితి వస్తే దేశీయంగా సంబంధిత వస్తువుల ఉత్పత్తుల అమాంతం పెరిగే అవకాశం ఉందని వెలుగులోకి వచ్చిన జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ దేశీయంగా తయారీ రంగానికి ఊతం ఇచ్చేలా పలు నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా అమెరికాతో ఫ్రీ ట్రేడ్ ఒప్పందాలు కుదుర్చుకున్నారు. తాజాగా, భారత్ దిగుమతులపై సుంకం విధించే దిశగా చర్యలు తీసుకున్నారు. ఫ్రీ ట్రేడ్ ఒప్పందాలు కుదుర్చుకున్నారు. తాజాగా, భారత్ దిగుమతులపై సుంకం విధించే దిశగా చర్యలు తీసుకున్నారు. భారత్‌పై 50శాతం వరకు సుంకాలను విధించాలన్న మెక్సికో చర్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది. మెక్సికన్ ఎగుమతులకు భారత్ తొమ్మిదవ స్థానంలో ఉంది. ప్రస్తుతం, భారత్.. మెక్సికోతో అధిక మొత్తంలో వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు పలు నివేదికలు చెబుతున్నాయి. 2024లో భారత్ నుంచి మెక్సికోకు ఎగుమతులు దాదాపు 8.9 బిలియన్ డాలర్లు కాగా, దిగుమతులు 2.8 బిలియన్లుగా ఉంది.గతేడాది భారత్.. మెక్సికో నుంచి వాహనాలు, వాటి తయారీలో వినియోగించే ఆటో విడిభాగాలు,ఇతర ప్రయాణీకుల వాహనాలు. ఇప్పు డు, మెక్సికో ఈ వస్తువులపై భారీ సుంకాలు విధించడంతో.. వచ్చే ఏడాది దిగుమ తులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశ ఉందని ఆర్థిక నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# భారత్‌కు 'బంగ్లా' దౌత్య ద్రోహం..

### పాక్, చైనాలతో జతకట్టి..

**న్యూఢిల్లీ:** పాకిస్తాన్-చైనా నేతృత్వంలోని కొత్త ప్రాంతీయ కూటమిలో చేరేందుకు బంగ్లాదేశ్ అమితమైన ఆసక్తి చూపిస్తున్నదనే వార్తలు ఇటీవలి కాలంలో విరివిగా వినిపిస్తున్నాయి.ఇది దక్షిణాసియాలో కీలక వ్యూహాత్మక మార్పును సూచిస్తున్నది. భారతదేశం లేకుండా, పాకిస్తాన్‌తో కలిసి ప్రాంతీయ కూటమిలో చేరడం బంగ్లాదేశ్‌కు వ్యూహాత్మకంగా సాధ్యమే అని బంగ్లాదేశ్ విదేశాంగ సలహాదారు తౌహిద్ హుస్సేన్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఢాకా, బీజింగ్, ఇస్లామాబాద్‌లతో కూడిన కొత్త త్రైపాక్షిక సమూహంపై పాకిస్తాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ సూచన చేసిన కొద్ది రోజులకే ఈ ప్రకటన వచ్చింది.2024ఆగస్టులో షేక్ హసీనా పదవీచ్యుతి అనంతరం పాకిస్తాన్-బంగ్లాదేశ్ సంబంధాలు వాణిజ్యం, రక్షణ, మౌలిక సదుపాయాల రంగాలలో విస్తరిస్తూ వస్తున్నాయి. ముహమ్మద్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వ సారథ్యంలో ఈ రెండు దేశాల మధ్య సహకారం పెరుగుతోంది. గతంలో షేక్ హసీనా ప్రభుత్వం.. న్యూఢిల్లీ, బీజింగ్, వాషింగ్టన్‌లను నొప్పించకుండా సమతుల్య సంబంధాలను చాకచక్యంగా కొనసాగించింది. నాడు భారతదేశం ఒక కీలక భాగస్వామిగా ఉంది. అయితే, ప్రస్తుత పరిస్థితులలో ఢాకా.. ఇస్లామాబాద్, బీజింగ్ వైపు మొగ్గు చూపుతూ, భారత్‌తో సమతుల్య భాగస్వామ్యాన్ని కోల్పోయింది. చైనాలోని కున్మింగ్‌లో మంతనాలు



ఈ ప్రాంతీయ కూటమి చర్చలు గత ఏడాది నుండి వేగం అందుకున్నాయి. గత జూన్‌లో చైనా, బంగ్లాదేశ్,పాకిస్తాన్‌లు చైనాలోని కున్మింగ్‌లో తమ మొదటి అధికారిక త్రైపాక్షిక సమావేశాన్ని నిర్వహించాయి. ఈ సమావేశంలో వాణిజ్యం, పెట్టుబడి, మౌలిక సదుపాయాలు , రుణ నిర్వహణలో సహకారాన్ని పెంపొందించేందుకు మూడు పక్షాలు అంగీకారం కుదుర్చుకున్నాయి. మరోవైపు పాకిస్తాన్ తాజాగా భారతదేశాన్ని మినహాయించి, చైనాను భాగస్వామిగా చేర్చుకుంటూ, విస్తృతమైన దక్షిణాసియా కూటమిని ప్రతిపాదిస్తున్నది. ఈ నేపథ్యంలో ఇస్లామాబాద్- బీజింగ్ మధ్య ఈ అంశంపై చర్చలు జరిగాయని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి.

# మార్చి నాటికి భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**భారత్- అమెరికాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతోన్న వేళ ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ కీలక వ్యాఖ్యలు చేశారు మార్చి నాటికి ఈ ఒప్పందం ఖరారయ్యే అవకాశాలు ఉన్నాయని ఆయన వెల్లడించారు. పలు అంశాలపై



ఇరుదేశాల ప్రతినిధులు ఏకాభిప్రాయం సాధిస్తు న్నారని చెప్పారు.అమెరికా డిప్యూటీ వాణిజ్య ప్రతినిధి రిక్ స్విట్జర్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం ప్రస్తుతం జరుగుతోన్న వాణిజ్య చర్చల్లో పాల్గొంటోంది. భారత్ తరపున వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ ఈ చర్చలో భాగమ య్యారు. ఈసందర్భంగా భారత్ నుంచి అమెరికా 'అత్యు త్తమ' ఆఫర్లు అందుకుందని యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యూఎస్‌టీఆర్) జేమిసన్ గ్రీర్ పేర్కొన్నారు. కొన్ని పంటలు, మాంసం, కొన్ని ఉత్పత్తుల విషయంలోనే భారత్ నుంచి వ్యతిరేకత వస్తోందని వాషింగ్టన్‌లో సెనెట్ కేటా యింపుల సబ్‌కమిటీ ముందు ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలోనే నాగేశ్వరన్ స్పందించారు. 2026-2027 ఆర్థిక సంవత్సరానికి అంచనాలు బలంగా ఉన్నాయని ఆయన వెల్లడించారు.

# భార్యను ముక్కలుగా చేసి.. ముద్దలుగా మార్చేసి..

### స్విట్జర్లాండ్‌లో వెన్నులో వణుకుపుటించే ఘటన

బర్న్:ఈ మధ్య మలయాళంలో సూక్షదర్శిని అనే సినిమా వచ్చింది. అందులో అమాయకంగా కనిపించే తల్లీకొడుకులు.. తమ ఇంటి బిడ్డనే దారుణంగా హతమార్చి.. యాసిడ్‌లో పోసేసి కరిగించేస్తారు.ఆపై ఏం ఎరగనట్లు నాటకాలాడతారు. పరువు హత్య(ఓ సున్నితమైన అంశం) నేపథ్యంతో తెరకెక్కిన ఈ సినిమా అక్కడ హిట్ అయ్యి.. ఇక్కడ తెలుగు డబ్‌తో ఓటీటీలోనూ అలరించింది. అయితే దాదాపు ఇలాంటి తరహా ఘటనే ఒకటి తెరపైకి వచ్చింది.వింటేనే వెన్నులో వణుకుపుట్టే ఘటన ఇది. తన భార్యను.. ఇద్దరు పిల్లల తల్లిని.. క్షణికావేశంలోనో లేదంటో ఉద్దేశపూర్వకంగానో హత్య చేశాడో భర్త. ఆపై నేరం నుంచి తప్పించుకునేందుకు అతను చేసిన ప్రయత్నమే కిరాతకంగా ఉంది. ఆమెను ముక్కలుగా.. చెక్కలుగా చేసి.. ముద్దగా మార్చేసి కేసు నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. అయితే.. ఆ ప్రయత్నంలో అడ్డంగా దొరికిపోయి దోషిగా తేలాడు.స్విట్జర్లాండ్‌లో హైప్రొఫెషనల్ కేసుగా ఉన్న క్రిస్టియానా జోక్సిమోవిక్(38) కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. భర్తే ఆమెను కిరాతకంగా హత్య చేశాడని స్థానిక అధికారులు బుధవారం నిర్ధారించారు. క్రిస్టియానా జోక్సిమోవిక్ మిస్ స్విట్జర్లాండ్ ఫైనలిస్ట్ కావడమే ఈ కేసు అందరి దృష్టిని ఆకర్షించేలా చేసింది.2024 ఫిబ్రవరిలో బిన్నింగెన్‌లోని తన నివాసంలో క్రిస్టియానా జోక్సిమోవిక్ దారుణ హత్యకు గురైంది. ఈ కేసులో వేళ్లన్నీ భర్త థామస్ వైపే చూపించాయి. అయితే తన భార్య తనపై దాడికి ప్రయత్నించిందని.. ఆ ప్రయత్నంలో ప్రమాదవశాత్తూ మరణించిందని.. తాను భయంతో ఆ శవాన్ని మాయం చేసే ప్రయత్నం మాత్రమే చేశానని మొదటి నుంచి అతను వాదించాడు.




కానీ, ఆధారాలు అన్నీ అతనికి వ్యతిరేకంగానే ఉన్నాయి.ఆమెను గొంతు నులిమి హత్య చేసిన థామస్.. గర్భాశయాన్ని తొలగించి ఆ తర్వాత పెరట్లోని రంపంతో ముక్కలుగా కత్తిరించాడని.. ఆపై మిక్సర్‌లో వేసి ముద్దగా మార్చేశాడని.. అందులో కొంత భాగాన్ని రసాయనాల్లో వేసి కరిగించేశాడని తెలిపారు. నేరానికి ఉయోగించిన రంపాన్ని, తోలు భాగాన్ని, ఎముకల అవశేషాల్ని పోలీసులు స్వాధీనం చేసుకోగలిగారు. ఈ ఘోరాన్ని అతను యూట్యూబ్ వీడియోలు చూస్తూ చేశాడని వెల్లడించారు.శరీరం నుంచి నడుమ జాయింట్లను విరిచేసి.. మెడ, వెన్నెముకను కోసేసి.. చివరకు ఆమె తలను వేరు చేసి శరీరాన్ని ముక్కలుగా చేశాడు. శవపరీక్షలో అత్యంత భయానకమైన ఈ వివరాలు వెల్లడయ్యాయి అని కోర్టుకు దర్యాప్తు అధికారులు సమర్పించిన వివరాల్లో ఉంది.క్రిస్టియానా మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఆమె ఆచూకీ గురించి తీవ్రంగా ప్రయత్నించారు. నెలలు గడిచినా ఆమె ఆచూకీ కానరలేదు. అయితే.. క్రిస్టియానా జుట్టుకు సంబంధించిన అవశేషాలను లాండ్రీ రూమ్‌లో ఆమె తండ్రి గుర్తించడం ఈ కేసును అసలు మలుపు తిప్పింది. ఆ ఘటన తర్వాత ఎలాంటి కంగారు లేకుండా ఉన్నాడని.. అది అతనిలోని క్రూరత్వానికి ప్రతీకగా నిలిచిందని పోలీసులు తమ నివేదికలో వివరించారు. భర్తే హంతకుడిగా తేలడంతో ఈ కేసు ట్రయల్ జరగాల్సి ఉంది.మిస్ నార్త్‌వెస్ట్ స్విట్జర్లాండ్ క్రిస్టియానా జోక్సిమోవిక్.. 2007లో మిస్ స్విట్జర్లాండ్ పోటీల్లో ఫైనలిస్ట్‌తో సరిపెట్టుకుంది. ఆ తర్వత క్యాట్‌వాక్ కోచ్‌గా మారి.. అనేక మంది మోడల్స్‌కు శిక్షణ ఇచ్చింది.

### రూ. 9.1 కోట్లు ఉంటే

# ట్రంప్ గోల్డ్ కార్డ్ మీదే!

**న్యూయార్క్:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమకు ఆదాయాన్ని తెచ్చిపెడుతుందని భావిస్తున్న "ట్రంప్ గోల్డ్ కార్డ్" పథకానికి సంబంధించిన అధికారిక అమ్మకాలను ప్రారంభించారు.అమెరికా పౌరసత్వం కావాలని కోరుకునే సంపన్నులకు, అమెరికన్ కంపెనీలు నిపుణులైన వారికి ఎంపిక చేసుకు నేందుకు వీలుగా ఈ కార్డుని తీసుకొచ్చారు.గోల్డ్ కార్డ్‌కు భారీ ఖరీదు ఈ 'ట్రంప్ గోల్డ్ కార్డ్' పథకం ప్రధానంగా డబ్బు చెల్లించే వారికి వేగవంతమైన వసతి మార్గాన్ని అం దిస్తుంది. అలాగే అగ్రశ్రేణి ప్రతిభను ఆకర్షించడానికి, నిలుపుకోవడానికి ఒక మార్గంగా ట్రంప్ భావిస్తున్నారు. అదే సమయంలో ఫెడరల్ ఖజానాకు ఆదాయాన్ని తెచ్చి పెడుతుందని అంచనా. అయితే ఈ గోల్డ్ కార్డ్ కోసం వ్యక్తి ఒక మిలియన్ డాలర్లు (సుమారు రూ.9.1 కోట్లు), ప్రతీ ఉద్యోగి కోసం సంస్థ 2 మిలియన్ డాలర్లు (సుమారు రూ.18 కోట్లు) చెల్లించాల్సి ఉంటుం ది. దీనికి త్వరలో ఉన్నతస్థాయి 'ప్లాటినం కార్డ్' హామీ ఇవ్వబడుతుందని ప్రకటించారువైట్ హౌస్‌లోని వ్యాపారవేత్తలతో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ట్రంప్‌ఈ గోల్డ్ కార్డు కోసం ప్రత్యేకంగా వెబ్‌సైట్ కూడా లాంచ్ చేశారు.







# ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

**మొదటి దఫా పోలింగ్ శాతం 79.57 శాతం**

**మొత్తం 1,11,148 ఓట్లలో పోలైన ఓట్లు 88,442**

**ఓటు హక్కు వినియోగించుకున్న ప్రభుత్వ విప్ ఆది దంపతులు**

**పోలింగ్ సర్వేను పరిశీలించిన జిల్లా ఇన్చార్జి కలెక్టర్, జిల్లా ఎస్పీ**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి డిసెంబర్ 11(జనంసాక్షి) :** గ్రామ పంచాయతీ ఎన్నికల క్రమంలో మొదటి దఫా ఎన్నికల పోలింగ్ 79.57 శాతం నమోదు అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. చందుర్తి,కోనరావుపేట, రుద్రంగి,వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్ మండలాల్లో గురువారం పోలింగ్ జరిగింది. ఐదు మండలాల్లో కలిపి మొత్తం 1,11,148 ఓట్లు ఉండగా, 88,442 పోల్ అయ్యాయి. మధ్యాహ్నం వరకు 79.57 శాతం పోలింగ్ నమోదు అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

**మండలాల వారిగా ఓటర్లు.. నమోదు అయిన పోలింగ్ శాతం..**

వేములవాడ రూరల్ మండలంలో మొత్తం ఓటర్లు 18,825 మంది ఉండగా, 15,525మంది ఓటు హక్కు వినియోగించుకోగా 82.47 శాతం నమోదు, కోనరావుపేట మండలంలో మొత్తం ఓటర్లు 34,641 మంది ఉండగా, 28,420 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 82.04 శాతం నమోదు, చందుర్తి మండలంలో మొత్తం ఓటర్లు 28,094 మంది ఉండగా, 21,823 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 77.68 శాతం నమోదు, వేములవాడ అర్బన్ మండలంలో మొత్తం ఓటర్లు 18, 492మంది ఉండగా, 14,687 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 79.42 శాతం నమోదు.రుద్రంగి మండలంలో మొత్తం ఓటర్లు 11, 096 మంది ఉండగా, 7,987 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 71.98 శాతం నమోదు అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

**ఓటు వేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..**

వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తన స్వగ్రామమైన రుద్రంగిలో ఆది శ్రీనివాస్ దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధిస్తారని నమ్మకం ఉందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న స్థానిక సంస్థల పంచాయతీ ఎన్నికల్లో కూడా జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితాలు మాదిరిగానే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలనను ప్రజలు ఆశీర్వదిస్తూ పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ మద్దతు దారులను గెలిపించబోతున్నారన్నారు. గ్రామీణ స్థాయి నుండి అంతర్జాతీయ స్థాయి వరకు నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ ను చూసి హరీష్ రావు,కేటీఆర్ లకు తెలంగాణకు పేరు వస్తే ఎందుకు ఇంత కడుపు మంట అన్నారు. తెలంగాణ సబ్బండ వర్గాలు అభివృద్ధి కోరుకుంటే,దుబాయ్ వాట్సప్ గ్రూపుల ద్వారా విష ప్రచారం చేయడం, ప్రజలకు తప్పుడు సమాచారం ఇవ్వడం సరైనది కాదన్నారు. కెసిఆర్ సైతం ఫామ్ హౌస్ కె పరిమితమయ్యారని, మీరు కూడా మంచిని స్వాగతించకపోతే ప్రజలే మీకు సమాధానం చెప్తారన్నారు. పదేళ్లపాటు తెలంగాణను పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన కూడా తమ ప్రజా ప్రభుత్వ ప్రతినెల వడ్డీ రూపంలో రూ 6 వేల కోట్లు చెల్లిస్తుఆదాయ వనరులు పెంచుతున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా తమ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.2047 నాటికి రాష్ట్రంలోని ప్రతి పౌరుడి తలసరి ఆదాయం రూ 24 లక్షలు వుండే విధంగా సీఎం రేవంత్ రెడ్డి పని చేస్తున్నారన్నారు.

**పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఇంచార్జి జిల్లా కలెక్టర్...**

గ్రామ పంచాయతీ ఎన్నికల క్రమంలో మొదటి దఫా ఎన్నికలు జరుగుతున్న పలు పోలింగ్ కేంద్రాలను జిల్లా ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ చందుర్తి ప్రాథమిక పాఠశాల,వేములవాడ అర్బన్ మండలం పరిధిలోని చీర్లవంచ ఆర్అండ్ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సందర్శించారు. ఓటింగ్ సరళిని పరిశీలించి,అధికారులతో మాట్లాడారు.పోలింగ్ కేంద్రంలో ఆవరణలో పరిశీలించారు.ఆమె వెంట వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, తహసీల్దార్లు, ఎంపీడీఓలు,ఎంపీఓలు పాల్గొన్నారు.

**ఎన్నికల కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ మహేష్ బి.గీతే.**


మొదటి దఫా జరుగుతున్న పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ మహేష్ బి గితే పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులకు,సిబ్బందికి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేల భద్రత పరమైన పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.పెట్రోలింగ్ వాహనాలు,ప్రత్యేక పోలీసు బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారన్నారు.





# అనాధ వృద్ధుల ఆత్మబంధువు నర్సయ్య గౌడ్‌కు 'సేవా రత్న' అవార్డు

- గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా సత్కారం
- యువతకు ఆదర్శంగా నిలవాలని ప్రశంసలు
- సొంత ఇంట్లో 20 ఏళ్లుగా వృద్ధాశ్రమం నిర్వహణ
- రవీంద్రభారతిలో ఘనంగా కార్యక్రమం




**గంభీరావుపేట, డిసెంబర్ 11 (జనం సాక్షి):** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని 'మా అనాధ అభాగ్యుల వృద్ధాశ్రమం' నిర్వాహకులు, జాతీయ నంది అవార్డు గ్రహీత మల్లుగారి నర్సయ్య గౌడ్‌కు రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా 'సేవా రత్న' పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన 9వ తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఫార్మేషన్ డే సందర్భంగా ఈ అవార్డు ప్రదానం చేశారు.

అనాధ వృద్ధుల ఆత్మబంధువుగా పేరొందిన నర్సయ్య గౌడ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని గవర్నర్ ప్రశంసించారు. సొంత ఇంట్లో 20 సంవత్సరాలుగా ప్రభుత్వ సహాయం లేకుండా వృద్ధాశ్రమం నెలకొల్పి నడుపుతూ, ప్రస్తుతం 31 మంది అనాధ వృద్ధులకు ఆశ్రయమిస్తూ అన్ని విధాలుగా సేవలందిస్తున్నారని ఆయన కొనియాడారు. విద్యార్థి దశ నుంచి సామాజిక సేవలో నిమగ్నమై, ప్రభుత్వ ఉద్యోగాన్ని వదులుకొని గ్రామానికే జీవితాన్ని అంకితం చేసిన నర్సయ్య గౌడ్ గత 40 ఏళ్లుగా సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఈ అవార్డు తమ వృద్ధుల ఆశీర్వాదంగా భావిస్తున్నానని నర్సయ్య గౌడ్ అన్నారు. వృద్ధాప్యాన్ని గౌరవించాలని, అవమానించకూడదని, వృద్ధులను ఆదరించి ఆనందం పంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ జాతి సంపద అయిన వృద్ధులు సమాజంలో గౌరవంగా, ఆనందంగా, ప్రశాంతంగా ఉన్నప్పుడే మానవ విలువలు వికసిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రిటైర్డ్ హైకోర్టు జడ్జి బి. చంద్రకుమార్, ఉమెన్ చైల్డ్ డెవలప్‌మెంట్ సీనియర్ సిటిజన్ గవర్నమెంట్ సెక్రటరీ అనితా రామచంద్రన్ ఐఏఎస్, మాజీ ఎమ్మెల్సీలు సుధాకర్ రెడ్డి, కోదండరాం, ప్రభాకర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంపవర్‌మెంట్ సీనియర్ ట్రాన్స్ జెండర్స్ పర్సన్స్ డైరెక్టర్ బి. శైలజ, ప్రొఫెసర్ మాసనా చెన్నప్ప, తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి. నరసింహారావు, జనరల్ సెక్రటరీ పిఎస్ఎన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహణ

- వివిధ గ్రామాల్లో పోలింగ్ ప్రక్రియ పరిశీలన చేసిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 11(జనంసాక్షి):** వివిధ గ్రామాల్లో పోలింగ్ ప్రక్రియ పరిశీలన మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ ను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. రామడుగు మండలం వెదిర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని, గంగాధర మండలం కురిక్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని, గంగాధర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని, కొత్తపల్లి మండలం బద్దిపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని గురువారం కలెక్టర్ సందర్శించారు. ఓటరు జాబితాలో ఓటర్ల క్రమసంఖ్య సరిచూసుకొని ఓటింగ్ ప్రక్రియను నిర్వహించాలని ప్రిసైడింగ్ అధికారులకు సూచించారు. పోలింగ్ నిర్వహణను, ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. పోలింగ్ స్టేషన్ ఆవరణలో పోటీలో ఉన్న సర్పంచి, వార్డు సభ్యుల అభ్యర్థుల జాబితాను పరిశీలించారు. గ్రామ పంచాయతీల పరిధిలో ఓటర్ల సంఖ్య పోలింగ్ శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం ఎప్పటికప్పుడు నిర్దేశిత ఫార్మాట్లో నమోదు చేయాలనీ రిటర్నింగ్ అధికారిని ఆదేశించారు. మధ్యాహ్నం ఒంటి గంటలోపు పోలింగ్ కేంద్రం ఆవరణలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న వారందరికీ ఓటు సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. ఒకటి తర్వాత ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రం గేటు లోపలికి అనుమతించకూడదనీ కలెక్టర్ అక్కడి ఎన్నికల అధికారులను ఆదేశించారు.

# పెద్దపల్లి జిల్లాలో ప్రశాంతంగా సాగుతున్న కౌంటింగ్ ప్రక్రియ

**82.27 శాతం పోలింగ్ నమోదు : కలెక్టర్ కోయ శ్రీహర్ష**



పెద్దపల్లి, డిసెంబర్ 11 (జనం సాక్షి): పెద్దపల్లి జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. గురువారం కమాన్‌పూర్ మండలం గుండారంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జడ్పీ హైస్కూల్, రామగిరి మండలం కలవచర్ల జడ్పీ హైస్కూల్‌లలో జరుగుతున్న కౌంటింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా కౌంటింగ్ సాగుతోందని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ముందుగా లెక్కింపాలని, వార్డు సభ్యులు, సర్పంచ్ కౌంటింగ్‌ను సమాంతరంగా నిర్వహించేందుకు అవసరమైన సిబ్బంది, ఏర్పాట్లు చేశామని తెలిపారు. అలసత్వం, తొందరపాటు లేకుండా సిబ్బంది పనిచేయాలని సూచించారు. కౌంటింగ్ ముగిసిన తర్వాత గెలుపొందిన వార్డు సభ్యులు, సర్పంచ్‌లకు రిటర్నింగ్ అధికారులు సర్టిఫికెట్లు అందించాలని, వార్డు సభ్యుల ద్వారా ఉప సర్పంచ్ ఎన్నికను ఈరోజే పూర్తి చేసేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. ఈ పర్యటనలో తాసిల్దార్లు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా పెద్దపల్లి జిల్లాలో మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో 82.27 శాతం పోలింగ్ నమోదైందని కలెక్టర్ తెలిపారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్ స్క్రీన్ల ద్వారా 5 మండలాల పోలింగ్ సరళిని పరిశీలించారు. మధ్యాహ్నం 1 గంట వరకు లక్షా 18 వేల 346 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు వెల్లడించారు. ఈ పరిశీలనలో జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జిహెచ్ఎంసి పునర్విభజన చిచ్చు

- పాత పేరుకే ప్రాధాన్యత ఇవ్వాలి
- బలరాం నగర్ నామకరణంపై నిరసన



**మల్కాజిగిరి డిసెంబర్ 11(జనంసాక్షి) :** నూతన జిహెచ్ఎంసి డివిజన్ల పునర్విభజన స్థానికంగా తీవ్ర రాజకీయ దుమారాన్ని రేపుతోంది. గతంలో మల్కాజిగిరి డివిజన్‌లో ఉన్న ప్రాంతాన్ని విభజించి, కొత్తగా బలరాం నగర్ డివిజన్‌గా ప్రకటించడంపై నేరేడ్‌మెట్ వాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అన్ని పార్టీల నాయకులు జేఏసీగా ఏర్పడి నేరేడ్ మెట్ అంబేద్కర్ భవన్ లో సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు.బలరాం నగర్ పేరును తక్షణమే రద్దు చేసి, దానికి బదులుగా సుదీర్ఘ చరిత్ర కలిగిన తమ ప్రాంతం పేరుతో 'నేరేడ్‌మెట్ ను డివిజన్'గా నామకరణం చేయాలని స్థానికులు పాలకులను కోరారు.చారిత్రక ప్రాధాన్యత కలిగిన నేరేడ్‌మెట్ పేరును విస్మరించి, కొత్తగా తెరపైకి వచ్చిన బలరాం నగర్ పేరు పెట్టడం పట్ల స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.నేరేడ్‌మెట్‌కు ఉన్న గుర్తింపును పాలకవర్గం కావాలనే తగ్గించే ప్రయత్నం చేస్తోందని ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేవలం పరిపాలనా సౌలభ్యం కోసం పాతపేర్లను ప్రాంతీయ గుర్తింపును బలి ఇవ్వడం సరికాదు. మా డివిజన్‌కు నేరేడ్‌మెట్ పేరును పునరుద్ధరించే వరకు నిరసన ఆపేది లేదని తేల్చి చెప్పారు. అలాగే డివిజన్ పేరు మార్పుతో పాటు, రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో నూతన డివిజన్‌కు సంబంధించిన టికెట్‌ను తప్పనిసరిగా నేరేడ్‌మెట్ స్థానికుడికే కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. పేరు మార్పు, టికెట్ కేటాయింపు రెండూ స్థానికుల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశాలని, ఈ డిమాండ్లు నెరవేర్చకపోతే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని స్థానిక నాయకులు పాలక పక్షాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బాలలింగం,చాకో, సుందర్ యాదవ్, తుపాకుల జనార్దన్, గంగాధరి కృష్ణ, శ్రీనివాస్ యాదవ్, ప్రశాంత్ యాదవ్, గణేష్, బల్లారి అశోక్, జంగిలి శివకుమార్, సానాది శంకర్, తుపాకుల కోటేశ్వర్, మురళీ గౌడ్, కటికల నరేష్, నందు యాదవ్, లక్ష్మీపతి, మోర శ్రీకాంత్, ఈశ్వర్ యాదవ్, ఈశ్వర్ గౌడ్, రమేష్, రాజు, శ్రీశైలం, రాజు గౌడ్,సూరి,నేరేడ్‌మెట్ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రాష్ట్రపతి శీతాకాల విడిదికి జిల్లా సిద్ధం





**హకీంపేట-బొల్లారం మార్గంలో ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 11(జనంసాక్షి) :** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిదికై ఈ నెల 17న హైదరాబాద్‌కు రానుండటంతో, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధికార యంత్రాంగం పూర్తిస్థాయి అప్రమత్తతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి స్పష్టం చేశారు. హకీంపేట ఎయిర్‌పోర్ట్‌కు రాష్ట్రపతి చేరుకుని, అక్కడి నుంచి బొల్లారంకు రోడ్డు మార్గం ద్వారా ప్రయాణించనున్న నేపథ్యంలో, అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు.జిల్లా కలెక్టరేట్ విసి హాల్‌లో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "రాష్ట్రపతి పర్యటనలో ఎలాంటి లోపం చోటుచేసుకోకుండా, ప్రతి శాఖ అత్యంత బాధ్యతతో వ్యవహరించాలి" అని స్పష్టం చేశారు.హకీంపేట ఎయిర్‌పోర్ట్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో అందమైన మొక్కల నాటకం, ప్లాంటేషన్ కార్యక్రమాలు చేపట్టాలని, అలాగే రాష్ట్రపతి ప్రయాణించే మార్గంలో ఇరువైపులా సుందరీకరణ పనులు చేయాలని సూచించారు. అవసరమైన చోట మొబైల్ టాయిలెట్లు ఏర్పాటుచేయాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్‌కు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.వైద్య-ఆరోగ్య శాఖపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్, అవసరమైన మందులు, అత్యవసర మెడికల్ కిట్స్‌ను ప్రాంగణంలో సిద్ధంగా ఉంచాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఉమా గౌరిని ఆదేశించారు. రోడ్లు-భవనాల శాఖ అధికారులు హకీంపేట-బొల్లారం రహదారిలో ఉన్న గుంతల పూడిక, రోడ్డు మరమ్మతులు, అవసరమైతే కొత్తగా రోడ్డు వేయాల్సిన పనులను వెంటనే పూర్తి చేయాలని హెచ్చరించారు.ప్రయాణంలో అంతరాయం కలగకుండా నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండేందుకు ట్రాన్స్‌కో అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని, అవసరమైతే జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు. అలాగే, రాష్ట్రపతి కదలికల సమయంలో బందోబస్తు విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వద్దని పోలీసు అధికారులను హెచ్చరించారు. అగ్నిమాపక పరికరాలు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఫైర్ అధికారి జయకృష్ణకు ఆదేశించారు.రాష్ట్రపతి ప్రయాణించే మార్గంలోని శానిటేషన్ బాధ్యతను సంబంధిత మున్సిపల్ కమిషనర్లు శ్రద్ధగా చూసుకోవాలని, ఎలాంటి నిర్లక్ష్యం చోటు చేసుకోవద్దని కలెక్టర్ కఠిన ఆదేశాలు జారీ చేశారు.సమీక్షలో ఆర్అండ్‌బీ ఈఈ శ్రీనివాసమూర్తి, హార్టికల్చర్ అధికారి శ్రీధర్, ట్రాఫిక్ ఏసిపి వెంకట్ రెడ్డి, అటవీ అధికారి వేణుమాధవ్, అల్వాల్ ఎస్హెచ్ఓ ప్రశాంత్, ఫుడ్ సేఫ్టీ అధికారి నీలేశ్, తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి, శామీర్‌పేట్ తహసీల్దార్ సంయుక్త తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్‌లో ప్రశాంతంగా మొదటి విడత పంచాయతీ ఎన్నికలు



**నిజామాబాద్, డిసెంబర్ 11 (జనంసాక్షి) :** నిజామాబాద్ జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ ఉదయం 7 గంటలకు ప్రశాంతంగా ప్రారంభమైంది. వణికించే చలిని లెక్కచేయకుండా ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుంచే ఓటర్లు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. ఉదయం 9 గంటలకు సగటున 19.80 శాతం పోలింగ్ నమోదు కాగా, 11 గంటలకు 50.73 శాతం ఓటింగ్ పూర్తయింది. మధ్యాహ్నం 1 గంటకు పోలింగ్ ముగిసిన తర్వాత నిర్ణీత సమయం లోపు క్యూ లైన్‌లో ఉన్న ఓటర్లకు కూడా ఓటు వేసే అవకాశం కల్పించారు.

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఎడపల్లి మండలం జానకంపేట, ఎంఎస్సీ ఫామ్‌లోని పోలింగ్ కేంద్రాలను, బోధన్ మండలం పెగడాపల్లి పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాలను సందర్శించి ఓటింగ్ ప్రక్రియను, ఏర్పాట్లను పరిశీలించారు. హెల్ప్‌డెస్కులు, మెడికల్ క్యాంపులు, తాగునీరు వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని తనిఖీ చేశారు. బోధన్, చందూర్, కోటగిరి, మోస్రా, పోతంగల్, రెంజల్, రుద్రూర్, సాలూర, వర్ని, ఎడపల్లి, నవీపేట మండలాల పరిధిలోని 11 మండలాల్లో 1440 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 71 సమస్యాత్మక కేంద్రాల వద్ద అదనపు పోలీసు బలగాలు, 31 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, 40 కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లతో నిఘా ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ నుంచి కూడా పోలింగ్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

మొదటి విడతలో మొత్తం 184 సర్పంచ్ స్థానాలకు గాను నామినేషన్ల ఉపసంహరణ నాటికి 29 స్థానాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. మిగతా 155 సర్పంచ్ స్థానాలకు, 1642 వార్డు స్థానాల్లో 7 స్థానాలకు నామినేషన్లు రాకపోగా, 575 వార్డులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. దీంతో 1060 వార్డు స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మొదటి రెండు గంటలు మోస్తరుగా సాగిన పోలింగ్ అనంతరం వేగం పుంజుకుని ఉదయం 11 గంటలకే 50 శాతానికి పైగా నమోదైంది. ఓటింగ్ ఆవశ్యకతపై విస్తృత ప్రచారం, ఫొటోలతో కూడిన ఓటరు స్లిప్‌ల పంపిణీ, బీఎల్ఓల హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటుతో ఓటర్లు భారీగా తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారని కలెక్టర్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఓటింగ్ సాగిందని, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేశారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి కట్టుదిట్టమైన ఏర్పాట్లతో ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించేందుకు చర్యలు తీసుకున్నారు. ఏ చిన్న తప్పిదుకూ తావులేకుండా జాగ్రత్తగా కౌంటింగ్ జరపాలని అధికారులకు సూచించారు.

ఎన్నికల సాధారణ పరిశీలకులు శ్యాంప్రసాద్ లాల్ పోతంగల్, కోటగిరి, రుద్రూర్ మండలం సులేమాన్ నగర్, వర్ని మండలం సత్యనారాయణపురం, చందూర్, మోస్రా, బోధన్ మండలం అమ్దాపూర్, ఎడపల్లి తదితర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు డీసీపీ బస్వారెడ్డి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# 21న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల



**పెద్దపల్లి,డిసెంబర్ 11(జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి సునీత కుంచాల సూచించారు.తొలుత ఈ నెల 13న నిర్వహించాల్సిన లోక్ అదాలత్‌ను పంచాయతీ ఎన్నికల దృష్ట్యా 21వ తేదీకి మార్చినట్లు ఆమె తెలిపారు.ఈ లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు,క్రిమినల్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, మోటార్ వెహికిల్స్ ఇన్సూరెన్స్ క్లెయిమ్ కేసులు మరియు కుటుంబ తగాదాలతో సహా అనేక రకాల కేసులను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకునే అవకాశం కల్పించారు.కక్షిదారులు ఈ ఉచిత న్యాయ పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకుని, కోర్టు వెలుపల తమ కేసులను రాజీ పద్ధతిలో పరిష్కరించుకోవాలని న్యాయమూర్తి కోరారు.ఈ ప్రక్రియ ద్వారా ఒకసారి రాజీ చేసుకున్న కేసులపై అపీల్, రివిజన్ వంటివి ఉండవని, తద్వారా సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే అవసరం తప్పుతుందని, మానసిక ప్రశాంతత లభిస్తుందని వివరించారు.కాగా, ఈ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందని సంస్థ కార్యదర్శి వి.భవాని తెలిపారు.కోర్టు పరిధిలో లేని ఫిర్యాదుదారులు సైతం ఈ లోక్ అదాలత్‌లో తమ కేసులను పరిష్కరించుకోవచ్చని,దీని కోసం వారు నేరుగా హాజరు కానవసరం లేకుండా వాట్సాప్ కాల్ ద్వారా తమ అంగీకారాన్ని తెలియజేసి కేసులను ముగించుకునే సౌలభ్యాన్ని కల్పించినట్లు పేర్కొన్నారు. తమ కేసు రాజీ పడదగినదా కాదా అనే సమాచారం కోసం, అలాగే న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేనివారు అర్హత ఉంటే కోర్టు తరపున ఉచిత న్యాయ సహాయం పొందడానికి న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని న్యాయమూర్తులు ప్రజలను కోరారు.అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించిన పోస్టర్లను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ భవాణి,జిల్లా అదనపు మరియు పోక్సో న్యాయమూర్తి శ్రీమతి కుంచం స్వప్న రాణి,జూనియర్ సివిల్ జడ్జి మంజులతో కలిసి ఆవిష్కరించారు.






# పచ్చి బాలింతలకు పరదాలే దిక్కు

- ఆపరేషన్లు చేసుకొని చలికి గజగజ వణుకుతున్న తల్లులు
- రక్షణ లేక తెచ్చుకున్న దుప్పట్లనే చుట్టూ కట్టుకుంటున్న దుస్థితి
- చీపుర్లు పట్టి ఊడ్చే అటెండర్లే వైద్యులుగా అవతారం
- షాద్ నగర్ కమ్యూనిటీ ప్రభుత్వాసుపత్రిలో దారుణం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :**
అస్సలే ఎముకలు కొరికే చలి.. మామూలు మనుషులే చలికి గజగజ వణికి పోతున్నారు. ఉదయం 9 గంటల వరకు ఇంట్లో నుండి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉంటే రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ కమ్యూనిటీ ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ ఆపరేషన్ (సర్జరీ) చేయించుకున్న బాలింతలు, రోగులు చలికి వణికిపోతున్నారు. కమ్యూనిటీ ప్రభుత్వాసుపత్రిలో బాలింతలకు రోగులకు చలి, గాలి, దుమ్ము ధూళి రాకుండా రక్షణగా ఉండాల్సిన (పార్టిషన్, కర్టెన్స్) క్లాత్ లేకపోవడంతో చలికి తట్టుకోలేక.. ఇంటి నుంచి తెచ్చుకున్న దుప్పట్లను రక్షణగా అడ్డం కట్టుకొని వైద్యం తీసుకుంటున్నారు. ఆపరేషన్ చేసుకున్న బాలింతలు ఇక ఈ ఆస్పత్రిలో చీపుర్లు పట్టి ఊడ్చే అటెండర్లే వైద్య అవతారం ఎత్తి బాలింతలకు రోగులకు ఇంజక్షన్లు ఇస్తూ గ్లూకోజులు పెడుతున్న దుస్థితి నెలకొంది. గతం నుండి కూడా ఈ ఆసుపత్రిపై రకరకాల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయిన కూడా వైద్యారోగ్య శాఖ అధికార యంత్రాంగం దృష్టి సారించడం లేదనే విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.

# ప్రకృతి పరిరక్షణలో సీఎస్ఆర్ చేయూత అవసరం



- చెరువుల అభివృద్ధిపై దృష్టి పెట్టిన హైడ్రా
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

**హైదరాబాద్, డిసెంబర్ 11(జనంసాక్షి):**
ప్రకృతి పరిరక్షణలో సీఎస్ఆర్ (కార్పొరేటర్ social responsibility) చేయూత అవసరం అని హైడ్రా కమిషనర్ అన్నారు. నగరంలో చెరువులను పెద్ద మొత్తంలో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికీ 6 చెరువుల అభివృద్ధి చేపట్టగా త్వరలో మరో 14 చెరువులను పునరుద్ధరించ నున్నట్టు తెలిపారు. గురువారం సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సదస్సులో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మాట్లాడారు. చెరువుల అభివృద్ధితో నగరంలో వరదలను కట్టడి చేయవచ్చునని చెప్పారు. ఇందుకు ఉదాహరణ అంబార్పేటలోని బతుకమ్మ కుంట అని చెప్పారు. ప్రతి ఏటా ఆ పరిసరాలు నీట మునిగేవని.. ఈ ఏడాది ఆ సమస్య తలెత్తలేదని అన్నారు. వర్షం నీరు నేరుగా బతుకమ్మకుంటకు చేరడంతో వరద ముప్పు ఆ ప్రాంతాలకు తప్పిందన్నారు. నగరంలో చెరువులు వాటిని అనుసంధానం చేసే కాలువలను పరిరక్షించుకుంటే వరద ముప్పులేని నగరం సాధ్యమన్నారు. సికింద్రాబాద్ ప్యాట్నీ నాలా 20 మీటర్ల వెడల్పుతో ఉండగా ప్యాట్నీ వద్దకు వచ్చేసరికి 5 మీటర్లకు కుంచించుకు పోతే 27 కాలనీలు ప్రతి ఏటా వరద ముప్పు ఎదుర్కొనేవని.. ఈ ఏడాది ఆక్రమణలు తొలగించి విడ్త్ పెంచడం వల్ల ఆ ప్రాంతాలన్నీ సేఫ్గా ఉన్నాయని అన్నారు. యిదే పరిస్థితి అమీర్పేట మైత్రివనం వద్ద నెలకొంది. నేరుగా ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ఈ సమస్యను పరిశీలించి.. పరిష్కరించాలని ఆదేశించారు. అక్కడ భూగర్భ డ్రెయిన్లు బ్లాక్ అవ్వడంతో వరద సాఫీగా సాగేది కాదని ఒకే చోట 150 ట్రక్ల పూడిక తొలగించడంతో సమస్య పరిష్కారం అయ్యింది అని చెప్పారు. ట్రాఫిక్ ఇబ్బందులు, ఆస్తి, ప్రాణ నష్టం దృష్టిలో పెట్టుకొని వరదలు లేని నగరమే లక్ష్యంగా హైడ్రా పని చేస్తోందని.. ఇందుకు CSR ఫండ్స్ కుడా తోడయితే మంచి ఫలితాలను రాబెట్టవచ్చునని అన్నారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా నగరంలో వర్షాకాలం తలెత్తే సమస్యలు.. వాటిని పరిష్కరించడంలో హైడ్రా చేసిన కృషిని హైడ్రా కమిషనర్ వివరించారు. హైడ్రా కార్యకలాపాలపై కబ్జాదారులు, ఆక్రమణదారులు దుష్ప్రచారం చేస్తున్నారని.. వాటికి వెరవకుండా భవిష్యత్ తరాలకు మెరుగైన విధానం అందించాలనేదే లక్ష్యంగా హైడ్రా పని చేస్తుంది అని అన్నారు. 1975 నుంచి 2024 వరకు 61 శాతం చెరువులు కనుమరుగయ్యాయని.. చెరువుల పరిరక్షణపై దృష్టి పెట్టకపోతే వేచి 15 ఏళ్లలో మొత్తం చెరువులు మాయం అవుతాయని %చీ=ాజ% హెచ్చరించిందని కమిషనర్ చెప్పారు. పార్కులను కాపాడి ప్రాణవాయువును అందిస్తున్నామని, చెరువులను కాపాడి వరదలను నియంత్రిస్తున్నామని, రహదారుల ఆక్రమణలు తొలగించి రాకపోకలు సులభతరం చేస్తున్నామన్నారు. యిలా అందరూ కలసినప్పుడు మెరుగైన నగరం, జీవన విధానం సాధ్యమని కమిషనర్ చెప్పారు.

# కరీంనగర్ పార్లమెంట్‌లో సత్తా చాటిన బీజేపీ

- 40కిపైగా స్థానాల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థుల గెలుపు.
- కార్యకర్తలకు అండగా ఉంటూ వ్యూహాత్మక ప్రణాలిక రచించిన బండి సంజయ్
- 2, 3 దశల ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ కంటే అధిక స్థానాలు సాధించేలా వ్యూహం రూపొందించిన సంజయ్ కుమార్.



**కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 11(జనంసాక్షి):**
కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ సత్తా చాటింది. గత పంచాయతీ ఎన్నికల్లో ఈ పార్లమెంట్ పరిధిలోని మొత్తం 800లకు పై చిలుకు గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహిస్తే కేవలం 22 స్థానాల్లో మాత్రమే బీజేపీ బలపర్చిన అభ్యర్థులు గెలిచారు. కానీ ఈసారి మాత్రం కేంద్ర మంత్రి బండి సంజయ్ కమార్ ఆధ్వర్యంలో తొలి దశ ఎన్నికల్లోనే 40కిపైగా స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు విజయ కేతనం ఎగరేయడం విశేషం. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో తొలిదశ ఎన్నికల్లో 160 స్థానాల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థులు పోటీ చేశారు. అందులో నాలుగో వంతుకుపైగా స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపొందడం విశేషం. తొలిదశ ఎన్నికల్లో గెలిచిన మరో 10 మందికి ఇండిపెండింట్ అభ్యర్థులు సైతం బండి సంజయ్ సమక్షంలో బీజేపీ గూటికి చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు జిల్లా బీజేపీ నేతలతో, బండి సంజయ్ తో మంతనాలు జరుపుతున్నారు. కేంద్ర నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లుగా గ్రామాల అభివృద్ధికి నయాపైసా కూడా ఇయ్యకపోవడమే ఇందుకు కారణమని ఇండిపెండెంట్ అభ్యర్థులు చెబుతున్నారు. పైగా బండి సంజయ్ ఎంపీగా, కేంద్ర మంత్రిగా కొనసాగుతన్నందున ఎంపీ లాడ్స్, సీఎస్సార్ ఫండ్స్ తోపాటు కేంద్రంతో మాట్లాడిన అత్యధిక నిధులను గ్రామ పంచాయతీల అభివృద్ధికి తీసుకొచ్చే అవకాశముందని వారు భావిస్తున్నారు. బండి సంజయ్ సైతం గ్రామాల అభివృద్ధిపై తాను ప్రత్యేక చొరవ తీసుకుని వివిధ రూపాల్లో నిధులు తీసుకొస్తానని పలుమార్లు చెప్పడంతో బీజేపీలో చేరితేనే తమ గ్రామాలకు ప్రయోజనం ఉంటుందని భావిస్తున్న పలువురు ఇండిపెండెంట్ అభ్యర్థులు ఈ మేరకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. పార్టీ గుర్తుల్లేకుండా ఎన్నికలు జరుగుతుండటంతో కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రచారం చేయలేదు.

కానీ బీజేప పక్షాన పోటీ చేస్తున్న అభ్యర్థులందరితో నిరంతరం టచ్ లో ఉన్నారు. వారికి అన్ని రకాల సహాయ సహకారాలు అందించారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితిని వారికి వివరిస్తూ... అప్రమత్తం చేస్తూ వచ్చారు. టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పోల్ మేనేజ్మెంట్ పై పలు సూచనలు చేశారు. చివరి నిమిషం వరకు అభ్యర్థుల పరిస్థితిపై ఆరా తీస్తూనే గెలుపు తీరానికి చేర్చడానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవడం గమనార్హం. వాస్తవానికి తొలి దశ ఎన్నికల్లో 30 స్థానాల్లో మాత్రమే విజయం సాధిస్తామని బీజేపీ నేతలు అంచనా వేశారు. 2, 3 దశ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ కు ధీటుగా స్థానాలను కైవసం చేసుకునే అవకాశాలు ఉన్నాయని భావించారు. కానీ తొలిదశలోనే అనుకున్నదానికంటే ఎక్కువ సీట్లు రావడంతో బీజేపీ శ్రేణులు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి.

## అంతర్జాతీయ స్థాయిలో సింగరేణి రెస్క్యూ జట్లు
# విజయ ఢంకా మోగించాలి

- సింగరేణి రెస్క్యూ జట్లకు అభినందనలు తెలిపిన సీఎండీ ఎన్.బలరామ్



**యైటింక్లయిన్ కాలనీ డిసెంబర్ 11 (జనంసాక్షి) :**
మహారాష్ట్ర నాగపూర్‌లో జరిగిన ఆల్ ఇండియా స్థాయి మైన్స్ రెస్క్యూ పోటీలలో పురుషుల జట్టు ఛాంపియన్ షిప్‌తోపాటు మహిళల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి మొత్తం 20 బహుమతులను కైవసం చేసుకోవడం చాలా గొప్ప విషయమని సంస్థ సీఅండ్ఎండీ ఎన్. బలరాం నాయక్ అన్నారు. ఇదే స్ఫూర్తితో త్వరలో జాంబియాలో జరిగే అంతర్జాతీయ స్థాయి పోటీలో కూడా సింగరేణి రెస్క్యూ జట్లు తమ సత్తా చాటాలని సీఎండీ రెస్క్యూ బృందాలకు సూచించారు. గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సింగరేణి రెస్క్యూ టీం జట్లతో మాట్లాడి అభినందనలు తెలిపారు. తొలిసారిగా సింగరేణి సంస్థలో ఏర్పాటు చేసిన మహిళా జట్టు ద్వితీయ స్థానంలో నిలవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అలాగే హైదరాబాద్ సింగరేణి భవన్‌లో జరిగిన అభినందన కార్యక్రమంలో డైరెక్టర్ (పి అండ్ పి) కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సింగరేణి ప్రతిష్టను దేశ వ్యాప్తం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.. ఈ సందర్భంగా రెస్క్యూ జనరల్ మేనేజర్ కాంరెడ్డి శ్రీనివాసరెడ్డి సింగరేణి రెస్క్యూ జట్లు సాధించిన విజయాలను వివరించారు. 54వ ఆల్ ఇండియా మైన్స్ రెస్క్యూ పోటీలలో సింగరేణి మెన్స్ టీం మొదటి బహుమతిని, ఛాంపియన్‌షిప్‌ను, మహిళా జట్టు ద్వితీయ స్థానాన్ని సాధించిందని, ఇంకా పురుషుల జట్టు రెస్క్యూ రిలేలో థియరీలో, ఫస్ట్ ఎయిడ్‌లో, రెస్క్యూ అండ్ రికవరీలో ప్రథమ స్థానాన్ని సాధించిందన్నారు. సింగరేణి మహిళా జట్టు ఫస్ట్ ఎయిడ్‌లో ప్రథమ స్థానాన్ని సాధించడంతోపాటు వివిధ విభాగాల్లో ఇతర బహుమతుల్ని సాధించిందని అలాగే ఉత్తమ రెస్క్యూవర్‌గా సింగరేణికి చెందిన గాయత్రి తల్లా ప్రథమ బహుమతిని సాధించిందని ఉత్తమ కెప్టెన్‌గా కృష్ణవేణి బహుమతిని అందుకున్నారని పేర్కొన్నారు. మొత్తం 37 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయని, వీటిలో సింగరేణి జట్టు అత్యధికంగా 20 బహుమతులను సాధించటం చరిత్రలో ఇదే ప్రథమమని పేర్కొన్నారు. అలాగే బహుమతులు పొందిన రెస్క్యూ సభ్యులందరినీ ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ బానోత్ వెంకన్న, జనరల్ మేనేజర్ కో-ఆర్డినేషన్ టి.శ్రీనివాస్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజేశ్వర్, రెస్క్యూ సూపరింటెండెంట్ జి. రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# తక్కలపల్లి తండాలో బోగస్ ఓట్ల మాయాజాలం

- తండాకు చెందని వ్యక్తుల దొంగ ఓట్లు
- తాసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదులు నిర్లక్ష్యం
- ఎస్టీ రిజర్వేషన్ పదవిపై కుట్రలు?
- అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి




**యాచారం, డిసెంబర్ 11 (జనం సాక్షి) :** రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధిలోని తక్కలపల్లి తండాలో పూర్తిగా షెడ్యూల్డ్ తండాలు (ఎస్టీ) కుటుంబాలే నివసిస్తున్నాయి. ఇటీవల తండాకు ఎటువంటి సంబంధం లేని వ్యక్తులు దొంగ ఇంటి నంబర్లు, మార్పిడి రికార్డులతో బోగస్ ఓట్లను సృష్టించారు. ఈ మోసపూరిత ఓట్లను తొలగించాలని తండావాసులు పలుమార్లు తాసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఎటువంటి స్పందన లభించకపోవడంతో వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
తక్కలపల్లి తండా పూర్తిగా ఎస్టీ కమ్యూనిటీకి చెందిన కుటుంబాలతో నిండి ఉండగా, సర్పంచ్ పదవి ఎస్టీ రిజర్వేషన్‌లో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో బోగస్ ఓట్ల సృష్టి రిజర్వేషన్ హక్కులను దెబ్బతీసే ప్రయత్నంగా తండావాసులు భావిస్తున్నారు. “మా తండాలో మా కుటుంబాలు మాత్రమే ఉన్నాయి. ఇతరులు దొంగ ఓట్లు చేర్చడం ద్వారా మా ఎన్నికల హక్కును హరిస్తున్నారు” అని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికల సమయంలో ఈ సమస్య మరింత తీవ్రతరం అయిందని, మొదటి విడత పోలింగ్ సందర్భంగా ఈ బోగస్ ఓట్లు ప్రభావం చూపే అవకాశం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు.
అధికారులు ఇప్పటికైనా స్పందించి బోగస్ ఓట్లను తొలగించి న్యాయం చేయాలని తండావాసులు వేడుకుంటున్నారు. తెలంగాణలో పంచాయతీ ఎన్నికల్లో బోగస్ ఓట్ల సమస్య ఎక్కడికక్కడ వెలుగులోకి వస్తోంది. ఎన్నికల సంఘం ఈ దిశగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# నట్స్ కుకీలను విడుదల చేసిన సన్‌ఫీస్ట్

**ఖైరతాబాద్, డిసెంబర్ 11 (జనం సాక్షి) :**
సన్‌ఫీస్ట్ వారి సరికొత్త ఆఫరింగ్ గా మామ్స్ మ్యాజిక్ ఫీ రోస్టెడ్ నట్స్ కుకీ లు నిలుస్తాయని ఐటీసీ లిమిటె డ్ ఫుడ్స్ డివిజన్ బిస్కెట్లు, కన్ఫెక్షన్స్ చీఫ్ ఎగ్జిక్యూ టివ్ ఆఫీసర్ కవితా చతుర్వేది అన్నారు. ఈ విడు దలతో, ఈ బ్రాండ్ వినియోగదారులను నెయ్యిలో వేయించిన నట్స్ కుకీల యొక్క అద్వితీయమైన రుచిని తిరిగి కనుగొనమని ఆహ్వానిస్తుందని తెలి పారు. ఇందులో జీడిపప్పులు మాత్రమే కాకుండా బాదం కూడా ఉంటుందని, అమ్మ ఇష్టపడే విధంగా తయారు చేయబడిందన్నారు. తరతరాలుగా తల్లు లు ఒక సాధారణ సత్యాన్ని పరిపూర్ణంగా అర్థం చేసుకున్నారు. నెయ్యిలో గింజలను వేయించడం వల్ల రుచి కంటే లోతైనది బయట పడుతుందన్నా రు. కొత్త చిత్రం గురించి ఓగిల్వీ సౌత్ చీఫ్ క్రియే టివ్ ఆఫీసర్ పునీత్ కపూర్ మాట్లాడుతూ ఇది ఒక ఆత్మీయమైన, ఆకర్షించే సువాసనను విడుదల చేస్తుందని అన్నారు. అది తాకిన ప్రతిదానిలోనూ పూర్తి రుచిని బయటకు తెస్తుందని అన్నారు.

## 2025లో ప్రజాదరణ పొందిన సినిమాలు,
# సిరీస్-25లను ప్రకటించిన ఐఎండిబి

**ఖైరతాబాద్, డిసెంబర్ 11 (జనం సాక్షి) :** సినిమాలు, టివి, సెలెబ్రిటీల గురించి సమాచారం కొరకు ప్రపంచంలో పేరుగాంచిన, ప్రామాణికమైన మూలము, ఐఎండిబి-25లో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఐఎండిబి వినియోగదారులలో ఆదరణ పొం దిన 10 భారతీయ సినిమాలు,10 సిరీస్ లను ప్రక టించినట్లు ఐఎండిబి ఇండియా హెడ్ యామిని పటోడియా గురువారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయన మాట్లాడు తూ ఐఎండిబి సంవత్సరాంతపు జాబితాలు ప్రపంచవ్యాప్తంగా ఐఎండిబికు 250 మిలియన్లకు పైగా ఏది చూడాలి అని కనుగొనుటకు, నిర్ణయించుటకు ఐఎండిబిపై ఆధారపడే నెలవారి సందర్శ కుల అసలైన పేజ్ వ్యూస్ పై ఆధారపడి ఉంటుందన్నారు. ఉత్తమ ప్రజాదరణ పొందిన 10 భారతీ య సినిమాల జాబితాలో సైయ్యారా, మహావతార్ నరసింహ, ఛావా, కాంతారా ఎ లెజెండ్ ఛాప్టర్-1, కూలీ, డ్రాగన్, సితారే జమీన్ పర్, దేవా, రెయిడ్-2, లోక చాప్టర్-1, అత్యంత ప్రజాదరణ పొందిన 10 భారతీయ సిరీస్ ది బాడ్స్ ఆఫ్ బాలీవుడ్, బ్లాక్ వారెంట్, పాతాళ్ లోక్ సీజన్-2, పంచాయత్ సీజన్-4, మండల మర్డర్స్, ఖాఫ్, స్పెషల్ ఓపిఎస్ సీజన్ -2, ఖాకీ ది బెంగాల్ చాప్టర్, ది ఫ్యామిలీ మ్యాన్ సీజన్-3, క్రిమినల్ జస్టిస్ ఎ ఫ్యామిలీ మాటర్




## సోడియం-అయాన్ ఎనర్జీ స్టోరేజ్‌ను ఆవిష్కరించిన
# న్యాక్సియాన్ ఎనర్జీ

**ఖైరతాబాద్, డిసెంబర్ 11 (జనం సాక్షి) :** దేశంలోని తొలి ప్రత్యేక సోడియం-అయాన్ ఎనర్జీ సంస్థగా పేరుపొందిన న్యాక్సియాన్ ఎనర్జీ(పూర్వపు సోడి యం ఎనర్జీ) భారత శక్తి రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక ముందడుగు వేసిందని న్యా క్సియాన్ ఎనర్జీ ఇండియా సీఈఓ అభిషేక్ రెడ్డి తెలిపారు. గురువారం బంజారాహిల్స్‌లోని మెర్క్యూరీ. హెూటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో డీఆర్‌డీఓ మాజీ ఛైర్మన్, రక్షణ మంత్రికి శాస్త్రీయ సలహాదారు జి.సతీష్ రెడ్డితో కలసి ఆయన మాట్లాడుతూ సోడియం-అయాన్ ఆధారిత స్టోరేజ్ వ్యవస్థలను మార్కెట్ లోకి తీసుకు వస్తున్నట్లు ప్రకటించారు. కొయంబత్తూ రులోని తమ తయారీ కేంద్రంలో పూర్తిగా డిజైన్, డెవలప్ చేసి, నిర్మించిన ఈ నూతన ఆల్-ఇన్-వన్ ఎనర్జీ ప్లాట్‌ఫారమ్‌లో బ్యాటరీ, ఇన్వర్టర్, సోలార్ ఎం.పి.పి.టి అన్నీ ఒకే వ్యవస్థలో నిక్షిప్తం అయ్యా యన్నారు. దీనితో భారత పవర్, బ్యాకప్ రంగంలో చాలా కాలంగా ఉన్న కీలక లోటును కంపెనీ పూరి స్తోందన్నారు. అదే, పాత తరహా లీడ్, అసిడ్ బ్యాటరీలకు భద్రతయుతమైన, తేలికైన, తక్కువ ఖర్చుతో కూడిన ప్రత్యామ్నాయం అన్నారు. ఈ టెక్నాలజీ గృహ, వాణిజ్య, పారిశ్రామిక, రక్షణ రంగాల్లో వేగంగా పెరుగుతున్న స్వచ్ఛమైన, విశ్వస నీయమైన, మెయింటెనెన్స్-ఫ్రీ ఎనర్జీ స్టోరేజ్ అవ సరాలను తీర్చేందుకు ప్రత్యేకంగా రూపుదిద్దుకుందని తెలిపారు.

# 30 సంవత్సరాల కాంగ్రెస్ కంచుకోటకు బీటలు

## కాంగ్రెస్ కంచుకోటలో బిఆర్ఎస్ ఘనవిజయం



**తాండూరు డిసెంబర్. 11(జనంసాక్షి) :**
వికారాబాద్ జిల్లా యాలాల మండలం దేవనూరు గ్రామంలో గత 30 సంవత్సరాలుగా కాంగ్రెస్ పాలన కొనసాగింది. 15సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా అంబురాములు కొనసాగారు. అదేవిధంగా ఐదు సంవత్సరాలుగా గ్రామానికి చెందిన ఆకుల ఉమాతి కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థిగా కొనసాగారు. మారోసారి దేవనూర్ గ్రామంలో జన్ రల్ రావడంతో మాజీ సర్పంచ్ అంబురాములు తనయుడు ఆకుల శివకుమార్ సర్పంచ్ బరిలో నిలిచి ఘన విజయం సాధించారు. అయితే ఈ సారి దేవనూరు గ్రామంలో సర్పంచ్ ఎన్నికలకు మహిళా జనరల్ రావడంతో ముగ్గురు మహిళలు పోటీపడ్డారు. ముగ్గురు మహిళలు గ్రామంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు అయినప్పటికీని గ్రామ ప్రజలు రేణుకా దేవికి విజయమందించి కాంగ్రెస్ కంచుకోటలో బిఆర్ఎస్ జెండా ఎగురవేశారు. దీంతో 30 సంవత్సరాల కాంగ్రెస్ కంచుకోటకు బీటలు ఏర్పడ్డాయని చెప్పుకోవచ్చు. ఈ సందర్భంగా దేవనూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా గెలుపొందిన రేణుక దేవి కిషన్ రావు మాట్లాడుతూ గ్రామ ప్రజలు తనను ఆదరించి గెలిపించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి పై 164 ఓట్లు మెజార్టీతో ఘనవిజయం సాధించారు. 764 ఓట్ల మెజార్టీతో విజయ డంక ముగించారు

# సుల్తంపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి విజయం



**మొయినాబాద్ డిసెంబర్ 11 జనంసాక్షి :**శంషాబాద్ మండల పరిధిలోని సుల్తాన్‌పల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి ఎలుగని ప్రభాకర్ గౌడ్ ను గ్రామ సర్పంచ్‌గా 199 ఓట్లతో ఘనవిజయం సాధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనను ఆదరించి గెలిపించిన గ్రామ ప్రజలకు ఎల్లపుడు గ్రామప్రజలకు అండగాఉంటానని అన్నిరంగాలలో అభివృధి చేస్తానన్నారు. రాష్ట్రంలో ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుతున్నని తెలిపారు.

## మృతి చెందిన అభ్యర్థికి
# ‘జై’ కొట్టిన జనం!

- రాష్ట్ర పంచాయతీ ఎన్నికల్లో సంచలనం.
- గుండెపోటుతో మరణించినా 700కు పైగా ఓట్లతో గెలుపు
- సానుభూతి ఓట్లతో గ్రామస్తుల నివాళి
- బీఆర్ఎస్ అభ్యర్థి చెర్ల మురళి సంచలన విజయం



**వేములవాడ, డిసెంబర్ 11 (జనం సాక్షి):** తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో అనూహ్య సంఘటన చోటుచేసుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం చింతల్ ఠాణా ఆర్ అండ్ ఆర్ కాలనీ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా బీఆర్ఎస్ తరపున పోటీ చేసిన చెర్ల మురళి (50) గుండెపోటుతో మరణించినా, మృతి తర్వాత కూడా భారీ మెజారిటీతో గెలుపొందాడు. గత గురువారం (డిసెంబర్ 4) మురళి మరణించినా, ఆయన పేరు బ్యాలెట్‌లో ఉండటంతో ఓటింగ్ సాధారణంగా జరిగింది. గురువారం (డిసెంబర్ 11) కౌంటింగ్‌లో సుమారు 700కు పైగా ఓట్లు సాధించి, 378 ఓట్ల మెజారిటీతో విజయం సాధించాడు.
గ్రామస్తులు మురళికి ‘జై’ కొట్టి, ఆయనకు నివాళిగా ఓటు వేశారు. మురళి గ్రామంలో మంచి పేరు, అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాత్ర గ్రామస్తుల్లో సానుభూతిని రేకెత్తించింది. మరణం తర్వాత ఆయన తరపున ప్యానల్ వార్డు మెంబర్ అభ్యర్థులు ప్రచారం చేసి, “మురళి ఆశయాలను మేమే నెరవేరుస్తాం” అని హామీ ఇవ్వడంతో ఓటర్లు ఆకట్టుకున్నారు. ఫలితాలు తెలిసిన వెంటనే గ్రామంలో శోకాందోళనల మధ్య ఆనందం నెలకొంది. గ్రామస్తులు “మురళి స్ఫూర్తిని కొనసాగిస్తాం” అంటూ భావోద్వేగంగా మాట్లాడారు. ఎన్నికల చట్టం (1951) ప్రకారం, అభ్యర్థి మరణం తర్వాత పేరు బ్యాలెట్‌లో ఉంటే ఓటింగ్ వాయిదా కాదు. గెలిస్తే స్థానం ఖాళీగా మిగిలి, పార్టీ తరపున మరొకరు చేర్చబడతారు. ఈ ఘటన తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో సంచలనంగా మారింది. బీఆర్ఎస్ నాయకులు “మురళి విజయం పార్టీ బలాన్ని చూపిస్తుంది” అంటూ స్వాగతించారు. ఇలాంటి సంఘటనలు భారత చరిత్రలో అరుదు. ఈ విషయంపై ఎన్నికల అధికారం వివరణ కోరగా ఎన్నికల ఫలితాలు చెప్పడం జరగదని, ఈ సంఘటనపై రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు నివేదిక అందజేస్తామన్నారు. 2022లోనే నిజామాబాద్‌లో సర్పంచ్ అభ్యర్థి మరణంతో తల్లి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామీణ ఎన్నికల్లో భావోద్వేగ ఓట్ల పాత్ర ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది.

జనంసాక్షి www.janamsakshi.org | శుక్రవారం 12 డిసెంబర్ 2025

## గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణానికి సందర్శకుల తాకిడి

- రెండోరోజున పెద్దఎత్తున తరలిరాక



హైదరాబాద్, డిసెంబర్11 (జనంసాక్షి) : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ స్టాళ్లు, కార్పొరేట్ కంపెనీల స్టాళ్లను గురువారం కూడా పెద్ద ఎత్తున సాధారణ ప్రజలు, విద్యార్థులు సందర్శించారు. ఉదయం నుండే పెద్ద సంఖ్యలో ఈ స్టాళ్లను దర్శించడానికి బారులు తీరారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ రెండో రోజు కార్యక్రమాలు 'డిస్కవర్ తెలంగాణ: కల్చరల్ హెరిటేజ్ అండ్ నెక్స్ట్ జెన్ టూరిజం' అనే అద్భుతమైన సదస్సుతో ప్రారంభమైంది. వివిధ కాలేజీల నుంచి వచ్చిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ సదస్సులో పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. తెలంగాణ చరిత్ర, మ్యూజియం సంస్కృతి, పర్యాటక అభివృద్ధి, ఆహార సంస్కృతి తదితర విభిన్న కోణాల్లో విలువైన విశ్లేషణలను ఈ సదస్సులో పాల్గొన్న వక్తలు వివరించారు. తెలంగాణను ప్రపంచ స్థాయిలో ఒక సాంస్కృతిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశాలను వీరు వివరించారు. ఈ సదస్సులో డా. మామిడి హరి కృష్ణ, బిరద్ రాజారామ్, పి. పద్మావతి, గోపీ బైల్లుప్పాల లు పాల్గొని మాట్లాడారు. అనంతరం, తెలంగాణ రైజింగ్– ఎంపవరింగ్ ఆల్, గ్రోవింగ్ టుగెదర్ అనే సదస్సులో ప్రముఖులు విద్యార్థులతో సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు సంవత్సరాలుగా చేపట్టిన ప్రగతిని మరియు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలపై క్లుప్తంగా వివరించారు ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులతో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు ఈ సదస్సు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏరోస్పేస్, మూసీ రివర్ డెవలప్మెంట్, హ్యాండీ క్రాఫ్ట్స్, టూరిజం, ఎడ్యుకేషన్, కరీంనగర్ ఇక్కత్, ఫిలిగ్రి,చేర్యాల పెయింటింగ్స్, సైబర్ క్రైమ్ చెదనలో ఉపయోగించే పలు ఆధునాతన పరికరాలు,డ్రోన్స్ , రోబో తదితర 27 కు పైగా స్టాళ్లను సందర్శకులు అత్యంత ఆసక్తిగా తిలకించారు. ప్రధానంగా, ఆధునిక పరికరాలు, వైమానిక అంశాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. కాగా, రేపు శుక్రవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 7 గంటలవరకు ఈ గ్లోబల్ సదస్సు ను సందర్శించవచ్చని ఒక ప్రకటనలో తెలిపారు.

## కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా ఆధునిక వైద్యసేవలు

- రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి దామోదర రాజనర్సింహా



హైదరాబాద్ (జనంసాక్షి) : కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా ప్రజలందరికీ ఆధునిక వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఉన్న బైపాస్ రోడ్డులోని రెవిన్యూ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ శ్యామ్ ఈఎన్టీ, జనరల్ హాస్పిటల్ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అన్ని విభాగాలను, ఆధునికంగా ఏర్పాటు చేసిన ఏకీప్మెంట్ ను పరిశీలించారు. ఆసుపత్రిలో అందించే వైద్య సేవలను డాక్టర్ లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో విద్య, వైద్యరంగాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నా మన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలందరికీ ఉచితంగా కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ఆధునిక వైద్యసేవలను అందిస్తున్నా మన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో అన్ని సదుపాయాలతో ప్రయివేట్ రంగంలో ఈఎన్టీ, జనరల్ వైద్యసేవలను ప్రజలకు అందించేందుకు ముందుకు వచ్చిన డాక్టర్ శ్యామ్ ఆసుపత్రి నిర్వాహకులకు, డాక్టర్లకు, నర్సింగ్ సిబ్బంది కి మంత్రి అభినందనలు తెలిపారు.

## లోక్సభలో ఈ- సిగరెట్ దుమారం

- అనురాగ్ ఠాకూర్ ప్రస్తావన..స్పీకర్ ఆగ్రహం




న్యూఢిల్లీ, డిసెంబర్11 (జనంసాక్షి) : పార్లమెంట్లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ ఎంపీ.. సభా పరిసరాల్లోనే ఈ–సిగరేట్ తాగినట్లు బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ ఆరోపించారు. లోక్సభలో ఆయన ఈ విషయాన్ని స్పీకర్ ఓం బిర్లా ముందు ప్రస్తావించారు. అయితే ఆ ఈ–సిగరేట్ తాగిన వ్యక్తిపై చర్యలు తీసుకోనున్నట్లు స్పీకర్ బిర్లా పేర్కొన్నారు. ఇలా ఎవరు చేసినా సహించేది లేదన్నారు. ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రశ్నోత్తరాల సమయంలో సప్లిమెంటరీ అడిగిన సమయంలో బీజేపీ ఎంపీ ఆ విషయాన్ని గుర్తు చేశారు. సభలో ఈ–సిగరెట్లకు అనుమతి ఉందా అని ఎంపీ అనురాగ్.. స్పీకర్ బిర్లాను అడిగారు. లేదు అని ఆయన సమాధానం ఇచ్చారు. అయితే గత కొన్ని రోజుల నుంచి టీఎంసీ ఎంపీ సభలో ఈ–సిగరేట్ తాగుతున్నట్లు ఎంపీ ఠాకూర్ ఆరోపించారు. ఆ ప్రతిపక్ష ఎంపీపై చర్యలు తీసుకోవాలని అనేకమంది బీజేపీ సభ్యులు డిమాండ్ చేశారు. భారీగా నినాదాలు రావడంతో.. సభ్యుల్ని స్పీకర్ బిర్లా శాంతపరిచారు. హుందాగా వ్యవహరించాలన్నారు. ఒకవేళ ఏదైనా లిఖితపూర్వక ఫిర్యాదు నమోదు చేస్తే, అప్పుడు ఆ ఎంపీపై చర్యలు తీసుకుంటానన్నారు. కొన్నేళ్ల క్రితమే ఇండియాలో ఈ–సిగరేట్లను నిషేధించారు. అయితే సోషల్ మీడియా పుకార్ల ప్రకారం.. టీఎంసీ ఎంపి మహువా మైత్రి.. పార్లమెంట్లో ఈ–సిగరేట్లు తాగుతున్నట్లు తెలిసింది.

## హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడిగా ప్రవాస భారతీయుడు

- ఉదయ్ నాగరాజు ఎన్నికపై కెటిఆర్ అభినందనలు



హైదరాబాద్, డిసెంబర్11 (జనంసాక్షి) : బ్రిటన్ ఎగువ సభ హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడిగా ప్రవాస భారతీయుడు ఉదయ్ నాగరాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా ఆయన ప్రస్థానాన్ని కొనియాడారు. ఇంగ్లండ్ రాజు చేతుల మీదుగా హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడిగా నామినేట్ అయినందుకు ఉదయ్ నాగరాజు మనస్ఫూర్తిగా అభినందనలు తెలుపుతున్నానన్నారు. యూకేలో పబ్లిక్ ఆఫీస్ కోసం పోటీ చేయడం దగ్గరి నుంచి మొదలుకొని.. నేడు ఈ అరుదైన గౌరవం దక్కించుకోవడం వరకు ఆయన ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. కొత్త బాధ్యతల్లో మీకు అంతా మంచే జరగాలని, మరిన్ని విజయాలు సాధించాలని కేటీఆర్ ఆకాంక్షించారు. ఉదయ్ నాగరాజు స్వస్థలం సిద్దిపేట జిల్లా కొహెడ మండలం శనిగరం. సామాన్య మధ్య తరగతి కుటుంబంలో హనుమంత రావు–నిర్మలాదేవి దంపతులకు జన్మించారు. ఆయన వరంగల్, హైదరాబాద్లో చదువు కున్నారు. బ్రిటన్లోని ప్రముఖ యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ లండన్లో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్లో పీజీ చేశారు. ఆయన ఏఐ ప్రభావాన్ని ముందే పసిగట్టి ఏఐ పాలసీ లాబ్స్ పేరుతో థింక్ ట్యాంక్ని నెలకొల్పారు. అలాగే, అంతర్జాతీయ స్థాయిలో వక్తగా పేరుపొందారు. ఇక హౌస్ ఆఫ్ లార్డ్స్కు సభ్యులను ప్రధాని సలహా మేరకు ఇంగ్లండ్ రాజు నామినేట్ చేస్తుంటారు. రాజకీయ పార్టీలు, స్వతంత్ర కమిటీ, ప్రజల నుంచి సైతం నామినేషన్లు వస్తుంటాయి. నైపుణ్యం, అనుభవం, దేశానికి చేసిన సేవ ఆధారంగా హౌస్ ఆఫ్ లార్డ్స్కి ఎంపిక చేస్తారు. బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్ పని చట్టాలను రూపొందించడం, ప్రభుత్వాన్ని పర్యవేక్షించడం, తదితర అంశాలపై చర్చించడం వంటి విధులు నిర్వహిస్తుంది.

## బంగారం, వెండి ధరల దూకుడు

- రెండు లక్షలకు చేరువలో కిలో వెండి



న్యూఢిల్లీ, డిసెంబర్11 (జనంసాక్షి) : దేశీయంగా బంగారం, వెండి ధరలు మరోసారి పెరిగాయి. వెండి దూకుడు మామూలుగా లేదు. కిలో వెండి ధర రూ. 1,95,400 మార్కును చేరుకొని రూ. 2 లక్షల దిశగా దూసుకెళుతోంది. అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర కోత పెట్టడంతో అంతర్జాతీయ మార్కెట్లో వీటి ధరలు పెరిగాయి. మార్కెట్ అంచనాలకు అనుగుణంగా రేట్లలో కోత ఉన్నప్పటికీ.. భవిష్యత్ వడ్డీ రేట్ల కోతపై అనిశ్చితి కొనసాగుతోంది. దీంతో బంగారం ధరలు స్వల్ప మొత్తంలో పెరగ్గా.. వెండి మాత్రం సరికొత్త గరిష్ఠాలను తాకింది. అంతర్జాతీయ విపణిలో స్పాట్గోల్డ్ ఔన్సు 4,216 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. వెండి ఔన్సు 62 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఇక హైదరాబాద్ బులియన్ మార్కెట్లో గురువారం మధ్యాహ్నం నాటికి 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,34,000గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ. 1,19,350 పలుకుతోంది. కిలో వెండి ధర రూ. 1,95,400 మార్కును చేరుకొని రూ. 2 లక్షల దిశగా దూసుకెళుతోంది.

## కబ్జా చేసినట్లు రుజువు చేస్తే జైలుకెళతా

- కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



హైదరాబాద్, డిసెంబర్11 (జనంసాక్షి) : తాను ఎలాంటి కబ్జాలకు పాల్పడ లేదని.. తానేంటో ప్రజలకు తెలుసునని కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పష్టం చేశారు. తాను కబ్జాలకు పాల్పడినట్లు వస్తున్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఐడీపీఎల్ భూముల కబ్జాపై తనపై ఇద్దరు నేతలు అసత్య ప్రచారం చేయిస్తున్నారని మండిపడ్డారు. ఆ భూముల్లో నివాసం ఉంటున్న పేదల జోలికి వెళ్తే ఆత్మాహుతి చేసుకుంటానని ఆయన హెచ్చరించారు. ఆ భూముల్లో తాను గజం జాగా కబ్జా చేశానని నిరూపిస్తే.. తాను జైలుకెళ్లేందుకు సిద్ధమని చెప్పారు. రూ. 4 వేల కోట్ల విలువైన భూ వివాదంపై లోతుగా దర్యాప్తు చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా పాల్పడుతున్నారని తాను గతంలోనే చాలాసార్లు ఫిర్యాదు చేశానని ఆయన గుర్తు చేశారు. అక్కడ స్థానికంగా ఉంటున్న ఇంద్రనగర్ 70 ఏళ్ల క్రితం ఏర్పడిందని తెలిపారు. అక్కడ నివసిస్తున్న ప్రజల కోసం డ్రైనేజీ, రహదారుల సౌకర్యం కల్పించాలంటూ జీహెచ్ఎంసీ నుంచి గతంలో నిధులు తీసుకొచ్చానని వివరించారు. అయితే ఐడిపిఎల్ ఉద్యోగులను తాను బెదిరించాననేది పూర్తిగా అవాస్తవమని ప్రకటించారు. ఈ ఆరోపణలను తాను పూర్తిగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.. ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత మాధవరం కృష్ణారావుపై ఆరోపణలు చేశారు. ఈ వ్యాఖ్యలపై బుధవారం ఎమ్మెల్యే కృష్ణారావు కాస్తా ఘాటుగా స్పందించారు. దాంతో ఎమ్మెల్యే కృష్ణారావుపై జాగృతి నేతలతోపాటు అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. ఆధారాలతో సహా అన్ని విషయాలు బయటపెడతానంటూ కవిత స్పష్టం చేశారు.

## నరసాపురం వరకు వందేభారత్ పొడిగింపు

### 15 నుంచి జనవరి 11 వరకు అమలు



చెన్నై, డిసెంబర్11 (జనంసాక్షి) : చెన్నై సెంట్రల్–విజయవాడ మధ్య నడుపుతున్న వందే భారత్ రైళ్లను పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వరకు తాత్కాలికంగా పొడిగించారు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... నెం. 20677 చెన్నై సెంట్రల్–నరసాపురం వందే భారత్ ఎక్స్ప్రెస్ ఈ నెల 15 నుంచి జనవరి 11వ తేది వరకు చెన్నై సెంట్రల్లో ఉదయం 5.30 గంటలకు బయల్దేరి 7.05 గంటలకు రేణిగుంట, 8.29 గంటలకు నెల్లూరు, 9.43 గంటలకు ఒంగోలు, 11.08 గంటలకు విజయవాడ, మధ్యాహ్నం 12.29 గుడివాడ, 1.14 గంటలకు భీమవరం టౌన్, 2.10 గంటలకు నరసాపురం చేరుకుంటుంది. మరుమార్గంలో, నెం. 20678 నరసాపురం–చెన్నై సెంట్రల్ వందే భారత్ ఈ నెల 17 నుంచి జనవరి 11వ తేది వరకు నరసాపురం(ఔజీసజీబజూబీసజీప)లో మధ్యాహ్నం 2.50 గంటలకు బయల్దేరి 3.19 గంటలకు భీమవరం టౌన్, సాయంత్రం 4.04 గంటలకు గుడివాడ, 4.50 గంటలకు విజయవాడ, 6.29 గంటలకు ఒంగోలు, రాత్రి 7.39 గంటలకు నెల్లూరు, 9.50 గంటలకు రేణిగుంట, 11.45 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుందని దక్షిణ రైల్వే తెలిపింది.

## జిల్లాలో ఎన్నికల తీరును పరిశీలించిన అధికారి

నారాయణపేట, డిసెంబర్11 (జనంసాక్షి) : పంచాయతీ మొదటి విడత ఎన్నికల పోలింగ్ నారాయణపేట జిల్లాలో ప్రశాంతంగా కొనసాగింది. గురువారం ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం వరకు కొనసాగింది. గడువులోగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు వచ్చిన ఓటర్లను క్యూలైన్లో ఉంచి వారికి టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకురాలు సీతాలక్ష్మి మద్దూరు మండలంలోని పెదిరిపాడు, చెన్నారెడ్డి పల్లి, కొత్తపల్లి మండల కేంద్రం, కొత్తపల్లి తండా లోని పోలింగ్ కేంద్రాలను ఆమె సందర్శించి పోలింగ్ పక్రియను పరిశీలించారు. పోలింగ్ నమోదు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఓటర్లతో ఆమె మాట్లాడి సౌకర్యాల గురించి ఆరా తీశారు.

## బ్యాలెట్లో కనిపించని గుర్తు


### వార్డు ఎన్నిక నిలిపివేత



నాగర్ కర్నూల్, డిసెంబర్11 (జనంసాక్షి) : జిల్లాలోని వెల్దండలో ఓ వార్డులో ఓటింగ్ నిలిచిపోయింది. మండలం కుప్పగండ్ల గ్రామ పంచాయతీలోని పదో వార్డులో అభ్యర్థికి గుర్తు కేటాయించ లేదు. వార్డు సభ్యుడి ఎన్నికకు ముగ్గురు అభ్యర్థులు పోటీ చేశారు. అయితే, ఎన్నికల సంఘం తరపున వచ్చిన బ్యాలెట్ పత్రాలత్లో యాదయ్య అనే అభ్యర్థికి కేటాయించిన గుర్తు కనిపించలేదు. దాంతో ఓటర్లంతా షాక్ అయ్యారు. ఒక అభ్యర్థికి గుర్తు కేటాయించపోవడంతో సదరు అభ్యర్థి ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో పోలింగ్ను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు.

## సర్పంచ్ ఎన్నికను బహిష్కరించిన గ్రామస్తులు

కామారెడ్డి, డిసెంబర్11 (జనంసాక్షి) : తెలంగాణలో తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ఉదయం 7 గంటలకు పోలింగ్ మొదలవగా.. మధ్యాహ్నం 1 గంటల వరకు ముగిసాయి. ఉదయం నుంచే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే పోలింగ్ నేపథ్యంలో పల్లెల్లో సందడి వాతావరణం నెలకొనగా కామారెడ్డిలోని ఓ గ్రామంలో మాత్రం ప్రజలు ఎన్నికలను బహిష్కరించారు. దీంతో ఆ గ్రామంలో సర్పంచ్ ఎన్నికకు బ్రేక్ పడిన్లట్టైంది. జిల్లాలోని రామారెడ్డి మండలం చిన్న గోకుల్ తండా వాసులు ఎన్నికలను బహిష్కరించారు. తమకు సమాచారం ఇవ్వకుండా పెద్ద గోకుల్ తండా వాసులు సర్పంచ్ను ఏకగ్రీవం చేసుకున్నారని గ్రామస్తులు నిరసనకు దిగారు. పెద్ద గోకుల్ తండా వాసిని వేలం పాట ద్వారా ఏకగ్రీవం చేసుకున్నారని చిన్న గోకుల్ తండా వాసులు ఆరోపిస్తున్నారు. ఇందుకు నిరసనగా చిన్న గోకుల్ తండా వాసులు ఓట్లు వేయకుండా తండాల్లోనే ఉండిపోయారు. తమకు ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయలని వారు డిమాండ్ చేస్తున్నారు. మరి చిన్న గోకుల్ తండా వాసుల డిమాండ్ పట్ల అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.



## ప్రజాసేవకు అంకితమైన నేత ప్రణబ్ ముఖర్జీ

### జయంతి సందర్భంగా సిఎం రేవంత్ నివాళి

న్యూఢిల్లీ, డిసెంబర్11 (జనంసాక్షి) : భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ జయంతి సందర్భంగా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. దశాబ్దాల పాటు ప్రజాసేవకు అంకితమైన గొప్ప నాయకుడు ప్రణబ్ ముఖర్జీ.. అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ జయంతి సందర్భంగా.. ఢిల్లీలోని నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి.. ప్రణబ్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా.. ప్రణబ్ ముఖర్జీ దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీలు డా.మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, గడ్డం వంశీ, అనిల్ కుమార్ యాదవ్, నాయకులు రోహిన్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో అఖండ టిక్కెట్ ధరల పెంపు

### ఉత్వర్వులను తిరస్కరించిన హైకోర్టు

హైదరాబాద్, డిసెంబర్11 (జనంసాక్షి) : నందమూరి బాలకృష్ణ నటించిన 'అఖండ 2: తాండవం' మూవీ రిలీజ్ డేట్ ఏ మూహూర్తంలో ప్రకటించారో కానీ.. వరుసగా అవాంతరాలు ఎదురవుతూనే ఉన్నాయి. తాజాగా ఈ మూవీకి హై కోర్టు మరో షాక్ ఇచ్చింది. మరికొన్ని గంటల్లో మూవీ రిలీజ్ కావాల్సి ఉండగా.. ప్రీమియం షోకు ధరల పెంపుపై ప్రభుత్వ జీవోను హైకోర్టు సస్పెండ్ చేసింది. అంతే కాదు ఫిలిం డెవలప్మెంట్ కార్పోరేషన్కు, సినీ నిర్మాణ సంస్థకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ నేటికి వాయిదా వేసింది. ఇటీవల రేవంత్ సర్కార్ స్పెషల్ షోతో పాటు టికెట్లు ధరలు పెంచుతూ జారీ చేసిన జీవోను కోర్టు రద్దు చేసింది. అఖండ -2 మూవీకి డిసెంబర్ 12 నుంచి 14 వ తేదీ వరకు టికెట్ ధరలు పెంచుకోవచ్చునని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇటీవల అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వులు ప్రకారం సింగిల్ స్క్రీన్ థియేటర్లో టికెట్ పై రూ. 50, మల్టీప్లెక్స్లో రూ. 100 అదనంగా వసూలు చేసుకోవచ్చునని స్పష్టం చేసింది. అలాగే డిసెంబర్ 11వ తేదీన ప్రీమియర్ షో టికెట్ ధరను రూ. 600గా నిర్ణయించేందుకు సర్కార్ అంగీకరించింది. కాకపోతే టికెట్ ధరల పెంపు ద్వారా వచ్చే లాభాల్లో 20 శాతాన్ని సినీ కార్మికుల సంక్షేమానికి ఉపయోగించాల్సిందిగా మూవీ మేకర్స్కి షరతు విధించింది. ప్రభుత్వం జారీ చేసిన జీవోను రద్దు చేయాలంటూ హైకోర్టును అద్వకేట్ ఆశ్రయించడం.. ఈ పిటిషన్పై విచారణ జరగడం ఆసక్తిగా మారింది. వాస్తవానికి ఈ మూవీ డిసెంబర్ 5వ తేదీన రిలీజ్ కావాల్సి ఉంది. అయితే.. ఈ మూవీపై స్టే విధిస్తూ తీర్పు ఇచ్చింది చెన్నై హై కోర్టు. ఈరోస్ ఇంటర్నేషనల్ సంస్థ తమకు 14 రీల్స్ సంస్థ నుంచి నగదు రావాల్సి ఉందని.. అది క్లీయర్ అయ్యే వరకు ఈ చిత్రం విడుదలను అడ్డుకుంటామని పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై సుధీర్ఘ విచారణ తర్వాత ఈరోస్ మూవీ రిలీజ్కు అనుమతి ఇచ్చింది. మొత్తానికి ఈ చిత్రం రేపు.. అంటే శుక్రవారం భారీ అంచనాలతో విడుదల కానుంది. దీంతో మూవీ మేకర్స్కు మరో ఎదురు దెబ్బ తగిలినట్లు అయింది.

## గురజాల సబ్ డివిజన్ పరిధిలో 144 సెక్షన్

- మాచర్ల కోర్టులో లొంగిపోయిన పిన్నెల్లి సోదరులు

పల్నాడు, డిసెంబర్11 (జనంసాక్షి) : వైసిపి నేత, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి కోర్టులో లొంగిపోయారు. గురువారం ఉదయం పల్నాడు జిల్లా మాచర్లలోని జూనియర్ అదనపు సివిల్ జడ్జి కోర్టుకు వారిద్దరూ వచ్చారు. ఈ ఏడాది మే 24న పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడులో తెలుగుదేశం పార్టీ నాయకులు జవిశెట్టి వెంకటేశ్వర్లు, జవిశెట్టి కోటేశ్వరరావు దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితులుగా ఉన్న వైసిపి మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి (ఏ6), ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి (ఏ7) సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గురువారం మాచర్ల కోర్టులో లొంగిపోయారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం పిన్నెల్లి సోదరులు చేసిన అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. అనంతరం వారు సుప్రీంకోర్టును ఆశ్రయించగా నవంబర్ 28న సుప్రీంకోర్టు వీరి ముందస్తు బెయిల్ను రద్దు చేసి, రెండు వారాల్లోగా కింది కోర్టు ముందు లొంగిపోవాలని ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు విధించిన గడువు ముగియనుండటంతో పిన్నెల్లి సోదరులు కోర్టులో లొంగిపోయారు. ఈ క్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గురజాల సబ్ డివిజన్ పరిధిలో 144 సెక్షన్ విధించారు. దానితోపాటు పోలీస్ యాక్ట్ 30ను అమలు చేస్తున్నారు. పలువురు వైసీపీ నాయకులకు ముందస్తు చర్యల్లో భాగంగా హౌజ్ అరెస్టు చేశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370